thechurakalu@gmail.com
www.churakalu.com
editor@churakalu.com

RNI. NO. TEL TEL/2006/16536
Postal Regd. No. H/KAR/90/06-08

# చురకలు

సాయంకాల దినపత్రిక

Published from Karimnagar, Hyderabad, Adilabad, Warangal

సంపుటి - 20 సంచిక - 161 | కరీంనగర్ మంగళవారం, 19 ఆగష్టు 2025 ఎడిటర్ - మొహ్మద్ ఇమ్రాన్ | పేజీలు - 12 + 8 జిల్లా అనుబంధం వెల - 1.00

## వాయుసేనలో ప్రైవేటు భాగస్వామ్యం తప్పనిసరి

న్యూఢిల్లీ : భారత వాయుసేన సామర్థ్యం పెంపునకు ప్రైవేటు భాగస్వామ్యాన్ని తీసుకోక తప్పదని ఉన్నత స్థాయి కమిటీ అభిప్రాయపడింది. స్వల్పకాలిక, దీర్ఘకాలిక చర్యల్లో భాగంగా ప్రైవేటు సంస్థల సహకారం తీసుకొని లోటుపాట్లను సరిదిద్దుకో వాల్సి ఉందని తెలిపింది. సకాలంలో యుద్ధ విమానాలు అందక ఇబ్బం దులు ఎదురవుతున్నట్టు సాక్షాత్తూ వాయుసేన అధిపతి ఎయిర్ చీఫ్ మార్షల్ ఎ.పి.సింగ్ బహిరంగంగా చెప్పిన నేపథ్యంలో కమిటీ చేసిన ఈ సూచనకు ప్రాధాన్యం ఏర్పడింది. రక్షణ శాఖ కార్యదర్శి రాజేష్ కుమార్ ఆధ్వర్యంలోని సాధికారిక కమిటీ రక్షణ మంత్రికి అందజేసిన నివేదికలో ప్రైవేటు భాగస్వామ్యాన్ని ప్రస్తావించింది. యుద్ధ విమానాల తయారీ, ఇతర అంశాల్లో ప్రైవేటు భాగస్వామ్యం తీసుకోవాలని ఉన్నత స్థాయి కమిటీ సిఫార్సు చేసింది.

# బహుజనుల అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం




## కాంగ్రెస్‌తోనే బహుజనులకు రాజ్యాధికారం : సీఎం రేవంత్ రెడ్డి..

హైదరాబాద్: బహుజనుల సామ్రాజ్యాన్ని స్థాపించిన గొప్ప పోరాట యోధుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ మహారాజ్ అని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కొనియాడారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం మైనింగ్ పేరుతో ఖిలాషాపూర్ కోట చరిత్రను కాలగర్భంలో కలిపేందుకు కుట్ర చేసిందని ఆయన ఆరోపించారు. ఇవాళ(సోమవారం) సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ మహారాజ్? జయంతి సందర్భంగా హైదరాబాద్ ట్యాంక్ బండ్‌పై ఆయన విగ్రహం ఏర్పాటుకు రేవంత్ రెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా పాపన్న గౌడ్‌పై ప్రశంసల వర్షం కురిపించారు. గత ప్రభుత్వం ఖిలాషాపూర్ కోటపై కుట్రలు చేసిందని.. ఆనాడే కోటపైకి వెళ్లి దాన్ని కాపాడి చారిత్రక పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చామని గుర్తు చేశారు రేవంత్ రెడ్డి. ప్రపంచంలోనే మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్‌ను తీర్చిదిద్దే నాయకత్వాన్ని గాంధీ కుటుంబం అందించిందని చెప్పుకొచ్చారు రేవంత్ రెడ్డి. ఆ వారసత్వాన్ని కొనసాగిస్తూ దేశ సమగ్రత కోసం కాంగ్రెస్ అగ్రనేత, ఎంపీ రాహుల్ గాంధీ.. భారత్ జోడో యాత్ర నిర్వహించారని పేర్కొన్నారు. ఆ సందర్భంగా కులగణన చేసి తీరుతామని తెలంగాణ ప్రజలకు మాట ఇచ్చారని, గాంధీ కుటుంబం మాట ఇచ్చిందంటే అది శిలాశాసనమే అని చెప్పుకొచ్చారు. రాహుల్ గాంధీ ఇచ్చిన మాట ప్రకారం దేశంలో ఏ రాష్ట్రం చేయని పనిని తెలంగాణలో తాము చేసి చూపించామంటూ గర్వంగా చెప్పారు సీఎం. పక్కా ప్రణాళిక ప్రకారం శాస్త్రీయంగా కులగణన చేసి చూపించామని ధీమా వ్యక్తం చేశారు. కులగణన ద్వారా బహుజనుల సంఖ్య 56.33 శాతంగా ఉందని తేల్చామని తెలిపారు. విద్య, ఉద్యోగ, ఉపాధితోపాటు రాజకీయాల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ రెండు వేర్వేరు చట్టాలు చేసి కేంద్రానికి పంపామని గుర్తు చేశారు. గత ప్రభుత్వంలో కేసీఆర్ చేసిన చట్టం బీసీలకు శాపంగా మారిందని, అందుకే దాన్ని సవరిస్తూ చేసిన ఆర్డినెన్స్ గవర్నర్‌కు పంపితే ఆయన రాష్ట్రపతికి పంపారని వెల్లడించారు. 5 నెలలు గడిచినా బిల్లులను ఆమోదించకపోవడంతో బహుజనుల కోసం ఢిల్లీలో ధర్నా సైతం చేశామని పేర్కొన్నారు. బహుజనుల కోసం తాము చేసిన ధర్నాకు బీజేపీ, బీఆర్ఎస్ పార్టీల నేతలు ఎందుకు రాలేదంటూ సీఎం రేవంత్ ప్రశ్నించారు. బీసీ రిజర్వేషన్లు అడ్డుకుంటుంది కిషన్ రెడ్డి, నరేంద్ర మోదీ కాదా? అంటూ నిలదీశారు. మత ప్రాతిపదికన రిజర్వేషన్లు చట్టంలోనే లేదు.. ఎందుకు అబద్ధాలతో బహుజనులకు అన్యాయం చేయాలని చూస్తున్నారని ధ్వజమెత్తారు. మహారాష్ట్ర, గుజరాత్, ఉత్తరప్రదేశ్‌లో బీసీల్లో ముస్లింలకు రిజర్వేషన్లు తొలగించగలరా? అంటూ సూటి ప్రశ్నలు వేశారు ముఖ్యమంత్రి. 56 ఏళ్లుగా ఇవి అమలు జరుగుతున్నాయని, మతం ముసుగులో బహుజనుల రిజర్వేషన్లను అడ్డుకుంటున్నారని మండిపడ్డారు. రాహుల్ గాంధీపై కోపం ఉంటే ఆయనపైనే చూపాలని.. అంతేగాని ఆయన సిద్ధాంతాలపై చూపొద్దంటూ హితబోధ చేశారు. రాహుల్ గాంధీ సూచనలను అమలు చేయడం తమ బాధ్యతని, సమస్య వచ్చినప్పుడు పోరాడేందుకు బహుజనుల నైతిక మద్దతు ఉండాలని కోరారు. విద్య ఒక్కటే బహుజనుల తలరాతలు మారుస్తుందని, నాణ్యమైన చదువు, ఉద్యోగాలు ఇచ్చే బాధ్యత కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకుంటుందని ఉద్ఘాటించారు. బహుజనులంతా ఉన్నత చదువులు చదివి రాజ్యాధికారం సాధించాలని, బడుగు బలహీన వర్గాలకు రాజ్యాధికారం వచ్చినప్పుడే సమాజం బాగుపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. విగ్రహాలు అనేవి వర్ధంతులు, జయంతుల కోసం కాదని, వారి స్ఫూర్తిని రగిలించిందుకే అని చెప్పుకొచ్చారు. అందుకే రాష్ట్రానికి గుండెకాయ లాంటి సచివాలయం సమీపంలో పాపన్న గౌడ్ విగ్రహం ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు రేవంత్.




### కేంద్రం యూరియా ఇవ్వడం లేదు.. పార్లమెంటులో కాంగ్రెస్ ఏంపీల వాయిదా తీర్మానం

ఢిల్లీ: తెలంగాణ రాష్ట్రంలో యూరియా కొరతపై పార్లమెంటులో తెలంగాణ కాంగ్రెస్ ఏంపీలు వాయిదా తీర్మానం ఇచ్చారు. వాయిదా తీర్మాన ప్రతిపాదనను లోకసభ సెక్రటరీ జనరల్‌కు ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి పంపారు. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌కు తెలంగాణ రాష్ట్రానికి 9.80 లక్షల మెట్రిక్ టన్నులు యూరియాను కేంద్రం కేటాయించిందని తెలిపారు. కానీ ఇప్పటి వరకు కేవలం 4.50 లక్షల మెట్రిక్ టన్నులు యూరియా మాత్రమే సరఫరా చేసిందని చెప్పారు. ఆగస్టు 13వ తేదీ వరకు ఇంకా 6.60 లక్షల మెట్రిక్ టన్నులు యూరియా రాష్ట్రానికి సరఫరా చేయాల్సి ఉందని చామల పేర్కొన్నారు. ఇందువల్ల రాష్ట్రంలో 2.10 లక్షల మెట్రిక్ టన్నులు యూరియా కొరత ఏర్పడినట్లు ఆందోళన వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్రంలో పంటలకు అవసరమైన యూరియా దొరకక రైతుల్లో ఆందోళనకర పరిస్థితులు నెలకొన్నట్లు ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. యూరియా కొరత ఏర్పడి రాష్ట్రంలో తీవ్ర గందరగోళ పరిస్థితులకు దారితీసినట్లు వెల్లడించారు. జూన్‌లో రావాల్సిన నైరుతి రుతుపవణాలు ముందుగానే ఈ ఏడాది మే 26న రాష్ట్రానికి వచ్చాయని, దాని వల్ల పంటలు వేయడం మొదలుపెట్టిన రైతులకు సకాలంలో యూరియా అందకపోవడంతో ఆ ప్రభావం పంటలపై తీవ్రంగా పడుతోందని వివరించారు. రాష్ట్రంలో ఉత్పన్నమైన పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని యూరియా కొరత అంశాన్ని లేవనెత్తేందుకు తనకు అనుమతి ఇవ్వాలని చామల కిరణ్ కుమార్ కోరారు. అయితే రాష్ట్రంలో గత కొన్ని నెలలుగా యూరియా కొరత తీవ్ర దుమారం రేపుతుంది. కేంద్ర ప్రభుత్వం తెలంగాణకు వివక్షత చూపిస్తూ.. యూరియా ఇవ్వడం లేదని అధికార పార్టీ నేతలు ఆరోపిస్తుంటే.. అధికారంలో ఉన్న నేతలు యూరియాను బ్లాక్‌లో అమ్ముకున్నారని ప్రతిపక్ష నేతలు ఆరోపిస్తున్నాయి. ఏది ఎలా పోయినా.. రాష్ట్రంలో యూరియా కొరతతో రైతులు ఇబ్బందులు పడుతున్నారన్నది వాస్తవం. అది రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యమో, కేంద్ర ప్రభుత్వ నిర్లక్ష్యమో తెలియక రైతులు సందిగ్ధంలో కొట్టుమిట్టాడుతున్నారు. ఈ యూరియా కొరత రైతన్నల వర్షాకాల పంట కలలను చిదిమేయకముందే పరిష్కారం అవుతుందని ఆశిందాం.

## స్టీల్ ప్లాంట్ లో బిగ్ ట్విస్ట్

### కీలక విభాగాల ప్రైవేటీకరణ

### కూటమి నేతలకు పరీక్ష...!!




విశాఖ స్టీల్ ప్లాంట్ లో కీలక పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి. కేంద్రం ఆర్థిక ప్యాకేజీతో ఇక స్టీల్ ప్లాంట్ ప్రయివేటీకరణ లేనట్లే అని అందరూ భావించారు. కూటమి నేతలు సైతం ప్లాంట్ భవిష్యత్ పైన హామీ ఇచ్చారు. కాగా, తాజాగా స్టీల్ ప్లాంట్ యాజమా న్యం పలు విభాగాల ప్రైవేటు పరం చేసేందుకు టెండర్లు జారీ చేసింది. దీంతో, అసలు ఏం జరుగుతుందనే టెన్షన్ కార్మికుల్లో మొదలైంది. కీలక విభాగాలు ప్రైవేటు వారికి అప్పగించే ప్రయత్నాలు జరుగుతున్నా యని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. విశాఖ స్టీల్ ప్లాంట్ లో అనూహ్య నిర్ణయాలు జరుగుతున్నాయి. విశాఖ ఉక్కు యాజమాన్యం తాజా నోటిఫికేషన్ జారీతో కొత్త సమస్య తెర మీదకు వచ్చింది. విశాఖ ఉక్కు కర్మాగారాన్ని పూర్తిస్థాయిలో ప్రైవేటీకరించే దిశగా అడుగులు పడుతున్నాయనే అందోళన వ్యక్తం అవుతోంది. కర్మాగారాన్ని రక్షిస్తామని యాజమాన్యం ఒకవైపు ప్రకటనలు చేస్తూనే, మరో వైపు దశలవారీగా విభాగాలను ప్రైవేటీకరించేందుకు వడివడిగా అడుగులు వేస్తోంది. దీనిలో భాగంగా కర్మాగారంలో కీలకమైన 34 విభాగాలను ప్రైవేటీకరించేందుకు ఉక్కు యాజమాన్యం నోటిఫికేషన్ జారీచేయడం సంచలనంగా మారుతోంది. ఈ వ్యవహారంపై కార్మికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఒక పక్క ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఉద్యమం జరుగుతున్నా.. మరోవైపు ప్లాంట్‌లో ఒక్కో విభాగం ప్రైవేటీకరించేందుకు యాజమాన్యం ప్రణాళికాయుతంగా అడుగులు వేస్తోంది. ఇప్పటి వరకు కొన్ని విభాగాలను ప్రైవేటీకరించేందుకు వరుసగా నోటిఫికేషన్‌లు జారీ చేయగా, తాజాగా ఒకేసారి 34 విభాగాలను ప్రైవేటీకరించేందుకు ప్రకటన విడుదల చేసింది. ఓ పక్క ప్లాంట్‌కు పూర్వ వైభవం తెస్తామని చెబుతున్న యాజమాన్యం.. ఇలా అన్ని విభాగాలను ప్రైవేటీకరించేందుకు నోటిఫికేషన్‌లు జారీ చేయటంతో అసలు ప్లాంట్‌లో ఏం జరుగుతోందో తెలియడం లేదని కార్మిక సంఘాలు ఆందోళన చెందుతన్నాయి. కేంద్రం రూ 11 వేల కోట్ల ఆర్థిక ప్యాకేజీ ప్రకటన తరువాత ప్లాంట్ ప్రయివేటీకరణ ఆగినట్లేనని అందరూ భావించారు. కేంద్ర మంత్రులతో సహా.. కూటమి నేతలు ప్లాంట్ భవితవ్యం పైన హామీ ఇచ్చారు. కార్మికులు ప్రస్తుతం కేంద్రం ఇచ్చిన ఉపశమనంతో... మరింతగా కష్టపడి ఉత్పత్తి పెంచుకోవాలని కూటమి నేతలు సూచించారు. కాగా, ఇప్పుడు కీలక విభాగాలను ప్రయివేటు వ్యక్తులకు అప్పగించేందుకు టెండర్లు జారీ చేయటం కార్మికులకు అంతు చిక్కటం లేదు. దీంతో, వారు ప్లాంట్ వద్ద నిరసనలు మొదలు పెట్టారు. టెండర్లు జారీ అయిన వాటిల్లో క్యాప్టివ్ పవర్‌ప్లాంట్, వేస్ట్ హీట్ రికవరీ థర్మల్ పవర్‌ప్లాంట్, క్యాప్టివ్ పవర్‌ప్లాంట్-2, వైర్‌రాడ్ మిల్, బ్లాస్ట్‌ఫర్నేస్ -1, 2, 3 విభాగాలు కూడా ఉండటంతో కార్మికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.




# దంచికొడుతున్నాయ్...!

## తెలుగు రాష్ట్రాలను వీడని వర్షాలు...

## ఈ జిల్లాలకు రెడ్, ఎల్లో అలెర్ట్ జారీ!

విశాఖపట్నం, హైదరాబాద్, ఆగస్టు18 : పశ్చిమమధ్య, వాయువ్య బంగాళాఖాతంలో కేంద్రీకృతమైన తీవ్ర అల్పపీడనం వాయుగుండంగా బలపడే అవకాశం ఉందని విపత్తుల నిర్వహణ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ప్రఖర్ జైన్ వెల్లడించారు. రేపు ఉదయానికి వాయుగుండంగా దక్షిణ ఒడిశా-ఉత్తరాంధ్ర తీరాలను దాటే అవకాశం ఉందని పేర్కొన్నారు. కోస్తా తీరం వెంబడి గంటకు 40-60కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉందని పేర్కొన్నారు. సముద్రం అలజడిగా ఉంటుందని మత్స్యకారులు సముద్రంలో వేటకు వెళ్లరాదని సూచించారు. దీని ప్రభావంతో రేపు కోస్తాలో చెదురుమదురుగా భారీ వర్షాలు కురిసేందుకు అవకాశం ఉందని చెప్పుకొచ్చారు.

**ప్రజలు అప్రమత్తంగా ఉండాలి...** అల్లూరి సీతారామరాజు, ఏలూరు, ఎన్టీఆర్ జిల్లాల్లో అక్కడక్కడ మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపారు. మిగతా జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని ప్రఖర్ జైన్ వివరించారు. భారీవర్షాలు, బలమైన గాలుల నేపథ్యంలో శిథిలావస్థలో ఉన్న భవనాలు, గోడలు వద్ద ఉండరాదని హెచ్చరించారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఎగువ ప్రాంతాల్లో, మన రాష్ట్రంలో కురుస్తున్న వర్షాలకు గోదావరి, కృష్ణా, తుంగభద్ర నదుల వరద ప్రవాహం హెచ్చరిక స్థాయికి చేరనప్పటికీ వివిధ ప్రాజెక్టుల్లోని నీటిని దిగువకు విడుదల చేస్తున్నందున ఆయా నదీపరీవాహక ప్రాంత, లోతట్టు/లంక గ్రామ ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

**చేపల వేటకు వెళ్లవద్దు...** బోట్లు, మోటార్ బోట్లు, స్టీమర్లలతో నదిలో ప్రయాణించడం, వరద నీటిలో ఈతకు వెళ్లడం, చేపలు పట్టడం, స్నానాలకు వెళ్లడం లాంటివి చేయరాదని సూచించారు. గోదావరి నదికి వరద ప్రవాహం స్వల్పంగా పెరుగుతోందని భద్రాచలం వద్ద నీటిమట్టం 37.7 అడుగులు అందని పేర్కొన్నారు. ధవళేశ్వరం వద్ద ఇన్ ఫ్లో, ఔట్ ఫ్లో 4.35 లక్షల క్యూసెక్కులు ఉందని వెల్లడించారు. ప్రకాశం బ్యారేజి వద్ద కృష్ణానది వరద సోమవారం సాయంత్రం 5 గంటల నాటికి ఇన్, ఔట్ ఫ్లో 2.53 లక్షల క్యూసెక్కులు ఉందని చెప్పుకొచ్చారు. సోమవారం సాయంత్రం 5 గంటల నాటికి అల్లూరి జిల్లా మారేడుమిల్లిలో 73మిల్లిమీటర్ల, మన్యం జిల్లా గుళ్లసీతారామపురంలో 66మిల్లిమీటర్ల, శ్రీకాకుళం జిల్లా ఆముదాలవలసలో 60.2మిల్లిమీటర్ల, అల్లూరి జిల్లా కొత్తూరులో 59.5మిల్లిమీటర్ల చొప్పున వర్షపాతం నమోదైందని పేర్కొన్నారు.

**హెచ్చరికలు జారీ..** విశాఖపట్నం , అల్లూరి సీతారామరాజు, అనకాపల్లి, ఈస్ట్ గోదావరి, కాకినాడ, కోనసీమ, ఏలూరు , ఎన్టీఆర్, వెస్ట్ గోదావరి జిల్లాలకు రెడ్ అలర్ట్ జారీ చేశారు. ఈ జిల్లాలో భారీ నుంచి అత్యంత భారీ వర్షాలు ఒకటి రెండు చోట్ల పడే అవకాశం ఉందని వెల్లడించారు. శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం, పల్నాడు, ఎన్టీఆర్, కృష్ణ, జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేశారు. తీరం వెంబడి బలమైన గాలులు ఉంటాయని, మత్స్యకారులు వేటకు వెళ్లకూడదని సూచించారు. అన్ని పోర్టుల్లో మూడో నెంబర్ హెచ్చరిక కొనసాగుతోందని విశాఖపట్నం వాతావరణ శాఖ అధికారులు పేర్కొన్నారు.

**ప్రాజెక్టులకు జలకళ..** మరోవైపు, తెలుగు రాష్ట్రాల్లో భారీ వర్షాలు కురుస్తున్నాయి. దీంతో పలు ప్రాజెక్టులు జలకళను సంతరించుకున్నాయి. ఏపీ, తెలంగాణలో అత్యంత భారీ వర్షాలు పడే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. తెలంగాణలో 3 జిల్లాలకు రెడ్ అలర్ట్, 12 జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేశారు.

**నిలిచిన రాకపోకలు...** కాగా, హైదరాబాద్‌లోని విద్యానగర్ టీఆర్టీ కాలనీలో భారీ చెట్టు నేలకూలింది. దీంతో సమీపంలోని కారు ధ్వంసమైంది. మేడ్చల్, శామీర్‌పేట్, మూడుచింతలపల్లిలో చెరువులు అలుగు పారుతున్నాయి. మేడ్చల్-గౌడవెల్లి రహదారిపై వరద ప్రవాహంతో రాకపోకలు నిలిచిపోయాయి. భారీ వర్షాలతో మూసీ ప్రాజెక్ట్‌కు భారీగా వరద నీరు ప్రవహిస్తోంది. భారీ వరదతో ఆరు గేట్లు ఎత్తివేశారు. నిజామాబాద్ జిల్లాలోని శ్రీరాంసాగర్‌కు భారీగా వరద ప్రవహిస్తోంది. భారీ వరద ప్రవాహంతో 24 గేట్లు ఎత్తివేశారు. ఏలూరు జిల్లాలోని కొల్లేరుకు భారీగా వరద చేరింది. అలాగే పెనుమాకలంక-కైకలూరు మధ్య రాకపోకలు బంద్ అయ్యాయి.

చురకలు

మంగళవారం 19 ఆగష్టు 2025



## సబితా ఇంద్రారెడ్డికి హైకోర్టు నోటీసులు

### ఓఎంసీ కేసు.. సబితా ఇంద్రారెడ్డి, కృపానందానికి హైకోర్టు నోటీసులు

హైదరాబాద్: మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి, మాజీ ఐఏఎస్ కృపానందానికి తెలంగాణ హైకోర్టు నోటీసులు జారీ చేసింది. ఓబుళాపురం అక్రమ మైనింగ్ కేసులో వీరిద్దరిని నిర్దోషులుగా తేల్చుతూ నాంపల్లి సీబీఐ కోర్టు గతంలో తీర్పు ఇచ్చింది. ఈ తీర్పును సవాల్ చేస్తూ హైకోర్టులో సీబీఐ పిటిషన్ దాఖలు చేసింది. ఈక్రమంలో ఉన్నత న్యాయస్థానం కౌంటర్ దాఖలు చేయాలని ఉన్నత న్యాయస్థానం సబితా ఇంద్రారెడ్డి, కృపానందాన్ని ఆదేశించింది. విచారణను వచ్చే నెలకు వాయిదా వేసింది. ఓబుళాపురం మైనింగ్ కేసులో నాంపల్లి సీబీఐ కోర్టు మే నెలలో తుది తీర్పు వెలువరించింది. 15 ఏళ్ల పాటు సుదీర్ఘ విచారణ అనంతరం ఈ కేసులో మొత్తం ఐదుగురిని దోషులుగా, ఇద్దరిని నిర్దోషులుగా ప్రకటించింది. ఈ కేసులో ప్రధాన నిందితులైన గాలి జనార్దన్ రెడ్డి, బీవీ శ్రీనివాసరెడ్డి, మెఫజ్ అలీఖాన్, గనుల శాఖ అప్పటి డైరెక్టర్ వీడీ రాజగోపాల్‌ను దోషులుగా నిర్ధారిస్తూ శిక్షలు ఖరారు చేసింది. గాలి జనార్దన్‌రెడ్డి సహా నలుగురికి ఏడేళ్ల పాటు జైలు శిక్ష ఖరారు చేసింది. అలాగే, దోషులకు రూ. 10వేలు చొప్పున జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించింది. ఓబుళాపురం మైనింగ్ కంపెనీకు రూ. 2 లక్షలు జరిమానా విధించింది.

ఈ కేసులో అప్పటి గనుల శాఖ మంత్రిగా ఉన్న సబితా ఇంద్రారెడ్డికి ఉపశమనం లభించింది. ఆమెతో పాటు అప్పటి పరిశ్రమల శాఖ కార్యదర్శి కృపానందంను సీబీఐ కోర్టు నిర్దోషులుగా ప్రకటించింది. మరోవైపు ఓబుళాపురం అక్రమ మైనింగ్ కేసులో నలుగురు దోషులకు తెలంగాణ హైకోర్టు ఇటీవల బెయిల్ మంజూరు చేసింది. గాలి జనార్దనరెడ్డితో పాటు , ఆయన పీఏ అలీఖాన్, బీవీ శ్రీనివాస్‌రెడ్డి, రాజగోపాల్‌కు బెయిల్ ఇచ్చింది.

## బీసీ రిజర్వేషన్లు.. గత ప్రభుత్వం చేసిన చట్టమే మనకు అడ్డంకి: సీఎం రేవంత్‌రెడ్డి



హైదరాబాద్: సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ విగ్రహం తెలంగాణ సమాజానికి ఆదర్శంగా నిలబడాలని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. ట్యాంక్‌బండ్ సమీపంలో పాపన్నగౌడ్ విగ్రహానికి శంకుస్థాపన చేసిన అనంతరం ఆయన మాట్లాడారు. బహుజనుల సామ్రాజ్యాన్ని అందరికీ ఎలా అందించవచ్చో పాపన్నగౌడ్ నిరూపించారన్నారు. పాపన్నగౌడ్ కోటను గత ప్రభుత్వాలు మైనింగ్ లీజుకు ఇచ్చాయని విమర్శించారు. గతంలో ఖిలాస్‌పూర్ కోటను కాలగర్భంలో కలపాలని చూశారని దుయ్యబట్టారు. చరిత్ర స్ఫూర్తి కోటను చారిత్రక కట్టడాలుగా తీర్చిదిద్దాలని నిర్ణయించామన్నారు. భవిష్యత్తు తరాలు స్ఫూర్తి పొందేలా ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేయాలని నిర్ణయించామన్నారు. " గాంధీ కుటుంబం దేశానికి గొప్ప వరం. శాంతితో యుద్ధాన్ని గెలవవచ్చు అని గాంధీ నిరూపించారు. దేశం కోసం ఇందిరా గాంధీ, రాజీవ్‌గాంధీ ప్రాణాలర్పించారు. దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపించాలని సోనియా గాంధీ పదవులు త్యాగం చేశారు. మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించేందుకు ఆ కుటుంబం గొప్ప నాయకత్వాన్ని అందించింది. ప్రపంచ వ్యాప్తంగా భారత్‌ను గుర్తించినట్లే.. గాంధీ కుటుంబాన్ని గుర్తిస్తున్నారు. ఆ వారసత్వాన్ని పుణికిపుచ్చుకున్న మన ప్రభుత్వం ప్రపంచానికి ఆదర్శం. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇస్తామని గతంలో రాహుల్ గాంధీ మాట ఇచ్చారు. గాంధీ కుటుంబం మాట ఇస్తే అది శిలాశాసనమే. దేశంలో ఏ రాష్ట్రం చేయని విధంగా తెలంగాణలో కులగణన సర్వే చేశాం. అందులో తప్పులుంటే చూపాలని దేశంలోని అన్ని రాజకీయ పార్టీలకు శాసనసభ వేదికగా సవాల్ విసిరాం. తప్పులు చూపితే క్షమాపణ చెబుతామని చెప్పాం. రాజకీయ ప్రయోజనాల కోసం కులగణను తప్పుపట్టవద్దు. దీన్ని తప్పుపడితే వందేళ్ల వరకు బహుజనులకు న్యాయం జరగదు. బీసీ రిజర్వేన్ల బిల్లును ఐదు నెలలుగా కేంద్రం పెండింగ్‌లో పెట్టింది. బీసీతో పాటు ఎస్సీ, ఎస్టీ కలిపితే 70 శాతం వరకు చేరుతాయి. తెలంగాణలో 50 శాతానికి మించి రిజర్వేషన్లు ఇవ్వకుండా గత ప్రభుత్వం చట్టం చేసింది. గత ప్రభుత్వం చేసిన చట్టం మనకు అడ్డంకిగా మారింది." అని రేవంత్‌రెడ్డి అన్నారు.



## హైదరాబాద్‌లో తీవ్ర విషాదం

### హైదరాబాద్‌లో కృష్ణాష్టమి వేడుకల్లో తీవ్ర విషాదం.. విద్యుత్ తీగలు తగిలి ఆరుగురి మృతి

హైదరాబాద్: రామంతాపూర్‌లోని గోకులేనగర్‌లో ఆదివారం అర్ధరాత్రి తీవ్ర విషాదం చోటుచేసుకుంది. శ్రీకృష్ణాష్టమి వేడుకల్లో భాగంగా నిర్వహించిన ఊరేగింపు రథానికి విద్యుత్ తీగలు తగిలి ఆరుగురు మృతిచెందారు. ఘటనాస్థలిలో ఐదుగురు, ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మరొకరు చనిపోయారు. కృష్ణాష్టమి కారణంగా ఆదివారం రాత్రి ఊరేగింపు చేపట్టారు. రథాన్ని లాగుతున్న వాహనం మరమ్మతుకు గురికావడంతో దాన్ని పక్కన నిలిపివేసిన యువకులు.. రథాన్ని చేతులతో లాగుతూ ముందుకు తీసుకెళ్లారు.

ఈ క్రమంలో రథానికి విద్యుత్ తీగలు తగిలాయి. దీంతో రథాన్ని లాగుతున్న తొమ్మిది మందికి షాక్ కొట్టడంతో వారంతా ఒక్కసారిగా విసిరేసినట్లు దూరంగా పడిపోయారు. ఈ ఘటనతో ఒక్కసారిగా భయభ్రాంతులకు గురైన స్థానికులు వెంటనే తేరుకొని ప్రాథమిక చికిత్స చేపట్టి ఆసుపత్రికి తరలించారు. అప్పటికే ఐదుగురు మృతిచెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. మరో నలుగురిని స్థానికంగా ఉన్న ప్రైవేట్ ఆసుపత్రిలో చేర్పించి చికిత్స అందిస్తున్నారు. మృతిచెందిన వారిలో కృష్ణయాదవ్ (21), సురేశ్ యాదవ్(34), శ్రీకాంత్‌రెడ్డి(35), రుద్రవికాస్(39), రాజేంద్రరెడ్డి(45)తో పాటు మరొకరు ఉన్నట్లు గుర్తించారు. వారి మృతదేహాలను శవపరీక్ష నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు. గాయపడిన వారిలో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి గన్‌మెన్ శ్రీనివాస్ సైతం ఉన్నట్లు సమాచారం.

## రామంతాపూర్ ఘటనలో మృతులకు రూ.5లక్షల ఎక్స్‌గ్రేషియా




హైదరాబాద్: రామంతాపూర్ ఘనటలో మృతిచెదిన బాధితులకు ప్రభుత్వం రూ. 5లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించింది. రామంతాపూర్ గోకులే నగర్లో శ్రీకృష్ణాష్టమి వేడుకల్లో భాగంగా నిర్వహించిన ఊరేగింపు రథానికి విద్యుత్ తీగలు తగిలి ఐదుగురు వ్యక్తులు అక్కడికక్కడే మృతిచెందారు. కృష్ణాష్టమి కారణంగా ఆదివారం రాత్రి ఊరేగింపు చేపట్టారు. రథాన్ని లాగుతున్న వాహనం మరమ్మతుకు గురికావడంతో దాన్ని పక్కన నిలిపివేశారు. అనంతరం యువకులు రథాన్ని చేతులతో లాగుతూ ముందుకు తీసుకెళ్లారు. ఈ క్రమంలో రథానికి విద్యుత్ తీగలు తగిలాయి. దీంతో రథం లాగుతున్న తొమ్మిది మందిలో ఐదుగురు అక్కడిక్కకడే మృతిచెందగా.. నాలుగు తీవ్రగాయాలతో చికిత్స పొందుతున్నారు. నాలుగురిలో చికిత్స పొందుతూ.. ఒక వ్యక్తి మృతిచెందినట్లు వైద్యులు వెల్లడించారు.



## కూకట్‌పల్లిలో పదేళ్ల బాలిక దారుణహత్య

కూకట్‌పల్లి (హైదరాబాద్): నగరంలో పదేళ్ల బాలిక దారుణహత్యకు గురైంది. కూకట్‌పల్లి సంగీత్‌నగర్‌లో ఈ ఘటన చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సంగీత్ నగర్‌లో కుమారుడు, కుమార్తెతో కలిసి దంపతులు నివాసముంటున్నారు. తండ్రి బైక్ మెకానిక్.. తల్లి ల్యాబ్ టెక్నీషియన్. బాలిక కేంద్రీయ విద్యాలయంలో ఆరో తరగతి చదువుతోంది. సోమవారం ఉదయం తల్లిదండ్రులు తమ కుమారుడిని స్కూల్‌కు పంపి విధులకు వెళ్లారు. కుమార్తెకు స్కూల్ సెలవు కావడంతో ఇంట్లోనే ఒంటరిగా ఉంది. మధ్యాహ్నం 12.30 గంటల సమయంలో కుమారుడి లంచ్ బాక్స్ తీసుకెళ్లేందుకు తండ్రి ఇంటికి వచ్చాడు. బెడ్‌రూమ్‌లో పొట్టపై కత్తి పోట్లతో బాలిక విగతజీవిగా పడి ఉండటాన్ని ఆయన గుర్తించాడు. తన కుమార్తెను దుండగుడు హతమార్చినట్లు అనుమానిస్తూ కూకట్‌పల్లి పోలీసులకు సమాచారం ఇచ్చాడు.

కూకట్‌పల్లి పోలీసులతో పాటు బాలానగర్ డీసీపీ సురేశ్‌కుమార్ ఘటనాస్థలికి చేరుకుని పరిశీలించారు. డాగ్ స్క్వాడ్, క్లూస్‌టీమ్‌తో ఆధారాలను సేకరించారు. బాలిక మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. కూకట్‌పల్లి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.



## మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లాలో ఉద్ధృతంగా ప్రవహిస్తున్న వాగులు

**మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా పరిధిలో ఆదివారం రాత్రి కురిసిన భారీ వర్షాలకు వాగులు, వంకలు పొంగి ప్రవహిస్తున్నాయి. మేడ్చల్ నుంచి గౌడ వెళ్లే రహదారిపై వాగు ఉద్ధృతంగా ప్రవహిస్తుండడంతో వాహనాల రాకపోకలను నిలిపివేశారు. మూడు చింతలపల్లి మండలం ఉద్దెమర్రి వద్ద వాగు ఉద్ధృతంగా ప్రవహిస్తోంది. దీంతో మూడు చింతలపల్లి ఉద్దెమర్రి మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. ఎవరూ అటు వైపు వెళ్లకుండా పోలీసులు బారికేడ్లు ఏర్పాటు చేశారు. లక్ష్మాపూర్ అలుగు పారి ప్రవహిస్తోంది. అలియాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని రామాలయం వద్ద రహదారిపై నుంచి వాగు ప్రవహిస్తుండడంతో వాహనాల రాకపోకలను నిలిపివేశారు. పోలీసులు వాగుల వద్దకు వెళ్లవద్దని ప్రజలను హెచ్చరించారు.**

## చేనేత ఉత్పత్తులపై జీఎస్టీ తొలగించండి.. ప్రధానికి మంత్రి తుమ్మల లేఖ



హైదరాబాద్: చేనేత ఉత్పత్తులపై వెంటనే జీఎస్టీ తొలగించాలని కోరుతూ ప్రధాని మోదీకి తెలంగాణ చేనేత, జౌళి శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు లేఖ రాశారు. కేంద్ర హస్త కళలు, చేనేత మంత్రిత్వ శాఖ మంత్రి గిరిరాజ్ సింగ్‌కు కూడా లేఖ పంపారు. రాష్ట్ర హస్తకళల పరిశ్రమకు ఊపిరిలాంటి చేనేత రంగం, చేనేత ఉత్పత్తులపై కేంద్ర ప్రభుత్వం విధించిన 5 శాతం జీఎస్టీతో ప్రస్తుతం ఆ రంగం తీవ్రమైన సమస్యలు ఎదుర్కొంటోందని ప్రధాని, కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. వ్యవసాయం తర్వాత ఎక్కువ మందికి ఉపాధి కల్పించే ఈ రంగం.. ప్రత్యేకించి గ్రామీణ ప్రాంతాల్లో వేలాది మంది కార్మికులకు జీవనాధారమైందని పేర్కొన్నారు. "అందం, నాణ్యత, సృజనాత్మకతకు అద్దం పట్టే పోచంపల్లి ఇక్కత్, గద్వాల్ చీరలు, నారాయణపేట చీరలు, సిద్ధిపేట గొల్లభామ చీరలు, వరంగల్ దర్రీస్, కరీంనగర్ డబుల్ క్లాత్ చెద్దర్లు, ఇతర చేనేత వస్త్రాలు దేశవ్యాప్తంగా మంచి గుర్తింపు పొందాయి. వీటిలో ఆరు రకాల ఉత్పత్తులు జియోగ్రాఫికల్ ఇండికేషన్ కింద నమోదయ్యాయి. రాష్ట్రంలో ప్రస్తుతం 23,046 మంది చేనేత కార్మికులు, 34,569 మంది అనుబంధ కార్మికులు ఈ రంగంలో పని చేస్తూ ఉపాధి పొందుతున్నారు. ముడి సరకుల ధరలు పెరగడం, పవర్‌లూమ్, మిల్ రంగాలు తక్కువ ఉత్పత్తి వ్యయంతో వస్త్రాలు తయారు చేయడంతో మార్కెట్లో చేనేత వస్త్రాలు తయారు చేసే నేత కార్మికులకు గిరాకీ లేక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీనికి తోడు 5 శాతం జీఎస్టీ విధించడం వల్ల చేనేత ఉత్పత్తుల ధరలు పెరిగి వినియోగం తగ్గిపోతుంది. కార్మికుల జీవనాధారం సంక్షోభంలో పడుతోంది. జీఎస్టీ వల్ల నష్టపోతున్న నేతన్నలు తమ సంప్రదాయ వృత్తిని వదిలి వలస వెళ్లాల్సిన పరిస్థితి వస్తోంది. సాధారణంగా ఖాదీ రంగం, చేనేత రంగం రెండూ సహజ సిద్ధమైన గ్రామీణ పరిశ్రమలుగా ఒకే విధంగా ఉన్నప్పటికీ.. ఖాదీ ఉత్పత్తులపై జీఎస్టీ మినహాయింపు ఉండగా, చేనేత ఉత్పత్తులపై 5 శాతం జీఎస్టీ కొనసాగించడం అన్యాయం. రాష్ట్రంలో చేనేత సహకార సంఘాలు, ఉత్పత్తిదారుల సంఘాలు, కార్మికులు ఈ పన్నును వ్యతిరేకిస్తూ నిరసనలు వ్యక్తం చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో చేనేత కార్మికుల ప్రయోజనాలు కాపాడటంతోపాటు నిరంతరం ఉపాధి కల్పించేందుకు భారతీయ చేనేత కళా వారసత్వం భావితరాలకు అందించడానికి చేనేత ఉత్పత్తులపై 5 శాతం జీఎస్టీ మినహాయించే విధంగా కేంద్ర ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలి"అని మంత్రి తుమ్మల విజ్ఞప్తి చేశారు.

## తెలంగాణలో సంస్కరణలు.. దేశానికి దశాదిశ నిర్దేశించేలా ఉన్నాయి: భట్టి విక్రమార్క



హైదరాబాద్: తెలంగాణలో చేపడుతున్న సంస్కరణలు, నిర్ణయాలు.. దేశానికి దశాదిశ నిర్దేశించే స్థాయిలో ఉన్నాయని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. ట్యాంక్‌బండ్ సమీపంలో పాపన్నగౌడ్ విగ్రహానికి శంకుస్థాపన చేసిన అనంతరం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశచరిత్రలో ఎక్కడా లేని విధంగా కులగణన చేపట్టామన్నారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లపై చట్టం చేశామని తెలిపారు. రాష్ట్రంలో బీసీ రిజర్వేషన్లు దేశంలోనూ అమలుకు దారి తీశాయని వివరించారు. ప్రభుత్వ విధాన నిర్ణయాలను ప్రతి గ్రామం, ఇంటికి తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. ప్రజాప్రభుత్వం తెలంగాణలో విప్లవాత్మక మార్పు తీసుకువస్తోందని వివరించారు. కాంగ్రెస్ మూల సిద్ధాంతం సామాజిక న్యాయమని తెలిపారు.





## విపక్షాల ఉప రాష్ట్రపతి అభ్యర్థిగా తిరుచ్చి శివకు ఛాన్స్

న్యూఢిల్లీ: ఉప రాష్ట్రపతి ఎన్నిక వేడెక్కుతోంది. మహారాష్ట్ర గవర్నర్ సీపీ రాధాకృష్ణన్‌ను తమ ఉపరాష్ట్రపతి అభ్యర్థిగా ఎన్డీయే ప్రకటించడంతో విపక్ష 'ఇండియా' కూటమి సైతం తమ అభ్యర్థిని బరిలోకి దింపేందుకు వ్యూహాత్మకంగా వ్యవహరిస్తోంది. ఇందులో భాగంగా డీఎంకే రాజ్యసభ ఎంపీ తిరుచ్చి శివను ఉపరాష్ట్రపతి అభ్యర్థిగా 'ఇండియా' కూటమి ప్రకటించే అవకాశాలున్నాయని విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. తమిళనాడు నుంచి ఉపరాష్ట్రపతి అభ్యర్థిని ఎన్డీయే ప్రకటించడంతో, అదే తమిళనాడు నుంచి డీఎంకే అభ్యర్థిని దించడం ద్వారా బీజేపీ వ్యూహాన్ని తిప్పికొట్టాలని 'ఇండియా' కూటమి భావిస్తోందని ఆ వర్గాలు చెబుతున్నాయి. సెప్టెంబర్ 9న ఉపరాష్ట్రపతి ఎన్నిక జరుగనుండగా, ఈనెల 21వ తేదీతో నామినేషన్ గడువు ముగియనుంది. ఈ క్రమంలో ఉపరాష్ట్రపతి అభ్యర్థి ఎంపికకోసం రాజ్యసభలో ప్రతిపక్ష నాయకుడు మల్లికార్జున్ ఖర్గే కార్యాలయంలో కూటమి ఫ్లోర్ లీడర్లు సోమవారంనాడు సమావేశమయ్యారు. కూటమి అభ్యర్థిని ఈరోజే అధికారికంగా ప్రకటించే అవకాశాలు కూడా ఉన్నాయి.

# కెమెరాకే ట్రిక్కులు నేర్పిన రాజన్ బాబు

## – ఆగస్టు 19... ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవం



అద్భుతమైన జ్ఞాపకాలు, తియ్యటి అనుభూతులు, మధుర ఘట్టాలు, గొప్ప సన్నివేశాలు, అపురూప సంఘటనలు, మనసు దోచే దృశ్యా లు, ఆలోచింప జేసే రూపాలు... అరుదైన చిత్రాలు...వెరసి ఫొటోగ్రఫీ. వెలకట్టలేని దృశ్యాలను పదికాలాల పాటు పదిలంగా మన కళ్ల ముందు ఉంచేది ఫొటో. వంద మాటలతో చెప్పలేనిది ఒక్క ఫొటో తో చెప్పడం సాధ్యం. అంతటి శక్తి వంతమైనది ఫొటోగ్రఫీ. అలాంటి శక్తిని వశం చేసుకుని ఫోటోతో అద్భుతాలు సృష్టించిన కెమెరా మాంత్రికుడు బండి రాజన్ బాబు. కెమెరాకే ట్రిక్కులు నేర్పిన నేర్పరి రాజన్ బాబు. అంతర్జాతీయ ఖ్యాతి గడించిన రాజన్ బాబు తెలంగాణకు చెందిన వారు కావడం గర్వకారణం. బండి రాజన్ బాబు (ఫిబ్రవరి 9, 1939 – ఆగష్టు 24, 2011) ప్రఖ్యాత ఛాయా చిత్రకారులు. దృశ్య ప్రధానమైన ఛాయా గ్రహణం లో పేరు తెచ్చుకొన్న బండి రాజన్ బాబు 1939, ఫిబ్రవరి 9 న అవిభక్త కరీంనగర్, నేటి జగిత్యాల జిల్లా కోరుట్లలో జన్మించారు. రాజన్ బాబంటే తొలుత గుర్తుకు వచ్చేవి అరకు లోయల్లో తీసిన బొండా గిరిజన మహిళల అగణిత ఛాయా చిత్రాలు. బాల్యంలో రంగులు వేయ డం, చిత్రాలను గీయడం పట్ల ఆసక్తిని కనబరిచిన రాజన్ బాబు, మంచి చిత్రకారుడు కావల్సి ఉండ గా, కుంచె నుండి కెమేరాకు మార డం యాదృచ్ఛికం. బాల్యం నుంచి చిత్రకళ పై మక్కువ ఉన్న రాజన్, 7వ తరగతి చదువు తున్నప్పుడు తన కజిన్ బహుకరించిన సాధారణ కొడాక్ 620 కెమేరాతో తీసిన చిత్రా లు పెక్కుమంది ప్రశంసలు అందు కొని రాజన్ లోని ఛాయాగ్రాహ కుడిని వెలికి తీసింది. హైదరా బాదులోని జేఎన్టీయూ ఫైన్ ఆర్ట్స్ కళాశాలలో కమర్షియల్ ఆర్ట్ (వ్యాపార చిత్రకళ) లో డిప్లొమా కోర్స్ లో చేరిన సమయంలో, రాజన్ బాబు ప్రఖ్యాత ఛాయాగ్రహ కుడు దివంగత రాజా త్రయంబక్ రాజా బహదూర్ ను కలవటం జరిగింది. రాజా త్రయంబక్ రాజా, రాజన్ బాబును కుంచె స్థానంలో కెమేరా పట్టుకోమన్న సలహా రాజన్ జీవితాన్ని మలుపు తిప్పింది. 5 సంవత్సరాల డిప్లొమా చేసి, కళాశాలలో డిస్టింక్షన్ లో ఉత్తీర్ణుడ యి, కళాశాల యాజమాన్యం మెప్పు పొంది అదే కళాశాలలో అధ్యాపకుడిగా చేరారు. తరువాత ఇక్రిశాట్ లో సైంటిఫిక్ ఫొటొగ్రాఫర్ గా పనిచేశారు. 1978 లో తన ఫొటో స్టుడియో స్థాపించి, రాజన్ స్కూల్ ఆఫ్ ఫోటోగ్రఫీ ప్రారంభించి ఎందరో విద్యార్థులను నిపుణులైన ఛాయా గ్రహకులుగా తీర్చిదిద్దారు. ఛాయాగ్రహణంలో రాజన్ తొక్కిన కొత్త పుంతలు తనకు దేశీయ, అంతర్జాతీయ గుర్తింపు తెచ్చింది. 1987లో నగ్న చిత్రాలపై ఛాయా చిత్ర కళాకృతులను సమర్పించి రాయల్ ఫోటోగ్రఫీ సొసైటీ ఫెలోషిప్ పొందారు. ఆంధ్రప్రదేశ్ స్టేట్ అకాడెమీ ఆఫ్ ఫోటోగ్రఫీ కార్యదర్శిగా ఉంటూ, భగవాన్ దాస్ తర్వాత లెన్స్ లైట్ అనే ఛాయా గ్రాహక పత్రికకు సంపాదకత్వం వహించారు. డిజిటల్ ఛాయా గ్రహణానికి ముందు ఛాయాచిత్రాలు డార్క్ రూం (చీకటి గది) లోనే స్థిర రూపం దాల్చేవి. నెగటివ్ లు వృద్ధి చేయ టానికి, స్థిరపరచడానికై రాజన్ తానే రూపొందించుకొన్న రసాయ నిక సూత్రం పై ద్రవణాలు కలిపి డెవలపర్ తయారు చేసి, నెగటివ్ లను స్థిరపరిచేవారు. ఈ విధానంలో...చిత్రంలో, నలుపు, తెలుపులను ప్రస్ఫుటంగా చూపే హైడ్రోక్వినాన్ లేకుండా కేవలం మెటల్ తోనే ఫిల్మ్ ను వృద్ధిపరచి, స్థిరపరచి, నలుపు తెలుపులో ఎన్నో కళాఖండాలు సృష్టించారు. ఇది రాజన్ ప్రతిభకు నిదర్శనం. ఫొటొషాప్ లాంటి సాఫ్ట్వేర్లు లేని సమయంలో కూడా రాజన్ అద్భు తాలు చేశారు. తన కళా నైపుణ్యం తో తన ఛాయా చిత్రాలను పలు మార్లు వన్ మాన్ షో లో ప్రదర్శిం చి, పలువురి ప్రశంసలందు కున్నారు. రాజన్ తీసిన నగ్న చిత్రా లలో రసికత ఉంటుంది కాని అసభ్యతకు చోటు ఉ ండదు. అందుకే అవి రసజ్ఞుల ప్రశంసలు పొందాయి. కొడాక్ 620 తో మొదలుపెట్టిన రాజన్, తన విద్యార్థులకు ఛాయా గ్రహణ పాఠా లలో భాగంగా బోధించ టానికై, చాలా కెమేరాలు సేకరించారు. వాటిలో ఛాయాచిత్ర కారులలో హోదాకు చిహ్నమైన Hasselblad-medium-format camera కూడా ఉంది. ఫిల్మ్ కెమేరా Asahi Pentax నుంచి, ఛాయాగ్రహణం డిజిటల్ దిశగా సాగిన పయనంలో రాజన్ Canon 400D వాడే వాతు. ఛాయాగ్రహణ శాఖలలో ఒకటైన ఇండస్ట్రియల్ ఫోటోగ్రఫీలో కూడా రాజన్ తన సత్తా చూపారు. నగ్న చిత్రాలకు, అసభ్య చిత్రాలకు మధ్య ఒక గీత ఉంటుంది అనేవారు రాజన్ బాబు. ఛాయాగ్రహణం ఒక భాషైతే, అందు లోని వ్యాకరణమే Composition, Color, Space, Form, Proper Exposure, Angle and Light అని వివరించే వారు. ఈ మెళకువ గ్రహించిన వాడు మంచి ఛాయా గ్రాహకు డవుతాడని రాజన్ అంటుండే వారు. పిక్టోరియల్ ఫొటొగ్రఫీలో తనదైన ముద్ర వేసిన రాజన్ బాబు 2011, ఆగష్టు 24 న తన 73వ ఏట, అనారోగ్యంతో, హైదరాబాదులో మరణించారు. రాష్ట్ర, జాతీయ అంతర్జాతీయ వేదికలపై ఫోటో ప్రదర్శనలు ఏర్పాటు చేసి, లెక్కకు మించిన అవార్డులు, బహుమతులు సొంతం చేసుకున్న రాజన్ బాబు ఫోటోగ్రఫీ కళా కారునిగా చిరకాలం గుర్తుండి పోతారు.

**రామ కిష్టయ్య సంగన భట్ల – 9440595494**

# విమానం నుంచి అంతరిక్షం వరకు: మానవ చరిత్రలో ఒక అద్భుత యానం

## ఆగస్టు 19...జాతీయ విమానయాన దినోత్సవం




జాతీయ విమాన యాన దినోత్సవం ప్రతి సంవత్సరం ఆగస్టు 19న ఘనంగా జరుపు కుంటారు. మానవ చరిత్రలో అత్యద్భుతమైన విప్లవ ఘట్టాల్లో ఒకటైన గగన యానం సాధనకు గుర్తుగా, విమాన యాన రంగంలో మార్గదర్శకుల కృషిని స్మరించుకునేందుకు ఈ రోజు ప్రత్యేకంగా నిలుస్తుంది. రైట్ బ్రదర్స్ 1903 డిసెంబర్ 17న తొలి విజయవంతమైన యాంత్రిక విమానాన్ని ఆకాశంలో ఎగరవేయడం ద్వారా మానవ కలలకు రెక్కలు వచ్చాయి. ఆర్విల్లే రైట్ జన్మదినం ఆగస్టు 19 కావడంతోనే అమెరికా అధ్యక్షుడు ఫ్రాంక్లిన్ డి. రూజ్‌వెల్ట్ 1939లో ఈ రోజును విమానయాన దినోత్సవంగా ప్రకటించారు. అప్పటి నుంచి ప్రపంచవ్యాప్తంగా విమానయాన రంగం సాధించిన పురోగతిని గుర్తు చేసుకుంటూ ఈ రోజును జరుపు కుంటున్నారు. భారతీయ సంస్కృతిలో గగనయాన భావన పూర్వం నుంచే ఉంది. రామాయణం లోని పుష్పక విమానం, మహాభారతం లోని దివ్య రథాలు మన పూర్వికుల ఊహా శక్తిని ప్రతిబింబిస్తాయి. శాస్త్రీయ యుగంలో ఆ కలలు వాస్తవ రూపం దాల్చాయి. భారత దేశంలో విమానయాన చరిత్ర 1911 ఫిబ్రవరి 18న అలహాబాద్ నుండి నైనికి పంపిన పోస్టల్ మెయిల్‌తో ప్రారంభమైంది. ఆ తర్వాత 1932 అక్టోబర్ 15న జె.ఆర్.డి. టాటా తన డీహావిలాండ్ పూసా–38 విమానం నడిపి కరాచీ నుండి మద్రాస్ వరకు పోస్టు, ప్రయాణికులను రవాణా చేయడం ద్వారా భారతీయ పౌర విమానయాన రంగానికి నూతన దారులు తీశారు. ఆయన ప్రారంభించిన టాటా ఎయిర్‌లైన్స్ తరువాత ఎయిర్ ఇండియాగా మారి దేశ గౌరవానికి ప్రతీకగా నిలిచింది. జె.ఆర్.డి. టాటా అందుకే భారతీయ పౌర విమానయాన పితామహుడిగా చిరస్థాయిగా గుర్తింపు పొందారు. స్వాతంత్ర్యం తరువాత భారత ప్రభుత్వం 1953లో ఎయిర్‌లైన్స్ జాతీయీకరణ చేసి ఎయిర్ ఇండియా ఇంటర్నేషనల్, ఇండియన్ ఎయిర్‌లైన్స్‌ను ఏర్పాటు చేసింది. 1990ల ఆర్థిక స్వేచ్ఛా విధానాల తరువాత ప్రైవేట్ రంగానికి అవకాశం లభించడంతో జెట్ ఎయిర్‌వేస్, సహారా, కింగ్‌ఫిషర్, స్పైస్ జెట్, ఇండిగో, విస్తారా వంటి విమానయాన సంస్థలు రంగప్రవేశం చేశాయి. ప్రస్తుతం ఇండిగో సంస్థ 60 శాతం మార్కెట్ వాటాతో భారత గగనంలో అగ్రస్థానంలో నిలిచింది. దేశవ్యాప్తంగా ప్రస్తుతం 148 ఆపరేషనల్ విమానాశ్రయాలు ఉన్నాయనే గణాంకం ఈ రంగం విస్తృతతను తెలియజేస్తుంది. ఢిల్లీ ఇందిరాగాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం, ముంబై ఛత్రపతి శివాజీ మహారాజ్ విమానాశ్రయం, బెంగళూరు కేమ్పేగౌడ, హైదరాబాద్ రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయాలు ప్రపంచస్థాయి సౌకర్యాలను కలిగి దేశ గర్వంగా నిలుస్తున్నాయి. 2017లో ప్రారంభమైన ఉడాన్ పథకం ద్వారా చిన్న పట్టణాలు, దూరప్రాంతాలు కూడా గగనతల రవాణాతో అనుసంధానమవడం సామాన్య ప్రజలకు విమాన ప్రయాణం అందుబాటులోకి తెచ్చింది. ఇప్పటివరకు 500కి పైగా కొత్త మార్గాలు ప్రారంభమైనట్లు ప్రభుత్వ గణాంకాలు చెబుతున్నాయి. రక్షణ రంగంలోనూ విమాన శక్తి భారత భద్రతకు కంచుకోటగా నిలిచింది. 1932లో స్థాపించబడిన భారత వైమానిక దళం స్వాతంత్ర్యం తరువాత అనేక యుద్ధాల్లో కీలక పాత్ర పోషించింది. 1965, 1971 యుద్ధాల్లోనూ, 1999 కార్గిల్ ఘర్షణలోనూ వాయుసేన ప్రదర్శించిన ధైర్య సాహసాలు చరిత్రలో నిలిచి పోయాయి. నేడు టెజాస్ వంటి స్వదేశీ యుద్ధ విమానాలతో పాటు సుఖోయ్–30 ఎంఎంకేఐ, రాఫేల్ వంటి ఆధునిక యంత్రాలు భారత రక్షణ శక్తికి బలాన్నిస్తున్నాయి. అంతరిక్ష పరిశోధనలోనూ విమాన శాస్త్రం పునాదిగా నిలిచింది. భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) రూపకల్పన చేసిన ఉపగ్రహ ప్రయోగాలు, చాంద్రయాన్, మంగళయాన్ విజయాలు ప్రపంచ దృష్టిని ఆకర్షించాయి. త్వరలో జరగబోయే గగనయాన్ మిషన్ ద్వారా భారతీయులు అంతరిక్షంలో అడుగు పెట్టబోతున్న సందర్భం విమానయాన దినోత్సవానికి మరింత విశిష్టతనిస్తోంది. ప్రస్తుతానికి భారతీయ విమానయాన రంగం విస్తృతంగా అభివృద్ధి చెందుతోంది. రోజూ మూడు వేలకుపైగా విమానాలు దేశ ఆకాశంలో ఎగురుతున్నా యి. 2024లో 36 కోట్లకుపైగా ప్రయాణికులు విమాన సౌకర్యాలను వినియోగించుకున్నారని గణాంకాలు చెబుతున్నాయి. ఇండిగో ప్రపంచంలోనే అతిపెద్ద A320 నెరోబాడీ విమానాల వాహక సంస్థగా నిలిచింది. 2030 నాటికి అమెరికా, చైనాల తర్వాత భారతదేశం ప్రపంచంలో మూడవ అతిపెద్ద విమానయాన మార్కెట్‌గా మారబోతోం దని నిపుణులు అంచనా వేస్తున్నారు. ఈ సమగ్ర పరిణామ క్రమం మనకు ఒక స్ఫూర్తిదాయక సందేశం ఇస్తోంది. జాతీయ విమానయాన దినోత్సవం కేవలం ఒక ఆవిష్కరణ జ్ఞాపక దినం మాత్రమే కాదు. అది మానవ మేధస్సు, ఆవిష్కరణ, ధైర్యసాహసాలకు ప్రతీక. దేశాల మధ్య ఆర్థిక, సాంస్కృతిక, రాజకీయ సంబంధాలను బలపరచడంలో విమానయానం కీలక పాత్ర పోషించింది. సామాన్య పౌరుడికి కూడా విమాన ప్రయాణం అందుబాటులోకి రావడం సామాజిక ఆర్థిక అభివృద్ధికి పునాదిగా నిలిచింది. జె.ఆర్.డి. టాటా నుంచి నేటి ఆధునిక గగనయాన్ వరకు, భారతదేశం విమానయాన రంగంలో నిరంతరం కొత్త శిఖరాలను అధిరోహిస్తోంది. "ఆకాశమే హద్దు" అన్న నమ్మకాన్ని మరింత బలపరుస్తూ జాతీయ విమానయాన దినోత్సవం ప్రతి భారతీయునికి గర్వకారణంగా నిలుస్తోంది. **రామ కిష్టయ్య సంగన భట్ల సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్...9440595494**

# పిల్లల్ని కనే రోబో: వాస్తవం కాబోతున్న సైన్స్ ఫిక్షన్



ప్రపంచవ్యాప్తంగా కృత్రిమ మేధస్సు, రోబోటిక్స్, బయోటెక్నాలజీ రంగాల్లో వస్తున్న విప్లవాత్మక మార్పులు ఒకప్పుడు మనం కేవలం సైన్స్ ఫిక్షన్ సినిమాల్లో చూసేవాళ్లం.. కానీ ఇవి ఇప్పుడు నిజం చేస్తున్నాయి. అటువంటి ఒక అద్భుతమైన ఆవిష్కరణే "పిల్లల్ని కనే రోబో". ఈ ప్రాజెక్ట్‌పై చైనాలో వేగంగా పరిశోధనలు జరుగుతున్నాయి. సింగపూర్‌లోని నాన్యాంగ్ యూనివర్శిటీకి చెందిన డాక్టర్ జాంగ్ కిఫెంగ్ నేతృత్వంలో ఒక ప్రత్యేక పరిశోధక బృందం ఈ రోబోను అభివృద్ధి చేసే పనిలో నిమగ్నమై ఉంది. ఈ సాంకేతికత ఎలా పని చేస్తుందంటే, ఈ రోబోలో ఒక కృత్రిమ గర్భాశయం ఉంటుంది. అందులో అమ్నియోటిక్ ఫ్లూయిడ్ ను నింపి, గర్భంలోని శిశువు పెరిగేందుకు అవసరమైన సహజ వాతావరణాన్ని సృష్టిస్తారు.

తల్లి గర్భంలో శిశువుకు అందే అన్ని పోషకాలు, ఆక్సిజన్, రక్షణ ఈ రోబోలోని ట్యూబ్స్ , న్యూట్రియెంట్ సప్లై సిస్టమ్ ద్వారా అందుతాయి. తల్లి గర్భంలో శిశువు 9 నెలల కాలంలో ఎలాగైతే పెరుగుతాడో, ఈ రోబోలో కూడా అదే విధంగా పెరిగి పూర్తిస్థాయి శిశువుగా పుడతాడు.

**– ఈ సాంకేతికత ఉద్దేశ్యం.. ప్రయోజనాలు...** ఈ రోబోను అభివృద్ధి చేయడం వెనుక ప్రధాన ఉద్దేశ్యం, సంతానలేమి సమస్యలతో బాధపడుతున్న దంపతులకు, లేదా ఆరోగ్య సమస్యల కారణంగా గర్భం దాల్చలేని మహిళలకు ఒక కొత్త ఆశను కల్పించడం. ఈ సాంకేతికత భవిష్యత్తులో అంతరిక్ష ప్రయాణాల్లో కూడా ఉపయోగపడవచ్చు. అంతేకాక గర్భధారణ సమయంలో మహిళలు ఎదుర్కొనే శారీరక, మానసిక సమస్యలు ఈ సాంకేతికత ద్వారా తగ్గిపోతాయి. ఇది బయోటెక్నాలజీ.. రోబోటిక్స్ రంగాల్లో ఒక కొత్త శకానికి నాంది పలకనుంది.

**– ఖర్చు.. భవిష్యత్తు...** శాస్త్రవేత్తల అంచనా ప్రకారం 2026 నాటికి ఈ రోబో యొక్క తొలి నమూనా సిద్ధమవుతుంది. ప్రస్తుత అంచనాల ప్రకారం దీని అభివృద్ధి ఖర్చు సుమారుగా ?12.96 లక్షలు. ఇది ప్రారంభ దశలో ఉన్నందున, ఖర్చులు ఇంకా పెరిగే అవకాశం ఉంది.


**– సవాళ్లు.. నైతిక ప్రశ్నలు...** ఈ టెక్నాలజీ అనేక ప్రయోజనాలను అందించినా, దానిపై కొన్ని అభ్యంతరాలూ ఉ న్నాయి. తల్లి గర్భంలో శిశువు పెరగడం వల్ల ఏర్పడే మానసిక బంధం ఈ సాంకేతికతతో లోపించవచ్చు. అంతేకాకుండా మతపరమైన, సాంస్కృతిక అభ్యంతరాలు కూడా దీనిపై చర్చకు దారితీస్తున్నాయి. డబ్బున్న వారికి మాత్రమే అందుబాటులో ఉ ండడం వల్ల సమాజంలో అసమానతలు పెరిగే అవకాశం ఉ ంది. మొత్తంగా చెప్పాలంటే, పిల్లల్ని కనే రోబో అనే ఆలోచన ఒకప్పుడు సైన్స్ ఫిక్షన్‌గా కనిపించినా, ఇప్పుడు వాస్తవానికి చాలా దగ్గరగా ఉంది. రాబోయే కాలంలో ఈ ఆవిష్కరణ మానవ జీవన విధానాన్ని మరియు వైద్య రంగాన్ని పూర్తిగా మార్చే అవకాశం ఉంది. అయినప్పటికీ, దీని వాస్తవ వినియోగం శాస్త్రీయ, సామాజిక మరియు నైతిక చర్చలపైన ఆధారపడి ఉంటుంది.

# అమీబాతో చిన్నారి మృతి.. కేరళలో కలకలం

కేరళలో మరో అరుదైన వ్యాధి బయటపడడంతో అక్కడి ప్రజలు భయాందోళనలకు గురవుతున్నారు. కోజికోడ్ జిల్లా తామరశేరి ప్రాంతానికి చెందిన 9ఏళ్ల బాలిక మెదడును దెబ్బతీసే అమీబా వ్యాధితో ప్రాణాలు కోల్పోయింది. జ్వరం, తలనొప్పి వంటి లక్షణాలతో బాధపడుతున్న ఆమెను తొలుత స్థానిక ఆసుపత్రిలో చేర్చగా, పరిస్థితి విషమించడంతో కోజికోడ్ వైద్య కళాశాలకు తరలించారు.

అక్కడ చికిత్స పొందుతున్న సమయంలోనే బాలిక మృతి చెందింది. మైక్రోబయాలజీ పరీక్షల్లో ఈమె మెదడు వాపుతో బాధపడుతున్నదని, దీనికి "అమీబిక్ ఎన్సెఫలైటిస్" అనే అరుదైన వ్యాధే కారణమని వైద్యులు నిర్ధారించారు.

**కలుషిత నీరు ప్రధాన కారణం..** ఆరోగ్యశాఖ అధికారులు బాలిక మరణానికి కారణమైన అమీబా మూలాన్ని వెతికే ప్రయత్నాలు



ప్రారంభించారు. సమీపంలోని చెరువులు, నీటి వనరులు, సరస్సుల్లో పరిశీలనలు చేపట్టారు. కలుషిత నీటిలో పెరిగే ఈ అమీబా ముక్కు ద్వారా శరీరంలోకి ప్రవేశించి మెదడును ప్రభావితం చేస్తుందని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఈ వ్యాధిని వైద్య పరిభాషలో ప్రైమరీ అమీబిక్ మెనింగోఎన్సెఫలైటిస్ అని పిలుస్తారు. అరుదుగా సంక్రమించినా ప్రాణాంతకమని వైద్యులు పేర్కొంటున్నారు.

**ఇప్పటికే నాలుగు కేసులు...** కోజికోడ్ జిల్లాలో ఇప్పటివరకు ఇలాంటి నాలుగు కేసులు వెలుగు చూశాయని, ఈ మరణం ఐదో సంఘటనగా నమోదైందని అధికారులు తెలిపారు. కలుషిత నీటి వినియోగం ఎంతమంది చేసారో గుర్తించి, వ్యాధి వ్యాప్తిని అంచనా వేయాలని చర్యలు ప్రారంభించారు. ఈ వ్యాధికి ప్రత్యేకమైన చికిత్స అందుబాటులో లేకపోవడం మరింత ఆందోళన కలిగిస్తోంది.

**అప్రమత్తం కావాలని విజ్ఞప్తి...** పిల్లలు వేసవిలో చెరువులు, కాలువలలో స్నానం చేసే సందర్భాలు ఎక్కువగా ఉంటాయని, అలాంటి నీటికి దూరంగా ఉండాలని అధికారులు హెచ్చరిస్తున్నారు.

వ్యక్తిగత పరిశుభ్రత పాటించడం అత్యవసరమని సూచించారు. ఈ వ్యాధి నివారణపై విస్తృత అవగాహన కార్యక్రమాలు చేపట్టాల్సిన అవసరం ఉందని నిపుణులు పేర్కొన్నారు.

# హ్యూమన్ ట్రాఫికింగ్..! ఒక్కసారిగా ఉలిక్కిపడిన హైదరాబాద్

భాగ్యనగరంలో మైనర్ల అక్రమ రవాణా ముఠాల దారుణాలు మరోసారి బయటపడ్డాయి. బంగ్లాదేశ్‌కు చెందిన 15 ఏళ్ల బాలిక ఆరు నెలలుగా దళారుల చెరలో మగ్గుతున్నది. చివరికి ధైర్యం చేసి బండ్లగూడ పోలీస్‌స్టేషన్‌లోకి చేరి తన వేదనను వెల్లడించింది.

**మాయమాటలతో వలలోకి...** ఢాకాకు చెందిన రూపా అనే మహిళ పర్యటన పేరుతో భారత్‌కి తీసుకెళ్తానని నమ్మబలికిందని బాలిక పోలీసులకు తెలిపింది. బోటులో సరిహద్దు దాటి, రైలు మార్గంలో హైదరాబాద్ చేరుకున్న తరువాత ఆమెను 20 వేలకు అమ్మేశారు. దీంతో బాధితురాలు బలవంతంగా వ్యభిచార కూపంలోకి నెట్టబడింది.

**హొటళ్లలో బలవంతం...** దళారులు హొటళ్లలో కస్టమర్లకు దగ్గరకు తీసుకెళ్లేవారని బాలిక చెప్పింది. మహమ్మద్ సమీర్ అనే వ్యక్తి తరచూ తనను కస్టమర్ల దగ్గరికి తీసుకెళ్లేవాడని వివరించింది. ఒక సందర్భంలో పోలీస్‌స్టేషన్ కనిపించగానే పరుగెత్తి లోపలికి చేరి సహాయం కోరిందని వివరించింది.

**బాలిక ధైర్యం.. ముఠా ఆగడాలు బహిర్గతం...** చెల్లుబాటు అయ్యే పత్రాలు లేవనే భయంతో ఇంతకాలం నోరెత్తలేదని, జైలుకు పంపుతారేమోనని కలవరపడ్డానని బాలిక పేర్కొంది. కానీ చివరికి



చేసిన ప్రయత్నం ముఠా ఆకృత్యాలను బట్టబయలు చేసింది.

**తల్లిదండ్రుల అన్వేషణలో పోలీసులు...** బంగ్లాదేశ్‌లో ఆమె తల్లిదండ్రులను కనుగొనడానికి ప్రయత్నాలు కొనసాగుతున్నాయని అధికారులు వెల్లడించారు. హైదరాబాద్ లో ఇటీవలి కాలంలో మైనర్ల అక్రమ రవాణా విపరీతంగా పెరుగుతోందని వారు ఆందోళన వ్యక్తం చేశారు.

**పెరుగుతున్న ముప్పు...** రాజ్యసభలో సమర్పించిన గణాంకాల ప్రకారం, ఇటీవల 1,301 మంది మైనర్లు హైదరాబాద్ లో అక్రమ రవాణాకు గురయ్యారు. నకిలీ గుర్తింపులతో బంగ్లాదేశ్ నుంచి వలసలు జరుగుతున్నాయని అధికారులు ధృవీకరించారు. అవగాహన కార్యక్రమాలు, ప్రత్యేక దాడులు జరుగుతున్నా ఈ ముఠాలు నియంత్రణలోకి రాకపోవడం ఆందోళన కలిగిస్తోంది.

**కఠిన చర్యలే మార్గం...** ఈ ఘటన మరోసారి చాటింది. మైనర్ల రక్షణ కోసం కఠిన పర్యవేక్షణ, ప్రజల సహకారం, అంతర్జాతీయ సమన్వయం అత్యవసరమని రూఢీ చేసింది.

**బాధితులకు అండగా నిలిస్తేనే..** 15ఏళ్ల బాలిక చేసిన ధైర్యానికి పోలీసులు అండగా నిలిచారు. ఇలా మోసపోయిన బాలికలకు సమాజం కూడా భరోసా ఇచ్చినప్పుడు మానవ అక్రమ రవాణా ముఠాల నుంచి బయటపడతారు. బాలికల అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకొని మాయమాటలతో మోసగించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటే హ్యూమన్ ట్రాఫికింగ్ ను నిర్మూలించవచ్చు.

## సంపాదకీయం

# భారత్ పై ట్రంప్ పగటి కలలు ఎప్పటికీ నెరవేరవు

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇటీవల భారత్, రష్యా దేశాల మధ్య చమురు వ్యాపారంపై చేసిన వ్యాఖ్యలు చర్చనీయాంశమయ్యాయి. రష్యాకు పెద్ద కొనుగోలుదారు అయిన భారత్ ఆ దేశానికి దూరమైందని ట్రంప్ పేర్కొన్నారు. కానీ, గణాంకాలు మాత్రం దీనికి విరుద్ధంగా ఉన్నాయి. జాతీయ ప్రయోజనాల ఆధారంగా భారత్ తన విధానాలను రూపొందించుకుంటుందనే వాస్తవాన్ని ఈ వ్యాఖ్యలు విస్మరించాయి.

**ట్రంప్ వ్యాఖ్యలు...** ట్రంప్ తన ఒక ఇంటర్వ్యూలో "భారత్ రష్యాకు పెద్ద మద్దతుదారు కాదు, రష్యా తన అతిపెద్ద వినియోగదారుని కోల్పోయింది" అని వ్యాఖ్యానించారు. పుతిన్‌తో జరగబోయే శిఖరాగ్ర సమావేశానికి ముందు ఈ వ్యాఖ్యలు చేయడం గమనార్హం. అంతేకాకుండా, అవసరమైతే "సెకండరీ టారిఫ్‌లు" విధించడానికి వెనుకాడబోనని, అది "వినాశకరమైన" నిర్ణయం అయినప్పటికీ అమెరికా ప్రయోజనాల కోసం అమలు చేస్తామని హెచ్చరించారు.

**వాస్తవాలు...** ట్రంప్ వ్యాఖ్యలకు విరుద్ధంగా, భారత్ రష్యా నుండి చమురు కొనుగోలును తగ్గించలేదు. కెప్లెర్ నివేదికల ప్రకారం, జూలైలో భారత్ రోజుకు 16 లక్షల బ్యారెళ్ల చమురు కొనుగోలు చేయగా, ఆగస్టులో అది 20 లక్షల బ్యారెళ్లకు పెరిగింది. ఇది భారత్ తన జాతీయ ప్రయోజనాల ఆధారంగా వ్యవహరిస్తుందనే వాస్తవాన్ని స్పష్టం చేస్తుంది. రష్యా నుండి చమురు కొనుగోలు చేయడం భారత్‌కు ఆర్థికంగా లాభదాయకం. అంతేకాక, చమురు సరఫరాదారుల జాబితాలో అమెరికా ఐదవ స్థానంలో ఉంది. ఈ నేపథ్యంలో, ట్రంప్ మాటలు వాస్తవాలకు పూర్తి భిన్నంగా కనిపిస్తున్నాయి.

**- అంతర్జాతీయ సంబంధాలు, జాతీయ ప్రయోజనాలు...** ప్రతి దేశం తన జాతీయ ప్రయోజనాల ఆధారంగా విదేశాంగ విధానాన్ని రూపొందించుకుంటుంది. ముఖ్యంగా అంతర్జాతీయంగా చోటు చేసుకునే పరిణామాలు, యుద్ధాలు, ఆర్థిక పరిస్థితులు ఆయా దేశాల నిర్ణయాలపై ప్రభావం చూపుతాయి. ఈ విషయంలో భారత్ కూడా అదే చేసింది. ఉక్రెయిన్ యుద్ధం నేపథ్యంలో రష్యా నుండి రాయితీ ధరల వద్ద చమురు లభించడం భారత్‌కు ఒక గొప్ప అవకాశం. ఇది భారత్ తన ఇంధన భద్రతను బలోపేతం చేసుకోవడానికి, ఆర్థిక స్థిరత్వాన్ని కాపాడుకోవడానికి సహాయపడుతుంది.

**భవిష్యత్తు సవాళ్లు...** ట్రంప్ "సెకండరీ టారిఫ్‌లు" విధించే హెచ్చరిక ఒక తీవ్రమైన సవాల్. అయినప్పటికీ, అంతర్జాతీయ చట్టాలు, వాణిజ్య ఒప్పందాలను పరిగణనలోకి తీసుకుంటే అటువంటి చర్యలు అంత తేలిక కాదు. ఒకవేళ అమెరికా ఇలాంటి నిర్ణయాలు తీసుకుంటే అది ప్రపంచ వాణిజ్య వ్యవస్థపై, ముఖ్యంగా అమెరికా ఆర్థిక వ్యవస్థపై కూడా ప్రతికూల ప్రభావం చూపుతుంది. ప్రపంచ వాణిజ్య సంస్థ వంటి సంస్థలు ఇటువంటి ఏకపక్ష నిర్ణయాలను తీవ్రంగా ఖండిస్తాయి. డొనాల్డ్ ట్రంప్ వ్యాఖ్యలు అతని రాజకీయ ఆలోచనలకు, అమెరికా ప్రయోజనాలకు అనుగుణంగా ఉండవచ్చు. కానీ అవి వాస్తవాలను, గణాంకాలను ప్రతిబింబించడం లేదు. భారత్ వంటి దేశాలు కేవలం ఇతర దేశాల ఒత్తిళ్లకు తలొగ్గకుండా తమ జాతీయ ప్రయోజనాలకు ప్రాధాన్యత ఇస్తూ నిర్ణయాలు తీసుకుంటాయనేది స్పష్టం. కాబట్టి, భారత్‌పై ట్రంప్ చూస్తున్న 'పగటి కలలు' ఎప్పటికీ నెరవేరవు.

# విశేష రాజకీయ అనుభవ శాలి శంకర దయాళ్ శర్మ - ఆగస్టు 19. దివంగత రాష్ట్రపతి ఎస్. డి. శర్మ జయంతి



శంకర్ దయాళ్ శర్మ (ఆగస్టు 19, 1918డిసెంబర్ 26, 1999) ప్రసిద్ధ స్వాతంత్ర్య సమర యోధులు, ఒక ప్రముఖ న్యాయవాది, రాజకీయవేత్త, అసాధారణమైన విద్యార్హతలు కలిగిన పండితులు. భారతదేశ స్వాతంత్ర్య పోరాటంలో చురుకుగా పాల్గొన్న స్వాతంత్ర్య సమరయోధులలో ఆయన ఒకరు. ఆయన భారత క్రియాశీల రాజకీయాలలో విశేష అనుభవం కలిగి, ఎన్నో ఉన్నత స్థానాలను నిర్వహించారు. రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలలో మంత్రిగా, రాష్ట్ర కాంగ్రెస్, జాతీయ కాంగ్రెస్ అధ్యక్షులుగా, రాష్ట్రాల గవర్నరుగా, దేశ ఉప రాష్ట్రపతిగా, సర్వోన్నత పదవి రాష్ట్రపతిగా విధులు నిర్వహించిన విశేష అనుభవ శాలి. 1940 లలో తమ రాజకీయ జీవితాన్ని ప్రారంభించారు. 1940 వ దశకంలో శర్మ భారత స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొన్నారు. అదే దశకంలోనే కాంగ్రెస్ పార్టీలో చేరి చివరి వరకూ అదే పార్టీకి విధేయులుగా ఉన్నారు. 1942 లో జరిగిన చారిత్రాత్మక క్విట్ ఇండియా ఉద్యమంలో, స్వదేశీ స్వాతంత్ర్య ఉద్యమంలో చురుకుగా పాల్గొన్నారు. రాజకీయ కార్యకలాపాలలో పాల్గొనడం ప్రారంభించిన వెంటనే శంకర్ దయాళ్ శర్మ కాంగ్రెస్ జాతీయ కాంగ్రెస్ లో చేరారు.


కాంగ్రెస్ పార్టీ పక్షాన భారత దేశంలో బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా ఎన్నో పోరాట కార్యక్రమాల్లో భాగస్వాములు అయ్యారు. భోపాల్ నగరంలో 1918, ఆగస్టు 19న జన్మించిన శర్మ సెయింట్ జాన్ కళాశాల, ఆగ్రా కళాశాల, అలహాబాద్ విశ్వ విద్యాలయం, లక్నో విశ్వ విద్యాలయం, ఫిట్జ్ విలియం కళాశాల, కేంబ్రిడ్జ్ విశ్వ విద్యాలయం, లింకన్స్ ఇన్, హార్వర్డ్ న్యాయ పాఠశాల మొదలైన అనేక విద్యా సంస్థల్లో విద్య నభ్యసించారు. శర్మ లక్నో విశ్వ విద్యాలయంలో 9 సంవత్సరాలు న్యాయ శాస్త్రాన్ని బోధించారు. తరువాత కేంబ్రిడ్జ్ విశ్వ విద్యాలయంలో న్యాయ శాస్త్రాన్ని బోధించారు. శర్మ 1992 నుండి 1997 వరకు రాష్ట్రపతిగా, 1987 నుండి 1992 వరకు రామస్వామి వెంకటరామన్ రాష్ట్రపతిగా ఉన్నపుడు, ఉప రాష్ట్రపతిగా పనిచేసారు. అంతకు పూర్వం 1950 నుండి 1952 వరకు భోపాల్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులుగా ఉన్నారు. 1952 లో అప్పటి భోపాల్ రాష్ట్రానికి ముఖ్యమంత్రి అయ్యారి. 1956లో భోపాల్ మిగతా చిన్న రాష్ట్రాలతో కలిసి మధ్యప్రదేశ్ ఏర్పడేవరకూ ముఖ్యమంత్రిగా పనిచేశారు. విద్యా శాఖ, న్యాయ శాఖ మొదలైన అనేక శాఖల్లో కేంద్ర మంత్రిగా, ఆంధ్రప్రదేశ్ గవర్నరుగా పనిచేసారు. 1960లలో ఇందిరా గాంధీ బలమైన మద్దతు దారుగా, ఆమె కాంగ్రెస్ పగ్గాలు చేపట్టడాన్ని సమర్థించారు.

ఆమె ప్రధాన మంత్రిగా ఉన్న కాలంలో అనేక మంత్రి పదవులు నిర్వహించారు. 1972-74 మధ్యలో భారత జాతీయ కాంగ్రెస్ అధ్యక్షులుగా పనిచేశారు. 1974-77 మధ్యలో కమ్యూనికేషన్ల శాఖా మంత్రిగా పనిచేశారు. 1984 లో ఆంధ్రప్రదేశ్ గవర్నర్‌గా నియమితులయ్యారు . పంజాబ్‌లో ఎన్నికల తర్వాత, 1985 లో శర్మ పంజాబ్ గవర్నర్‌గా నియమితులయ్యారు. న్యాయవాద వృత్తిలో ఆయన అందించిన సేవలకు గుర్తింపుగా అంతర్జాతీయ సంఘం నుండి లివింగ్ లెజెండ్స్ ఆఫ్ ది లా అవార్డును అందుకున్నారు. ఆయన జీవిత చరమాంకంలో తీవ్ర అనారోగ్యానికి గురై, 1999 అక్టోబరు 9 న విపరీతమైన గుండెపోటుతో ఢిల్లీలో తుదిశ్వాస విడిచారు. ఆయన భౌతిక కాయాన్ని విజయ్ ఘాట్ వద్ద ఖననం చేశారు.

**రామ కిష్టయ్య సంగన భట్ల - 9440595494**

# పలు భావాల సమాహారం ఫోటోగ్రఫీ - నేడు ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవం

నాగరికంగా మనిషి ఎదగటం మొదలైన దశలో మానవుడికి తాను చూస్తున్న వాటిని వారసత్వ సంపదగా అందించాలనే కోరిక ఉండేది. కోరిక నుండి ఉద్భవించిన మహాద్భుతమే ఫోటోగ్రఫీ. ఎక్కడో రాతి గుహల గోడల మీద సూర్యకాంతి పడిన చోట నల్లగా మారటం గమనించి, కొన్ని రసాయ నాలు వెలుతురు పడిన మేర నల్లటి ఆకృతిని ఏర్పరుస్తాయన్న విషయం అర్థంచేసుకుని క్రమంగా ఫోటోగ్రఫీ ఆవిర్భావానికి బీజం వేసాడు మానవుడు. ఎన్నో భావాలను ఒక్క చిత్రంతో తెలిపే గొప్పదనం ఒక్క ఫోటోగ్రఫీకి ఉంది. ఈ ఆధునిక కాలంలో మానవ జీవితంతో ఫోటోగ్రఫీకి విడదీయలేని బంధం ఉంది. ఫోటోగ్రఫీకి శతాబ్దాల చరిత్ర ఉంది. రసాయనాలతో రూపొందించిన ప్లేటుపై కాంతిచర్యతో ఓ రూపాన్ని బంధించడాన్ని ఫోటోగ్రఫీ అంటారు. రెండు గ్రీకు పదాల కలయికే ఫోటోగ్రఫీ. "ఫోటో అంటే చిత్రం", "గ్రఫీ అంటే గీయడం" అని అర్థం. ఫోటోగ్రఫీ అంటే కాంతితో చిత్రాన్ని గీయడం. 18వ శతాబ్దంలో పారిస్‌లో నలుకు తెలుపులతో ప్రారంభమైన ఫోటోగ్రఫీ కాల క్రమంలో రంగులు అద్దుకుంటూ కొత్త పుంతలు తొక్కుతోంది. ఫ్రాన్స్‌కు చెందిన లూయిస్ జే.ఎం.డాగ్యూరే 1837లో ఫోటోగ్రఫీ ప్రాసెస్‌ను కనుగొన్నారు. 1839 జనవరి 9న ఫ్రెంచ్ అకాడమీ ఆఫ్ సైన్సెస్ డాగ్యురే టైప్ ప్రాసెస్‌ను అధికారికంగా ప్రకటించింది. పూర్తి రూపం ఇచ్చి ఫోటోగ్రఫీ అనే ప్రక్రియను ప్రపంచానికి తెలియ జెప్పేందుకు ఆ తర్వాత మరో 280 సంవత్సరాలు పట్టింది. ఈ మధ్యలో ఎందరెందరో పరి శోధకులు ప్రయోగాత్మకంగా దృశ్యాన్ని లోహం మీద బంధించేందుకు ప్రయత్నాలు చేశారు. కానీ చివరికి ఆ ఖ్యాతి దక్కింది ఎల్.జె.ఎల్. కు, 1837 ఫ్రెంచి ప్రభుత్వం ఆకాడమీ ఆఫ్ సైన్సెస్ వారి ముందు డాగురే తాను కనుగొన్న ఒక కొత్త పరి కరాన్ని ప్రదర్శించాడు. బయటవున్న చిత్రాన్ని ఒక నల్లటి ఫలకంపై ముద్రించి, ఆ పైన దానిని ప్రాసెస్' చేసి ఆ చిత్రాన్ని శాశ్వతంగా ప్రదర్శించ గలిగినదే ఆ ప్రక్రియ. అది జరిగింది




జనవరి 9, 1839. ఆ అద్భుత మైన ఆవిష్కారానికి హక్కులు పరిశోధకుడికి ఇచ్చారు. అయితే ఇది ఒక వ్యక్తి హక్కు కాకూడదని భావించిన ఫ్రాన్స్ ప్రభుత్వం, ఆ పాటోగ్రఫీ పేటెంట్ తాను కొనుగోలు చేసి, ప్రపంచానికి ఉచిత బహుమతిగా ప్రకటించిన తేదీ ఆగష్టు 19, 1839. అలా ప్రపంచమంతా పోటోలు తీసుకునే హక్కును పొందిన ఆ తేదీని ప్రపంచ పాటోగ్రఫీ దినోత్సవంగా జరుపు కుంటారు. తొలిరోజుల్లో ఫోటోలు తీయించు కొనేందుకు మనుషులు భయపడే వారంటే నమ్మగలరా! తొలినాటి కెమెరా ఫోటో కావాలంటే దాని ఎదురుగా మనిషి 45 నిమిషాలపాటు కదలకుండా కూర్చోవాలి. అయితే ఆ ' రాకాసీ' (కెమెరా) మనిషి లోని శక్తిని లాగేస్తుందని, ఫోటో తీయించుకుంటే జీవ శక్తి తగ్గిపోయి త్వరగా మరణిస్తారని భావించి నాడు ప్రజలు భయంతో దూరంగా సాగి పోయారు. ఫోటోలు తీయించుకుంటే ఆయుర్దాయం తగ్గుతుందనే నమ్మకం మన దేశంలోనూ చాలాకాలం ఉండేది. మనదేశంలో 1857 వరకు ఫోటోగ్రఫీ అందుబాటులోకి రాలేదు. కేవలం బ్రిటిష్ రాజు, జమీందారులు, సిపాయిలు మాత్రమే దీనిని ఉపయోగించేవారు. 1977 నుంచి ఫోటోగ్రఫీ సామాన్యులకు అందుబాటులోకి వచ్చింది. భారత్‌లో మొట్టమొదటిసారిగా లాలా దీనదయాళ్ ఫోటోగ్రఫీకి శ్రీకారం చుట్టారు. సమయం, సందర్భం ఏదైనా, నేడు ఫోటో లేని జీవితం ఊహించుకోలేం. ఎన్నో భావాలను ఒక్క చిత్రంతో తెలిపే గొప్పదనం ఒక్క ఫోటోగ్రఫీకి ఉంది. ఈ ఆధునిక కాలంలో మానవ జీవితంతో ఫోటోగ్రఫీకి విడదీయలేని బంధం ఉంది. అప్పుడే పుట్టిన పసిబిడ్డ నుండి, అంతిమ యాత్ర వరకు ప్రతి దశ కెమెరాతో బంధించాల్సిందే. ఇప్పుడు ప్రతి సెల్ ఫోన్ ఒక కెమెరా. సెల్ ఫోన్ వున్న ప్రతి ఒక్కరూ ఫోటోగ్రాఫిలో నైపుణ్యం పొందుతున్నారు. ఫోటోగ్రాఫర్ తీసే ఫోటో చూస్తే కలిగే ఆనందం వేరు. నలుపు తెలుపు అయినా, సప్త వర్ణాలతో తీసింది అయినా మనసును తట్టి తీరుతుంది. అలా ఆవిర్భవించిన ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవానికి ఏ యేటి కాయేడు ఆదరణ పెరుగుతోంది. ఎందరెందరో కెమెరాతో ట్రిక్కులు చేస్తున్నారు. తమ సృజనను ప్రదర్శి స్తున్నారు. ప్రతి సంవత్సరపు ఫోటో గ్రాఫిక్ దినోత్సవం కొత్త కొత్తగా కొనసాగుతోంది. రాష్ట్ర సమాచార పౌర సంబంధాల శాఖ ఆధ్వర్యంలో ఉత్సవాలు ఏటా నిర్వహి స్తున్నారు. ఉత్సవాల్లో భాగంగా ఫోటో ప్రదర్శనతో పాటు, ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్ర సమాచార పౌర సంబంధాల శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి ఫోటోగ్రఫీ పోటీలలో గెలుపొందిన వారికి అవార్డులను ప్రధానం చేసే కార్యక్రమం నిర్వహిస్తున్నారు.

**రామ కిష్టయ్య సంగన భట్ల - 9440595494**


# గణిశాస్త్ర మేధావి బ్లేజ్ పాస్కల్ - ఆగస్టు 19...బ్లేజ్ పాస్కల్ వర్ధంతి

అన్ని వయసులవారూ నేడు వాడే చిన్ని యంత్రం కాలుక్యులేటరు. కూడికలు, తీసివేతలు, హెచ్చ వేతలు, భాగహారాలు ... ఒకటేమితి, లెక్కల్లో వచ్చే ప్రతి అంశాన్నీ అతివేగంగా పరిస్కరించి తెర మీద చూపిస్తుంది. ఇది విద్యార్థులకు, వ్యాపార సంస్థలకు, అనేకులకు అనేక విధాలుగా ఉపయోగ పడుతుంది . దీన్ని కనుగొన్నశాస్త్రజ్ఞుడే బ్లెయిస్ పాస్కల్ . పాస్కల్ (జూన్ 19, 1623 - ఆగష్టు 19, 1662) పాస్కల్ సూత్రం కనిపెట్టిన శాస్త్రవేత్త. ప్రఖ్యాతి గాంచిన గణిత శాస్త్రవేత్త, భౌతిక శాస్త్రజ్ఞుడు, ఆధ్యాత్మిక తత్వవేత్త. బ్లేజ్ పాస్కల్ జూన్ 19, 1623 న ఫ్రాన్స్ యొక్క దక్షిణ - మధ్య ప్రాంతంలో ఆవర్న్లే ప్రాంతంలో క్లెర్మాంట్‌లో జన్మించాడు. ఈ ప్రాంతం ఉంది. చిన్న వయసులోనే మరణించిన గణిత మహా మేధావి. ఫ్రాన్స్ కి చెందిన పాస్కల్ 7 యేండ్ల వయస్సు నుండే జామెట్రీ పట్ల విపరీతమైన ఆసక్తిని ప్రదర్శిస్తూ అందరినీ ఆశ్చర్య పరచే వాడట, 12 ఏళ్ళ వయస్సులోనే ఒక త్రిభుజం లోని మూడు కోణాల మొత్తం రెండు లంబకోణాల మొత్తానికి సమానంగా ఉంటుందనే సిద్ధాంతాన్ని ప్రవేశ పెట్టాడు. దీంతో ఈయన తండ్రి పాస్కల్ ను గణితం చదవడానికి ఎక్కువగా ఆసక్తి చూపాడు. అందరూ వేనోళ్ళ కొనియాడుతున్న "యూనివర్సల్ థీరం ఆఫ్ జామెట్రీ" పాస్కల్ రూపొందించినదే. పదహారేళ్ల వయసులో శంఖు పరిచ్ఛేదాల గురించి గొప్ప వ్యాసం రాసి మహామహా గణితవేత్తలే ముక్కున వేలు వేసుకునేట్టు చేశాడు పాస్కల్. ఆ కృషిలో బయట పడ్డదే పాస్కల్ సిద్ధాంతంగా తరువాత పేరు పొందింది. శంఖు పరిచ్ఛేదంలో అంతర్లి ఖితమైన ఏదైనా షడ్భుజి యొక్క అభిముఖంగా ఉండే అంచులని కలుసుకునే వరకు పొడిగిస్తే, ఆ మూడు జతల అభిముఖ అంచులూ కలిసే మూడు ఖండన బిందువులూ ఒకే సరళరేఖలో ఉంటాయి. ఈ సిద్ధాంతం ప్రకారం... షడ్భుజి ఆరు భుజాలు (లేదా బాహువులు) గల బహుభుజి. ఆ భుజాలు సమానంగా ఉండనక్కర్లేదు. ఆరు భుజాలు ఉన్నాయి గనుక ఒకటోది, నాలుగోది అభిముఖంగా ఉంటాయి. అలాగే 2-5, 3-6 జతల భుజాలు కూడా అభిముఖంగా ఉంటాయి. ఈ అభిముఖంగా ఉండే భుజాల జతలని పొడిగిస్తే ఎక్కడో అక్కడ కలుస్తాయి. అలా వచ్చిన మూడు ఖండన బిందువులు ఒకే సరళ రేఖ మీద ఉంటాయని సిద్ధాంతం చెప్తుంది. పాస్కల్ సిద్ధాంతం 1639 లో ప్రచురించ బడింది, "ది కోనిక్స్ ఎస్సే". పాస్కల్ యొక్క ఆధ్యాత్మిక షడ్భుజి అని పిలుస్తారు. ఆయనకు 17 ఏళ్ళు వచ్చినప్పుడు ప్రముఖ గణిత శాస్త్రజ్ఞుడు డెస్ కార్టెస్ ఆయనలో ఒక గొప్ప మేధావిని చూసి ప్రశంసించాడు. అంతటి సమర్థుడు బ్లెయిసీ పాస్కల్. పాస్కల్ త్రిభుజం గురించి, దాని లక్షణాల గురించి 20ఏళ్ళ వయసుల ఓ పుస్తకం రాశాడు. పాస్కల్ జీవితమంతా ఫ్రాన్స్ లోనే గడిచింది. ఆయన తండ్రి అక్కౌంటెంట్ గా పని చేసేవాడు. రాత్రీ పగలూ లెక్కలు చేసేవాడు. తండ్రి పడుతున్న కష్టం చూచి పాస్కల్ లెక్కలు చేసే యంత్రాన్ని రూపొందించాడు. ఈ కాలిక్యులేటింగ్ మెషిన్ కూడికలు, తీసివేతలు, గుణింతాలు, భాగహారాలు వంటివి చేసిపెట్టేది. ఆ మెషీన్ పాస్కల్ తండ్రికి ఎంతగానో ఉపయోగపడేది. అయితే ఈ యంత్రాన్ని తయారు చేయటానికి ఎవరూ ముందుకు రాలేదు. కారణం దానికయ్యే ఖర్చు ఎక్కువ కావటమే. అయినప్పటికీ చాలా కాలం తరువాత 1892 విల్లియం బరగ్స్ అనే అమెరికన్ పాస్కల్ నమూనాను ఆధారంగా చేసుకునే ఓ కాలిక్యులేటింగ్ మెషీన్ రూపొందించాడు. పాస్కల్ సూత్రం తెలియని విద్యార్థి ఉండరు. ద్రవ పదార్థంలో ఏదైనా ఒక బిందువు వద్ద పీడనాన్ని



ఉపయోగించడం జరిగితే ఆ పీడన ప్రభావం ఆ ద్రవ పదార్థం అన్ని పైపులకు సమానంగా విస్తరిస్తుంది. ఈ సూత్రాన్ని ఆధారంగా చేసుకుని సిరెంజ్ ని, హైడ్రాలిక్ ప్రెస్ ను, హైడ్రాలిక్ బ్రేక్ ను రూపొందించటం జరిగింది. పాస్కల్ ఒక త్రిభుజాన్ని కూడా నిర్మించాడు. దీన్ని పాస్కల్ త్రిభుజం అంటారు. ఈ త్రిభుజం సహాయంతో ప్రాబబిలిటీ సమస్యలను సునాయాసంగా చేయవచ్చు. 1643 లో చేసిన గణిత శాస్త్రవేత్త మరియు భౌతిక శాస్త్రవేత్త ఎవాంజెలిస్టా టోరిసెల్లి రూపొందించిన ప్రయోగాలను పునరావృతం చేశాడు. 1646 నుండి పాస్కల్ శూన్యతను తనిఖీ చేసే ఎంపికలను అధ్యయనం చేయడానికి తనను తాను అంకితం చేసుకున్నాడు. 1653 లో పాస్కల్ వాతావరణ పీడనం గురించి ఒక గ్రంథాన్ని ప్రచురించాడు. హైడ్రో స్టాటిక్స్ అంశం చాలా వివరణాత్మక రీతిలో అభివృద్ధి చేయబడిన మొదటి గ్రంథంగా ఇది పరిగణించబడుతుంది. పాస్కల్ శాస్త్రవేత్త మాత్రమే కాదు. తత్వవేత్త కూడా. రచయిత కూడ, మతపరమైన పుస్తకాలను ఎన్నింటినో రాసాడు. జామెట్రీ, ప్రాబబిలిటీ, హైడ్రోస్టాటిక్స్, ఎంటగ్రల్ కాలిక్యులస్ ం అంశాల మీద ఎన్నో విలువైన పరిశోధనలు చేశాడు. పాస్కల్ ప్రధాన రచనలు పాస్కల్ యొక్క సిద్ధాంతం, పాస్కలిన్, శూన్యత యొక్క ఉనికి లేదా వాతావరణ పీడనంపై ప్రయోగాలు. 1659 లో తీవ్ర అనారోగ్యం పాలై, పాస్కల్ 1662 లో కన్ను మూశాడు. మొదటి కాలిక్యులేటర్ నుండి మొదటి ప్రజా రవాణా సేవ వరకు ఆవిష్కరణలతో అతను చిన్న వయస్సు నుండే ప్రపంచాన్ని విప్లవాత్మకంగా మార్చాడు. ఆయన వెలువరించిన శాస్త్రీయ వాస్తవాలు మాత్రం ఎంతో మందికి మార్గ నిర్దేశం చేస్తున్నాయి. **రామ కిష్టయ్య సంగన భట్ల - 9440595494**

# ఫోటో చిత్రీకరణలో దిట్ట వడ్లూరి - నేడు ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవం



సుప్రభాత వేళ నుండి సూర్యాస్తమయం వరకూ తాను చూసిన ప్రకృతి అందాలను కెమెరాతో బంధించి ట్రిక్కులు చేయడం, లెన్సుతో జిమ్మిక్కులు చేయడం ఆయన అభిరుచి. ప్రకృతి ఆయన కళా సాధనం. కెమెరా ఆయన ఆరోప్రాణం. నిరంతరం తాను కళా తపస్సులో నిమగ్నమై కెమెరాతో అద్భుతాలు సృష్టిస్తూ, కెమెరాకే ట్రిక్కులను నేర్పుతున్న కళారాధకుడు సుప్రసిద్ధ ప్రాచీన పుణ్య క్షేత్రమైన ధర్మపురి నివాసి వడ్లూరి రవీందర్. చిత్ర, విచిత్రమైన ఫోటోలు తీస్తూ, ఫోటోగ్రఫీలో అత్యున్నత శిఖరాలను చేరుకోవడమే ఆయన జీవితాశయం. బాల్యం నుండి ఎన్నో సృజనాత్మకత ఉట్టిపడే సుందర దృశ్యాలను బుల్లి కెమెరాలో బంధించారాయన. స్వయం కృషితో సాధన చేస్తూ, ట్రిక్ ఫోటోగ్రఫీ ద్వారా అపురూప చిత్రాలను చిత్రీకరించి, ప్రావీణ్యం సంపాదించి, వివిధ ప్రదర్శనలలో ప్రదర్శించి, బహుమతులందుకుని ప్రశంసాపాత్రులైనారు. చింతగింజపై వేసిన వెంకటేశ్వరుడు, బియ్యపుగింజపై రాసిన ఇంగ్లీషు అక్షరాలు, బొమ్మల చిత్రాలు, పనికి రాని వస్తువులతో తయారు చేసిన బొమ్మలు రవీందర్ ప్రజ్ఞకు, ప్రావీణ్యానికి మచ్చుతునకలు. డిగ్రీ పూర్తిచేసి, ఉద్యోగం దొరకక పోయినా నిరుత్సాహ పడక, ధర్మపురి క్షేత్రం లోనే 1987లో ఒక ఫోటో స్టుడియోను నెల కొల్పి తన ప్రతిభకు మెరుగులు దిద్దుతూ తనకంటూగల ఒక ప్రత్యేక కెమెరా టెక్నిక్ ద్వారా నాలుగు దశాబ్దాల క్రితం నుండి ముందు బ్లాక్ అండ్ వైట్, తర్వాత కలర్ ఫోటోలు తీస్తూ, ఫోటోగ్రఫీ ద్వారా ఒకే వ్యక్తి పొట్టిగా మరియు పొడగరిగా, మరుగుజ్జుగా అద్భుతాలను ఆవిష్కరించా రాయన. అంతేగాక ఒక వ్యక్తి అవిటి వాడుగా, మరో ఫోటోలో రెండు కాళ్ళున్న వాడిగా ఫోటోలు తీసి పాజిటివ్ చేయడం ఆయనకే సొంతం. ప్రకృతి అందాలను కెమెరాలో బంధించి, భూత, వర్తమాన, భవిష్యత్తు చూపేది, భాష లేనిది, భావమున్నది, లిపిలే నిది ఫోటో అంటారాయన. 1999లో స్వాతంత్ర్య దిన వేడుకలలో హైదరాబాద్ లో రాష్ట్ర స్థాయిలో తృతీయ బహుమతి, 2003లో జిల్లా సమాచార శాఖ పక్షాన తృతీయ బహుమతి 2004 లో శాతవాహన ఉత్సవాలలో నాటి ఎంపీ సువర్ణ కుమారి ద్వారా ఉత్తమ ప్రదర్శనకు నగదు ప్రశంసాపత్రం 2011లో సమాచార శాఖ ఆధ్వర్యంలో ద్వితీయ బహుమతి 2012 లో రాష్ట్ర సమాచార శాఖ పక్షాన హైదరాబాదులో నాటి మంత్రి డీకే అరుణ చేతుల మీదుగా తృతీయ బహుమతి 2013 లో జిల్లా స్థాయిలో సమాచార శాఖ ద్వారా ద్వితీయ బహుమతి 2015 లో అమరవీరుల సంస్మరణ వారోత్సవాలు జిల్లా పోలీసు శాఖ పక్షాన నాటి ఆర్థిక మంత్రి ఈటల రాజేందర్ నాకు ఎస్పీ జోయల్ డేవిస్ ద్వారా ఉత్తమ బహుమతిని అందుకున్నారు. ఆగష్టు 19 వ తేదీ ప్రపంచ ఫోటోగ్రఫీ దినం సందర్భంగా గా వడ్లూరి రవీందర్ కలిసినప్పుడు వెలుగు నీడల కలయిక అయినా జీవితంలో బతుకు దాడిలో చీకటి వెలుతురు సమంగా స్వాగతించి కెమెరాలో బంధించి ఫోటోగ్రఫీ ఒక శాస్త్రీయమైన అన్నారు. తాను చేసిన కృషికి రాష్ట్ర జిల్లా స్థాయిలో పలు బహుమతులను అందుకొనాలని ప్రభుత్వంచే గుర్తింపు పొందిన కళాకారులలో ఒకరిగా గుర్తింపు కార్డు లభించడం ఆనందదాయకం అన్నారు. **రామ కిష్టయ్య సంగన భట్ల - 9440595494**

## పట్టభద్రులయ్యేలా.. ఫిజిక్స్ వాలా..!

సూర్యాపేట: పేద విద్యార్థులకు నాణ్యమైన విద్యనందిస్తున్న ప్రభుత్వం.. వారి భవిష్యత్తును బంగారంలా తీర్చిదిద్దేందుకు వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. కార్పొరేట్ విద్యాసంస్థల్లోని విద్యార్థులు నీట్, జేఈఈ, ఎప్‌సెట్‌లో మంచి మార్కులతో పేరున్న విద్యాసంస్థలో సీట్లు సాధిస్తున్నట్లుగా.. ఇకపై ఆదర్శ, కేజీబీవీ, గురుకుల కళాశాలల్లోని పిల్లలు తమ లక్ష్యాన్ని సాధించేలా సర్కారు ముందడుగు వేసింది. ప్రముఖ విద్యావేదిక ఫిజిక్స్ వాలాతో ఒప్పందం కుదుర్చుకుని గత నెల 15 నుంచి బోధన కొనసాగిస్తుంది. ఆ పాఠ్యాంశాలు తమకు ఎంతో ఉపయుక్తమవుతున్నాయని విద్యార్థులు చెబుతున్నారు.

**బోధన ఇలా..**

ప్రతి రోజు మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు బోధన ఉంటుంది. గణితం, వృక్ష, జంతు, భౌతిక, రసాయశాస్త్రం సబ్జెక్టులకు మూడు తరగతులు నిర్వహిస్తున్నారు. ఎన్‌సీఈఆర్టీ, ఎస్‌సీఈఆర్టీ సిలబస్‌తో కూడిన కొన్ని రికార్డు చేసిన వీడియో పాఠాల రూపంలో, మరికొన్ని ఆన్‌లైన్ విధానంలో ఉంటాయి. వీటితో పాటు అభ్యాస వ్యాయామ, పరీక్షలతో కూడినవి బోధిస్తున్నారు. పిల్లలకు అర్థం కాని పాఠ్యాంశాలను కళాశాలలోని సబ్జెక్టు బోధకులు నివృత్తి చేస్తున్నారు.

**విద్యార్థుల ఆసక్తి**

ఎంతో ఖర్చుతో కూడుకున్న శిక్షణ ఉచితంగా అందుతుంది. పాఠ్యాంశాలు వినడానికి తొలుత కాస్త ఇబ్బంది పడిన విద్యార్థులు ఇప్పుడు ఆసక్తిగా వింటున్నారని ఆయా విద్యాలయాల అధ్యాపకులు



చెబుతున్నారు. పేదింటి బిడ్డలు డాక్టర్లు, ఇంజినీర్లు అయ్యేందుకు అవసరమైన ప్రవేశపరీక్షలో రాణించేలా పేరున్న విద్యా సంస్థ ద్వారా పాఠ్యాంశాలను అందిస్తున్న ప్రభుత్వం వాటికి సంబంధించి మెటీరియల్ అందిస్తే బాగుంటుందని అభ్యాసకులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో ఆదర్శ, కేజీబీవీ, గురుకులాల్లో కళాశాలలోని సైన్స్ విద్యార్థులు: 2,520ఆన్‌లైన్ విధానంలో పాఠ్యాంశాలను బోధిస్తున్న ఇతను ఆత్మకూరు(ఎస్) ఆదర్శ పాఠశాలలోని పీజీటీ కెమిస్ట్రీ లెక్చరర్ శ్రీధర్. 120 మంది ఇంటర్ విద్యార్థులు జేఈఈ, నీట్, ఎప్‌సెట్‌లో రాణించేలా ఫిజిక్స్ వాలా అందిస్తున్న ఆన్‌లైన్, రికార్డు వీడియో పాఠ్యాంశాలను వివరిస్తున్నారు. అర్థం కాని పాఠ్యాంశాలను మూలాల్లోకి వెళ్లి నివృత్తి చేస్తున్నారు. ప్రవేశపరీక్షలో ఎలాంటి భయం లేకుండా బాగా రాసి మంచి మార్కులు సాధించేలా పాఠ్యాంశాల ద్వారా తర్ఫీదు ఇస్తున్నామంటున్నారు..

**తరగతులు బాగున్నాయి**

జేఈఈ, ఎప్‌సెట్ ప్రవేశపరీక్ష బాగా రాసేందుకు ఫిజిక్స్ వాలా తరగతులు బాగున్నాయి. ప్రతి పాఠ్యాంశం సులభంగా అర్థమవుతున్నాయి. వీటి వింటుండటంతో ప్రవేశపరీక్ష బాగా రాసి మంచి మార్కులు సాధిస్తాననే నమ్మకం పెరిగింది.

**నాగసాయి, ఎంపీసీ, ద్వితీయ, ఆత్మకూరు(ఎస్)**

**అర్థం కానివి నివృత్తి చేస్తున్నారు**

నీట్ ప్రవేశ పరీక్ష రాయాలనే కోరిక ఉంది. అందుకు ఏవిధంగా సన్నద్ధం కావాలని ఆలోచించా. ఇంతలో ప్రభుత్వం ఫిజిక్స్ వాలా ద్వారా తరగతులను చెప్పిస్తుంది. అవి అర్థవంతంగా ఉన్నాయి. కొన్ని అర్థం కాని పాఠ్యాంశాలను లెక్చరర్లు నివృత్తి చేస్తున్నారు. ఎస్‌కె. సంజన, బైపీసీ, ద్వితీయ

## మీ సేవ కేంద్రాలకు మోక్షమెప్పుడో!

భువనగిరి : జిల్లాలో 'మీ సేవ'లు విస్తృత పరిచేందుకు యంత్రాంగం చర్యలు తీసుకుంటోంది. ప్రజలు పలు రకాల సేవలను ఈ కేంద్రాల ద్వారా వినియోగించుకుంటున్నారు. జిల్లాలో ప్రస్తుతం 69 కేంద్రాలు ఉన్నాయి. పలు గ్రామాల్లో ఈ సేవలు అందుబాటులో లేవు. చాలా దూరం వెళ్లాల్సి వస్తోంది. మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి అభ్యర్థన మేరకు చౌటుప్పల్ మండలంలో నాలుగు, నారాయణపురం మండలంలో ఒక కేంద్రం ఏర్పాటుకు జులై నెలలో జిల్లా యంత్రాంగం నోటిఫికేషన్‌ను జారీ చేసింది.

**దరఖాస్తులు స్వీకరించి నెలరోజులైనా..**

దరఖాస్తులు స్వీకరించి నెల రోజులు కావొస్తున్నా.. ఇంత వరకు కేంద్రాల నిర్వాహకుల ఎంపికకు రాత పరీక్ష నిర్వహించలేదు. దరఖాస్తు చేసుకునేందుకు జులై 19వ తేదీన వరకు గడవు ఇచ్చారు. వాటిని పరిశీలించి అభ్యర్థులకు రాత పరీక్ష ద్వారా నిర్వాహకుల ఎంపిక ప్రక్రియ చేపట్టాల్సి ఉంది. కంప్యూటర్ పరిజ్ఞానం, డిగ్రీ ఆపై చదివి 21 నుంచి 44 సంవత్సరాల వయస్సు ఉన్న వారికి అవకాశం ఇవ్వనున్నారు. కేంద్రం నిర్వహణకు అవసరమైన కంప్యూటర్లు, ప్రింటర్లు ఏర్పాటు చేసుకునేందుకు ఆర్థిక స్థోమత ఉండాలి. నెల రోజులైనా పరీక్ష తేదీ ప్రకటించకపోవడంతో అభ్యర్థులు ఎదురు చూస్తున్నారు. ఆయా కేంద్రాలకు డిమాండ్ ఉన్న నేపథ్యంలో నిర్వాహకులను యుద్ధ ప్రాతిపదికన ఎంపిక చేయాలని ప్రజలు కోరుతున్నారు.

కుల, ఆదాయ, మరణ, జనన, ఈసీ తదితర ధ్రువీకరణ పత్రాలు పొందాలన్నా.. ప్రభుత్వ పథకాలకు దరఖాస్తు చేసుకోవాలన్నా మీ సేవ కేంద్రాలకు వెళ్లాల్సిందే. చాలా మండలాల్లో గ్రామాలకు దూరంగా ఉండటంతో ఇబ్బందులకు గురవుతున్నారు. మోటకొండూరు మండలంలో ఒకే కేంద్రం ఉంది. సుమారుగా 10 వేలకు పైగా జనాభా ఉన్న మేజర్ గ్రామ పంచాయతీలో అదనపు కేంద్రాలే లేవు. భూదాన్‌పోచంపల్లిలో ఒకటే ఉంది. మరో రెండు కేంద్రాలు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది.

మునుగోడు ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి చొరవ తీసుకుని అధికారులపై ఒత్తిడి తెచ్చి తన మండలాల పరిధిలో 5 కేంద్రాలను మంజూరు చేయించారు. ఆలేరు, భువనగిరి ఎమ్మెల్యేలు కూడా తమ నియోజకవర్గ పరిధిలో అవసరం ఉన్న చోట కొత్త కేంద్రాల ఏర్పాటు చేయించాల్సిన అవసరం ఉంది.

2017 తరువాత జిల్లాలో ఎక్కడా కొత్త కేంద్రం ఏర్పాటుకు అధికారులు చర్యలు తీసుకోలేదు. సర్వే చేయించి అదనపు కేంద్రాలను ఏర్పాటు చేయించాల్సిన అవసరం ఉంది. గతంలో నూతన కేంద్రాల ఏర్పాటుకు ప్రకటన జారీ చేసినా కోర్టు స్టే కారణంగా ఈ ప్రక్రియ ఆగిందని మీ సేవ జిల్లా మేనేజర్ సాయి తెలిపారు. త్వరలో రాత పరీక్ష నిర్వహించి చౌటుప్పల్, మునుగోడు కేంద్రాలు ఏర్పాటు చేస్తామని అదనపు కలెక్టర్ వీరారెడ్డి తెలిపారు.

# జన ఔషధి.. పేదల పెన్నిధి




పరిగి : మహిళలు ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ వివిధ పథకాలు అమలు చేస్తోంది. మరోవైపు గ్రామీణ ప్రజల ఆరోగ్య పరిరక్షణపైనా దృష్టి సారిస్తోంది. ఈ క్రమంలోనే చౌక ధరలకు మందులు అందించాలని దుకాణాలు నిర్వహించేలా సంకల్పించింది. ఆర్థిక సంవత్సరం ముగిసేలోపు జిల్లాలో కనీసం నియోజకవర్గానికి ఒకటి చొప్పున ప్రారంభిస్తామని అధికారులు నాలుగేళ్లుగా చెబుతున్నా బాలారిష్టాలు దాటడం లేదు. ఇప్పటి వరకు ఒక్కటీ ప్రారంభించలేదు. జిల్లాలోని తాండూరు, పరిగి, వికారాబాద్, కొడంగల్ నియోజకవర్గాల పరిధిలో 657 గ్రామ, 19 మండల సమాఖ్యలున్నాయి. వాటిలోని సభ్యులకు అప్పగించేందుకు జన ఔషధి కేంద్రాలు ఏర్పాటు చేయాల్సి ఉన్నా నీలినీడలు కమ్ముకున్నాయి.

**సౌభాగ్య పథకం కింద..**సౌభాగ్య పథకం కింద జన ఔషధి స్టోర్ పేరిట రూ.3 లక్షల వరకు రుణ సదుపాయం కల్పించి మహిళా సంఘాల ఆధ్వర్యంలో దుకాణాలు నిర్వహించాల్సి ఉంది. వ్యవసాయాధారిత ప్రాంతం కావడంతోపాటు నిరక్షరాస్యత అధికంగా ఉంది. దీంతో మహిళల్లో ఆరోగ్యంపై అవగాహన కొరవడింది. ఇలాంటి సమయాల్లో మందుల కొనుగోలు వారికి ఆర్థిక భారంగా మారింది. చౌకధరలకు మందులు దొరకితే ఎంతో ప్రయోజనం కలగనుంది.

**నిబంధనల సడలింపు..**

జన ఔషధి స్టోర్‌లను ప్రారంభించేందుకు ప్రభుత్వం వెసులుబాటు కల్పించింది. గతంలో బీఫార్మసీ, ఎంఫార్మసీ చదువుకున్న వారికే అవకాశముండేది. ప్రస్తుతం ఆ నిబంధనలు మార్చారు. సంఘం సభ్యురాలి కుటుంబీకులు లేదంటే స్నేహితులు, బంధువులకు సంబంధించిన వారూ దరఖాస్తుకు అర్హులే. ధ్రువపత్రాలు అయిదేళ్లపాటు లీజుకు తీసుకొని నడిపించేందుకు అవకాశం కల్పించారు. నియోజకవర్గ కేంద్రాల్లో ఏర్పాటు అనంతరం మండల కేంద్రాలపై దృష్టి సారించాలని నిరుపేదలు కోరుతున్నారు. గతేడాది తాండూరు, కుల్కచర్ల మండలం ముజాహిద్‌పూర్, దోమ నుంచి ప్రతిపాదనలు వెళ్లినా వివిధ కారణాలతో వాటిని తిరస్కరించారు.

**ముందుకొస్తే ప్రోత్సహిస్తాం..–రాజు, ఏపీఎం**

మండలంలో ఔత్సాహికులైన మహిళలు ముందుకొస్తే ఔషధ కేంద్రాన్ని ఏర్పాటు చేసేందుకు ప్రోత్సహిస్తాం. ఆర్థికంగా నిలదొక్కుకునే సంఘం సభ్యులకు అవగాహన కల్పిస్తున్నాం. జనరిక్ ఔషధాలు తక్కువ ధరలకే పేదలకు లభిస్తాయి.

# దోమల దండు.. జ్వరాలు మెండు



తాండూరు: పట్టణంలో డెంగీ కేసులు నమోదు కావడం ఆందోళనకు గురిచేస్తోంది. రాజీవ్ గృహకల్ప కాలనీలో ఓ బాలుడికి సోకింది. ఇందిరానగర్‌లోని రామమందిర్, గరీబ్‌నగర్‌లో ఒక్కో కేసు నమోదయ్యాయి. ఈ నేపథ్యంలో వైద్య సిబ్బంది ఆయా ప్రాంతాలకు వెళ్లి స్థానికులకు అవగాహన కల్పించారు. పుర సిబ్బంది పరిసరాలను శుభ్రం చేయించారు. దోమల నివారణకు రసాయన మందులు పిచికారీ చేశారు.

**ఇలా చేస్తే మేలు..**: పట్టణంలో నిల్వ నీటిని ఎప్పుడికప్పుడు బయటికి పంపాలి. అపరిశుభ్ర ప్రదేశాల్లో బ్లీచింగ్ పౌడర్ చల్లాలి. సాయంత్రం వేళ దోమలు కుట్టకుండా ఫాగింగ్ చేయాలి. కాలనీల్లో వరద నిల్వ ఉండకుండా చర్యలు చేపట్టాలి. వీధుల్లో పోగవుతున్న చెత్తను ఎప్పటికప్పుడు దిబ్బకు తరలించి కాలనీలను శుభ్రంగా ఉంచాలి.

**ఎగువ నుంచి దిగువకు పారి..**

దోమలు బాగా పెరగడంతోనే డెంగీ, మలేరియా వంటి జ్వరాలు వస్తున్నాయి. వర్షాలతో ఎగువ నుంచి వరద దిగువనున్న కాలనీల్లోకి చేరుతోంది. నీరు గుంతల్లో నిల్వ ఉంటోంది. ఇలాంటి మడుగుల్లోని నీటిపై దోమలు గుడ్లు పెట్టి సంతతిని వృద్ధి చేస్తున్నాయి. కురుస్తున్న వర్షాలకు ఎగువ నుంచి వస్తున్న వరద పట్టణంలోని మార్కండేయనగర్, మిత్రానగర్, గ్రీన్‌సిటీ, అయ్యప్పనగర్, ఆదర్శ, తులసీనగర్, సాయిపూరు శివారు కాలనీల్లోకి చేరుతోంది. ఇందిరానగర్, మాణిక్‌నగర్, గొల్ల చెరువు కాలనీల్లో చాలాచోట్ల నిల్వ ఉన్న మురుగుకు వరద తోడవుతోంది. ఇలాంటి ప్రదేశాల్లోనే దోమలు వృద్ధి చెంది స్థానికులను అనారోగ్యాల బారిన పడేస్తున్నాయి. మురుగు దిగువకు వెళ్లకుండా నిలిచిపోయే ప్రదేశాలు దోమల ఉత్పత్తికి కారణమవుతున్నాయి.

**పట్టణ వాసులు జాగ్రత్తలు పాటించాలి..**– డా.గిరిధర్, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, ఇందిరానగర్

డెంగీ, మలేరియాతోపాటు టైఫాయిడ్ జ్వరాలు సోకకుండా పట్టణ ప్రజలు చాలా జాగ్రత్తలు పాటించాలి. ఇళ్లలోని పూలకుండీల్లో నీరు నిల్వకుండా చూసుకోవాలి. వినియోగంలో లేని కూలర్లు, తాగి పడేసిన కొబ్బరి బోండాలు, రుబ్బురోళ్లు, ఇనుప సామగ్రి, టైర్లు, ప్లాస్టిక్ బకెట్లు, డ్రమ్ములు, సిమెంటు తొట్లు వంటి వాటిలో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలి. లేదంటే దోమలు ఆవాసం ఏర్పాటు చేసుకొని సంతతిని వృద్ధి చేసుకుంటాయి. తాగునీరు కలుషితం కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. **చర్యలు చేపడుతున్నాం..**

– విక్రమ్‌సింహారెడ్డి, పుర కమిషనర్, తాండూరు

పట్టణంలో దోమలు వ్యాప్తి చెందకుండా చర్యలు తీసుకుంటున్నాం. అపరిశుభ్ర ప్రదేశాల్లో బ్లీచింగ్ పౌడర్ చల్లుతున్నాం. కాలువల్లో నీరు నిల్వకుండా ఎప్పటికప్పుడు శుభ్రం చేయిస్తున్నాం. స్థానికులకు పరిసరాల శుభ్రతపై అవగాహన కల్పిస్తున్నాం. పట్టణంలో దోమల నివారణకు వర్షాలు తగ్గుముఖం పట్టగానే ఫాగింగ్ చేస్తాం.

# లబ్ధిదారుల్లో 'డబుల్' ఆశలు

వేములవాడ: ఇళ్లు లేని నిరుపేద కుటుంబాల సొంతింటి కల నెరవేర్చాలనే ఉద్దేశంతో గత సర్కారు మొదలుపెట్టిన రెండు పడక గదుల ఇళ్లకు సంబంధించి ఇటీవల లబ్ధిదారులకు ప్రస్తుత ప్రభుత్వం పట్టాలు అందించడంతో ఆశలు చిగురించాయి. వేములవాడ పట్టణంలో చాలామంది సొంతిళ్లు లేక అద్దెకుంటున్నారు. చిన్నా చితక వ్యాపారాలు చేసుకుంటూ కుటుంబాలను పోషించుకునేవారు అనేకమంది ఉన్నారు. వీరికి మొదటి విడతలో అప్పటి ప్రభుత్వం 800 ఇళ్లను మంజూరు చేసింది. వీటన్నింటికి ఒకే ప్రాంతంలో స్థలం లేకపోవడంతో వివిధ ప్రాంతాల్లో ప్రభుత్వ స్థలాలను అధికారులు పరిశీలించారు.

**రూ.40 కోట్లతో పనులు**

మొదటి విడతగా నాంపల్లి శివపార్వతుల కాలనీకి ఎదురుగా ప్రభుత్వ స్థలాన్ని గుర్తించి 144 రెండు పడక గదుల ఇళ్ల నిర్మాణానికి ఏడేళ్ల క్రితం రూ.40.32 కోట్లతో నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసి పనులు మొదలుపెట్టారు. జీ ప్లస్ టూ కింద ఒక్కో బ్లాక్‌లో 12 ఇళ్లు ఉండేలా నిర్మాణాలు చేపట్టారు. వాస్తవానికి ఇవి 2021 సెప్టెంబరులో పూర్తి కావాల్సి ఉన్నప్పటికి.. సకాలంలో బిల్లులు రాకపోవడంతో పనులు ఆగుతూ సాగుతూ, కొన్ని బ్లాక్‌లు స్లాబ్ వరకు నిర్మాణం చేశారు. ఆ తరువాత గుత్తేదారు వదిలేయడంతో మూడున్నరేళ్లుగా పనులు నిలిచిపోయాయి.

**పట్టాల పంపిణీతో ఆశలు**



రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లకే ప్రాధాన్యం ఇస్తుండటంతో ఈ రెండు పడక గదుల నిర్మాణాలను పట్టించుకున్నవారు లేరనే విమర్శలున్నాయి. పట్టణంలో ఇందిరమ్మ వార్డు కమిటీలను నియమించి ఇంటింటి సర్వేతో ఇళ్లు లేని నిరుపేదలను గుర్తించారు. వారికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేశారు. ఇదే క్రమంలో అసంపూర్తిగా ఉన్న రెండు పడక గదుల ఇళ్లకు సంబంధించి 144 మంది పేదలకు కూడా ఇటీవల ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ఇంటి పట్టాలను పంపిణీ చేయడంతో ఆశలు చిగురించాయి. ఇందుకు సంబంధించి రూ.7.63 కోట్లు మంజూరుకాగా ఇందులో రూ.2 కోట్ల మేర నిధులు ఖర్చయ్యాయి. మిగిలిన రూ.5.63 కోట్ల నిధులతో అసంపూర్తి పనులను పూర్తి చేసేందుకు అధికార యంత్రాంగం చర్యలు చేపట్టింది. కాగా ఈ పనులు నిలిచిపోవడంతో సదరు నిర్మాణాలు మందుబాబులకు అడ్డాగా మారాయి.

## ఆశయ సాధనలో.. ఐదు దశాబ్దాలు..!

చిట్యాల : మహాత్ముడి సిద్ధాంతాలు, ఆశయాలను గత 50 ఏళ్లుగా ప్రచారం చేస్తున్నాయి 'గాంధీ జ్ఞాన్‌ప్రతిష్ఠాన్', 'గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ' సంస్థలు. ఈ సంస్థల రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా నల్గొండ జిల్లాకు చెందిన యానాల ప్రభాకర్‌రెడ్డి పని చేస్తున్నారు. 2007 నుంచి ఆయన ఈ సంస్థల కార్యకలాపాల్లో పాలుపంచుకుంటున్నారు. 'గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ' అంతర్జాతీయంగా, 'గాంధీ జ్ఞాన్‌ప్రతిష్ఠాన్' దేశంలో కార్యక్రమాలు నిర్వహిస్తున్నాయి. ప్రధానంగా గాంధీ సూచించిన సూత్రాలైన 'సత్యం, అహింస, దొంగతనం చేయకుండా ఉండటం, బ్రహ్మచర్యం పాటించడం, స్వీయ క్రమశిక్షణ, మంచి నడవడిక, అనుమతి లేకుండా ఇతరుల వస్తువులను తాకడం, సర్వధర్మ సమానత్వం, స్వదేశీ వస్తువుల వాడకం, అంటరానితనం నిర్మూలన, శ్రమదానం, మధురవచనాలు పలకడం వంటి వాటిపై ప్రచారం నిర్వహిస్తున్నారు. వీటితో పాటు



విద్యార్థులలో స్వయం సమృద్ధి సాధనకు మెలకువలు, ప్రకృతి వైద్యం, సేంద్రియసాగు, పర్యావరణ పరిరక్షణ వంటి అంశాలపైనా విద్యాసంస్థల్లో, ఇతరత్రా సెమినార్లు, కార్యశాలలు నిర్వహిస్తున్నారు. ఇప్పటి వరకు ఉమ్మడి జిల్లాలో సుమారు 400 వరకు కార్యక్రమాలు నిర్వహించినట్లు ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. 2018లో నల్గొండ ఎన్‌జీ కళాశాలలో 5500 మంది విద్యార్థులతో నిర్వహించిన గాంధీ వేషధారణ ప్రదర్శన గిన్నిస్‌బుక్ రికార్డులకు ఎక్కింది. యాదాద్రి జిల్లా చౌటుప్పల్‌లో గాంధీ ప్రతిమలతో ఇటీవల ప్రదర్శన నిర్వహించారు. తమ సంస్థలు ఏర్పడి 50 ఏళ్లు పూర్తిచేసుకున్న సందర్భంగా స్వర్ణోత్సవ కార్యక్రమాల్లో భాగంగా గాంధీ జయంతిని పురస్కరించుకుని రానున్న అక్టోబరు 10 నుంచి 13 వరకు హైదరాబాద్ ఎల్బీ స్టేడియంలో గాంధీ లక్ష విగ్రహాల ప్రదర్శన నిర్వహించాలని నిర్ణయించామని, సీఎం ముఖ్య అతిథిగా రానున్నారని ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. తెలుగు రాష్ట్రాల్లోని జిల్లాల్లోనూ ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నామన్నారు.

## లెక్కల్లేవు.. దస్త్రాల్లేవు!

మెదక్: సొంతలాభం కొంత మానుకొని.. పొరుగు వారికి తోడుపడవోయి.. అన్నది కవి వాక్కే కాదు.. మన సమాజ ధర్మం కూడా. దాన్ని పరిశ్రమలు తప్పకుండా పాటించాలని తెచ్చిందే సీఎస్ఆర్(కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ) విధానం. ప్రభావిత ప్రాంతాల్లో ప్రగతి పనులు చేపట్టాలనే ఉద్దేశంతో అమలు చేస్తున్నారు. ఇందుకోసం పటిష్ఠ విధివిధానాలు రూపొందించి అమలు చేసే బాధ్యతను జిల్లా అధికారులకు అప్పగించారు. ఇంత వరకు బాగానే ఉన్నా.. పలు పరిశ్రమల నిర్వాహకులు పర్యవేక్షణ యంత్రాంగం నిర్లక్ష్యాన్ని ఆసరాగా తీసుకొని.. నిర్దేశిత నిధులు పూర్తిగా వ్యయం చేయకుండా కాగితాల్లోనే మమ అనిపిస్తున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

**నిబంధనల ప్రకారం**

ప్రభుత్వ నిబంధనల ప్రకారం నిర్దేశిత లాభం ఆర్జిస్తున్న కంపెనీలు తప్పనిసరిగా ఆదాయంలో రెండు శాతాన్ని సామాజిక బాధ్యత కింద ఖర్చు చేయాలి. ప్రతి కంపెనీలోనూ సీఎస్ఆర్ కమిటీని ఏర్పాటు చేయాలి. ఈ నిధులను వ్యయం చేయకుంటే జరిమానా విధించే అధికారం ప్రభుత్వానికి ఉంది.

**సంగారెడ్డిలో లొసుగులు ఇలా..**

రెండు రోజుల క్రితం సంగారెడ్డి జిల్లాలో సీఎస్ఆర్ నిధులపై కలెక్టర్ ప్రావీణ్య సమీక్ష నిర్వహించగా.. పలు లొసుగులు వెలుగులోకి వచ్చాయి. కొన్నేళ్లుగా కంపెనీలు ఎన్ని నిధులు వెచ్చించాయనే సమాచారం పర్యవేక్షణ అధికారుల వద్ద లేకపోవడం గమనార్హం. దీంతో పాటు పరిశ్రమల వద్ద సైతం ఈ నిధుల వ్యయంపై దస్త్రాలు లేవు. ఏయే



పనులు చేపట్టారనే దానిపై జిల్లా అధికారులతో పాటు పరిశ్రమల వద్ద సమాచారం కొరవడింది. సీఎస్ఆర్ నిధుల వినియోగం కాగితాల్లోనే జరుగుతున్నట్లు నిర్ధారణకు వచ్చిన కలెక్టర్ నూతనంగా సీఎస్ఆర్ కమిటీని నియమించి చేపడుతున్న పనులపై పర్యవేక్షణ చేపట్టాలని అధికారులను ఆదేశించారు.

**సిద్దిపేట, మెదక్ జిల్లాల్లో..**

సిద్దిపేట, మెదక్ జిల్లాల్లోనూ సీఎస్ఆర్ నిధుల జమ, వినియోగానికి సంబంధించిన అధికారుల వద్ద సమచారం కొరవడింది. పరిశ్రమలు ప్రకటించిన నిధులు పూర్తిస్థాయిలో వినియోగానికి నోచడం లేదనే ఆరోపణలున్నాయి. గత నాలుగేళ్లుగా ఆడిట్ లేకపోవడంతోనే సీఎస్ఆర్ నిధుల వ్యయానికి సంబంధించిన వివరాలు పరిశ్రమల వద్ద లేనట్లుగా తెలుస్తోంది. చేపట్టిన పనులను ఆన్‌లైన్‌లో నమోదు చేయాల్సి ఉండగా.. ఈ ప్రక్రియ సక్రమంగా సాగకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. సిద్దిపేట, మెదక్ జిల్లాల్లోనూ సీఎస్ఆర్ నిధుల వినియోగంపై పర్యవేక్షణ పెరగడంతో పాటు నూతన కమిటీల నియామకం చేపట్టాల్సిన ఆవశ్యకత ఉంది.

## ప్రభుత్వ బడుల్లో.. పూర్వ ప్రాథమిక విద్య

తూప్రాన్,: ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో పూర్వ ప్రాథమిక విద్యను ప్రారంభించేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేసింది. ఇందుకోసం జిల్లాలోని పలు ప్రభుత్వ పాఠశాలలను ఎంపిక చేసింది. వాటిల్లో శుక్రవారం నుంచే బోధన కొనసాగనుంది. జిల్లాలో 27 పాఠశాలలను ఎంపిక చేయగా అందులో బోధకులు, ఆయా పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానించారు. బోధకులకు ఇంటర్, ఆయా పోస్టుకు 7వ తరగతి విద్యార్హతగా నిర్ణయించారు. అన్ని పాఠశాలల నుంచి దరఖాస్తులు ఆహ్వానించగా బోధకులు 150 మందికి, ఆయా పోస్టుకు 130 మంది దరఖాస్తు చేసుకున్నారు. వీటిల్లో విద్యార్హత ఎక్కువగా ఉన్న వారికి అవకాశం కల్పించేలా పరిశీలిస్తున్నారు. చిన్న ఉద్యోగం.. పెద్ద చదువులు: ఈ పోస్టులకు దరఖాస్తులు సమర్పించిన వారిలో పీజీ, బీఈడీ పూర్తి చేసిన వారున్నారు. కొన్ని చోట్ల ఒక్కో పాఠశాలలో 10 వరకు దరఖాస్తులు వచ్చాయి. బోధకులకు రూ.8వేల వేతనం, ఆయాకు రూ.6వేల వేతనం ఇచ్చేలా ప్రభుత్వం ఉత్తర్వుల్లో పేర్కొంది. అయినా చాలా గ్రామాల్లో రెండు ఉద్యోగాలకు పోటీ ఏర్పడింది. ఈ నేపథ్యంలో కొందరు పైరవీలు సైతం చేసుకుంటున్నారు. అయినా నిబంధనల ప్రకారం భర్తీ చేసేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ఈ ప్రక్రియ పూర్తిచేసి, చిన్నారులకు బోధన అందించేలా కార్యాచరణ రూపొందించారు. ప్రైవేట్‌కు వెళ్లే చిన్నారులను వీటిల్లో చేర్చేందుకు ఉపాధ్యాయులు ప్రయత్నం చేస్తున్నారు. ఆదేశాలు ఇచ్చాం: రాధాకిషన్ డీఈఓ పూర్వప్రాథమిక విద్యా విధానాన్ని ప్రారంభించేందుకు అన్ని పాఠశాల ప్రధానోపాధ్యాయులకు ఆదేశాలు జారీ చేశాం. వారే బోధకులు, ఆయాలను నియమిస్తారు. వారు అందించిన జాబితానే ఖరారు చేస్తాం.

## ఖాళీగా షెడ్లు.. ఇరుకుగా రోడ్లు

కరీంనగర్: జిల్లాలోని నగర, పురపాలికల్లో వీధివ్యాపారుల కోసం సౌకర్యాలు కల్పించి 'ఆత్మనిర్భర్' నింపాలనే లక్ష్యంగా ముందుకెళ్తున్నా.. ఆచరణలో సాధ్యం కావడం లేదు. రహదారులపై చిరు వ్యాపారం సాగించకుండా షెడ్లు నిర్మిస్తున్నా వ్యాపారులు ఆసక్తి చూపడంలేదు. రోడ్లే అడ్డాలుగా మలుచుకోవడం, ఉన్న చోటనే వాటిని నిర్మించాలని కోరుతుండటంతో ప్రాంతాల్లో స్థలం దొరకడంలేదు.

**నెరవేరని ప్రభుత్వాల లక్ష్యం**

వీధివ్యాపారులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వం ఆత్మనిర్భర్ కింద రుణాలు ఇస్తుండగా వ్యాపారాలు చేసుకుంటున్నారు. పక్కా అడ్డాలు లేకపోవడంతో రోడ్ల మీద దుకాణాలకు ఎదురుగా కూర్చొని అమ్ముతుండగా ప్రైవేటు దుకాణాల యజమానులు అద్దె వసూలు చేస్తున్నారు. పురపాలికలు చూపించే షెడ్లలోకి వెళ్తే ఎలాంటి ఇబ్బందులు ఉండవు. కానీ వారు వెళ్లడంలేదు. పథకం లక్ష్యం నెరవేరడంలేదు.

**అయిదు చోట్ల ఖాళీ**

పండ్ల మార్కెట్‌కు బస్టాండ్ వెనక రూ.17 లక్షలతో వెండర్ జోన్



ఏర్పాటు చేస్తే అక్కడికి వెళ్లకపోవడంతో ఇతరులకు కేటాయించారు. రూ.30 లక్షలతో ఇందిరానగర్‌లో నిర్మించగా ఒకరిద్దరు మినహాయించి వ్యాపారులు ఎవరూ ఉండటం లేదు.

రూ.23 లక్షలతో చైతన్యపురిలో నిర్మించగా ఒక్కరూ ఉండటం లేదు. బ్యాంకుకాలనీ రహదారిపై దుమ్ము, ధూళిలో కూరగాయలు, పండ్లు అమ్ముతున్నారు.రూ.25 లక్షలతో హౌసింగ్‌బోర్డుకాలనీలో మార్కెట్ నిర్మించగా అది నిరుపయోగంగా ఉంది. వెంకటసాయి థియేటర్ ఎదురుగా, పాతబజారులో కూర్చొనే వీధివ్యాపారులకు దీనిని నిర్మించారు.శ్రీచౌక్, సప్తగిరికాలనీలో రూ.40 లక్షలతో నిర్మించగా ఉదయం ఒకరిద్దరు ఉంటున్నారు. టెలిఫోన్ క్వార్టర్స్ రోడ్డులో రాకపోకలకు ఇబ్బందులు కలిగించేలా వీధి వ్యాపారం చేస్తున్నారు.

**ఇలా చేస్తే ప్రయోజనం**

ఏ ప్రాంతం వారిని ఆ ప్రాంతంలోనే ఖాళీగా ఉన్న మార్కెట్లు, షెడ్లలోకి పంపించాలి.రహదారులకు ఇరువైపులా చిరు వ్యాపారులు అడ్డాలు పెట్టకుండా కట్టడి చేయాలి.నాలుగు చక్రాలు, తోపుడుబండ్లను కూడా అదే ప్రాంతానికి తరలించాలి.దీ రహదారులపై కూరగాయలు, పండ్లు, ఇతర వస్తువులు దొరకకపోతే ప్రజలు కూడా షెడ్ల వద్దకు వస్తారు.

# దెబ్బతిన్న వంతెన.. నరకయాతన

ముస్తాబాద్: రాజన్న సిరిసిల్ల-సిద్ధిపేట జిల్లాల సరిహద్దు గ్రామాలైన మోహినికుంట-రాజక్కపేట మధ్యనున్న వంతెన అంచు కోతకు గురైంది. దీంతో వాహనదారులు ఆందోళన చెందుతున్నారు. ఈ మార్గం మీదుగానే రెండు జిల్లాల వాహనదారులు సిద్ధిపేట జిల్లా కేంద్రానికి రాకపోకలు సాగిస్తుంటారు. గత ప్రభుత్వ హయాంలో పనులు ప్రారంభించగా.. బిల్లులు సకాలంలో రాకపోవడంతో మధ్యలోనే నిలిచిపోయాయి. పనులు ముందుకు సాగేలా చొరవ చూపాలని ఇరు జిల్లాల ప్రజలు కోరుతున్నారు.

**రూ.1.80 కోట్ల నిధులు మంజూరు**

రాజక్కపేట కొత్తచెరువు నుంచి వంతెన కిందుగా వాగు ద్వారా నీరు మోహినికుంట, మద్దికుంట చెరువు నిండుకొని.. ముస్తాబాద్ చెరువుల్లోకి చేరుతాయి. అయితే ఇరుగ్రామాల మధ్యనున్న వంతెన శిథిలావస్థకు చేరడంతో ఎంఆర్ఆర్ (మెయింటెనెన్స్ రూరల్ రోడ్డు) ద్వారా దాదాపు రూ.1.80 కోట్లు వరకు మంజూరైనట్లు సమాచారం. సంబంధిత అధికారులు మాత్రం పనుల వివరాలను వెల్లడించడంలేదు. వంతెన మరమ్మతుల కోసం నిధులు విడుదలయ్యాయా లేదా నూతన వారధి నిర్మాణానికి మంజూరయ్యాయా అనేది ప్రశ్నార్థకంగా మారింది.

**కోతకు గురైన వారధి రోడ్డు**

నిత్యం లింగన్నపేట నుంచి చిన్నచీకోడ్, మద్దికుంట, మోహినికుంట గ్రామాలతోపాటు సిద్ధిపేట జిల్లా రాజక్కపేట పరిసర గ్రామాల ప్రజలు



ఈ మార్గం మీదుగా రాకపోకలు సాగిస్తుంటారు. ఇటీవల కురిసిన వర్షాలకు వంతెన వద్ద రోడ్డు కోతకు గురవడంతో వాహనదారులు ఆందోళన చెందుతున్నారు. అలాగే తాత్కాలిక రోడ్డు కోసం వేసిన పైపులు అక్కడే నిరుపయోగంగా ఉన్నాయి. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని భయాందోళనకు గురవుతున్నారు. సంబంధిత అధికారులు చొరవ తీసుకొని పనులు ప్రారంభించేలా చర్యలు చేపట్టాలని ఇరు జిల్లాల వాహనదారులు కోరుతున్నారు.

**పనులు జరిగేలా చూడాలి**

మెర్గు లింగం, మోహినికుంట

రెండు జిల్లాలకు చెందిన వందలాది వాహనదారులు ఈ రోడ్డు మీదుగా తక్కువ దూరంతో వెంకట్రావుపల్లె మీదుగా సిద్దిపేట జిల్లా కేంద్రానికి రాకపోకలు సాగిస్తుంటారు. వంతెన ఇప్పటికే శిథిలావస్థకు చేరుకుంది. వెంటనే పనులు జరిగేలా చూడాలి.

**గుత్తేదారుకు సూచిస్తాం**

గత ప్రభుత్వ హయాంలో ఎంఆర్ఆర్ కింద నిధులు మంజూరయ్యాయి. సదరు కాంట్రాక్టర్ పనులు చేయడానికి ముందుకు రావడంలేదు. పనులు చేయాలని సదరు కాంట్రాక్టర్‌కు సూచిస్తాం.

సుదర్శన్‌రెడ్డి, పంచాయతీరాజ్ డీఈ

# మూసీ ముంచెత్తె.. పరీవాహకం హడలెత్తె



హైదరాబాద్ : హిమాయత్‌సాగర్ గేట్లు ఎత్తడంతో మూసీ నది ఉగ్రరూపం దాల్చుతోంది. గురువారం ఉదయం నుంచి సాయంత్రానికి నదిలో రెండు నుంచి మూడు అడుగుల మేర ప్రవాహం పెరిగింది. నది పొడవునా ఉన్న కిస్మత్‌పుర, మూసారాంబాగ్ తదితర కాజ్‌వేలు నీట మునిగాయి. ఉద్ధృతి పెరుగుతుండటంతో కాజ్‌వేలను మూసేశారు. చాదర్‌ఘాట్, మూసారాంబాగ్ మధ్య మూసీకి పక్కనున్న బస్తీలనూ వరద ముంచెత్తింది. చాదర్‌ఘాట్ వంతెన పక్కనున్న దేవాలయంలోకి నీరు చేరింది. వాహెద్‌నగర్ బ్రిడ్జి మునిగింది. పక్కనున్న రసూల్‌పుర, శంకర్‌నగర్, మూసానగర్ తదితర బస్తీల్లో రోడ్లపై అడుగు ఎత్తున వరద నిలిచింది. ముందస్తు చర్యల్లో భాగంగా స్థానికులందరినీ ఇళ్లు ఖాళీ చేయాల్సిందిగా జీహెచ్‌ఎంసీ కోరింది. సమీప కాలనీల్లో పునరావాస కేంద్రాలను సిద్ధం చేశారు. 307 మందిని తరలించారు. ఇతరత్రా ప్రాంతాల్లోనూ ముంపు సమస్య మొదలవుతుండటంతో నదికి ఇరువైపులా ఉన్న చార్మినార్, ఖైరతాబాద్, ఎల్బీనగర్ జోన్ల అధికారులను క్షేత్రస్థాయిలో పర్యటించాలని జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆర్వీ.కర్ణన్ ఆదేశించారు. చార్మినార్ జోనల్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డితో కలిసి కమిషనర్ కర్ణన్ జల్‌పల్లి చెరువు, హైదర్‌ఎన్‌క్లేవ్, మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ లక్ష్మీగూడలో పర్యటించారు.

**బైపాస్ రోడ్డుపై మూసివేత**

జియాగూడ, పురానాపూల్ వద్ద మూసీ ఉద్ధృతంగా పారింది. జియాగూడ కేశవస్వామినగర్, కట్టమైసమ్మ దేవాలయం సమీపంలో ఒడ్డున గుడిసెవాసులను సురక్షిత ప్రాంతాలకు తరలించారు. జియాగూడ బైపాస్ రోడ్డును బారికేడ్లతో రెండువైపులా మూసివేశారు. జియాగూడ మెయిన్‌రోడ్డు మీదుగా ట్రాఫిక్‌ను మళ్లించారు. బైపాస్ రోడ్డు మధ్యలో ఉన్న హనుమంతుడి ఆలయం, అమ్మవారి ఆలయాలు, ఒడ్డున ఉన్న గుడి నీట మునిగింది.

పురానాపూల్ వంతెనకు అవతలి వైపున ఉన్న చారిత్రాక శివాలయ ఘాట్‌లోకి, పురానాపూల్ దహన వాటికలోకి వరద చేరింది.

**సమన్వయంతో పని చేయాలి**

"నీరు నిలిచిన కాలనీల్లో అధికారులు పర్యటించాలి. వానలు తగ్గే వరకు క్షేత్రస్థాయిలోనే ఉండాలి. మూసీ నది వంతెనల వద్ద పోగయ్యే చెత్తను, వరద నాలాల్లో పడుతోన్న వ్యర్థాలను వెలికితీస్తూ ప్రవాహానికి అడ్డంకులను తొలగించండి. ప్రమాదకరంగా ఉండే నాలాల వద్ద జాలీలు, బారికేడ్లను ఏర్పాటు చేయండి."అని కమిషనర్ ఆర్వీ.కర్ణన్ స్పష్టం చేశారు.

**సర్వీసు బంద్**

హిమాయత్‌సాగర్‌కు వరద ఉద్ధృతి పెరగడంతో గేట్లు ఎత్తి దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. రాజేంద్రనగర్‌కు వెళ్లే సర్వీసు రోడ్డుపై భారీగా నీరు ప్రవహించింది. వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

# వరద పోటెత్తింది.. ఆక్రమణల నిగ్గు తేలింది



హైదరాబాద్ : నగరంలో జంటజలాశయాలను వరదనీరు ముంచెత్తడంతో శిఖం భూముల ఆక్రమణలు వెలుగు చూస్తున్నాయి. కబ్జా చేసి వేసిన వెంచర్లు, అనుమతులు లేకుండా నిర్మించిన వ్యవసాయ క్షేత్రాలు నీట మునిగాయి. ముంపు ప్రాంతం కాదని ఎన్వోసీలు జారీ చేసిన జలవనరులశాఖ అవినీతి బయటపడుతోంది. హిమాయత్‌సాగర్ పరిధిలో వ్యవసాయ క్షేత్రాలు, భవనాలు నీట మునగడంతో.. గేట్లు ఎత్తి దిగువకు దాదాపు 12వేల క్యూసెక్కుల విడుదల చేస్తున్నారు. హడావుడిగా ముంపు ప్రాంతాన్ని తగ్గించాలనే ప్రయత్నాలు చేస్తున్నట్లు విమర్శలు వస్తున్నాయి.

**ఇదీ పరిస్థితి..:** నగరానికి మంచినీటిని సరఫరా చేసే జంట జలాశయాలు ఓఆర్ఆర్‌కు వెలుపల ఉన్నాయి. వీటి పరిధిలో నిర్మాణాలపై నిషేధం ఉంది. గత ప్రభుత్వం జీవో 111ను తీసుకువచ్చి ంది. ఎఫ్‌టీఎల్ పరిధిలో అసలు నిర్మాణాలే చేయకూడదు. దీనికి 50 మీటర్ల దూరం వరకు బఫర్ జోన్ ఉంటుంది. ఆ ప్రాంతంలో ప్రైవేటు పట్టా భూములున్నా.. సాగు చేయవచ్చుకానీ నిర్మాణాలు నిషేధం. హిమాయత్‌సాగర్ పరిధిలో పలు ప్రాంతాల్లో రియల్ వెంచర్లు వెలిశాయి. సమీపంలోని కోకాపేటలో భారీ డిమాండ్ ఉండటంతో చిలుకూరు, మొయినాబాద్, బండ్లగూడ జాగీర్, అప్పోజిగూడ, చందానగర్ మోత్కుపల్లి, చిన్నమంగళారం, ఖానాపూర్, శంకర్‌పల్లి మండలం పరిధిలో గోపులాపురం జన్వాడ, మొయినాబాద్ మండలం పరిధిలో అజీజ్‌నగర్, నాగిరెడ్డిగూడ, బాకారంజాగీర్, శంషాబాద్ మండలం కేబీదొడ్డి, సుల్తాన్‌పల్లి, నర్కుడ, కొత్వాల్‌గూడ పరిధిలో పలు భూములు, వెంచర్లు ముంపునకు గురయ్యాయి. హిమాయత్‌సాగర్ నిండడంతో ఎఫ్టీఎల్ వరకు వరద చేరింది. ఆక్రమణల్లో నీరు నిలిచింది. దీన్ని తప్పించేందుకు గేట్లు ఎత్తి నీరు విడుదల చేస్తున్నారు.

**రిసార్టులు.. ఫాంహౌస్‌లు..:** నాడు మునిగిన ప్రాంతాల్లో ఏపీకి చెందిన ప్రముఖ నేత రియల్ వెంచర్ ఉంది. కొంతమంది ఉన్నతాధికారుల రిసార్టులు ఉన్నాయి. ఓ ప్రముఖ నిర్మాణ సంస్థ చేపట్టిన బహుళఅంతస్తుల భవనం ఉంది. ప్రముఖులకు చెందిన వ్యవసాయ క్షేత్రాలు, క్రికెట్ మైదానాలు ఉన్నాయి. వారి వెంచర్లకు వేసిన రహదారులు మునిగాయి.కమీషన్లతో ఎన్వోసీలు: జలాశయాల పరిధిలో ఎఫ్టీఎల్ను గుర్తించడంలో అక్రమాలు చోటుచేసుకున్నాయి. జలవనరుల శాఖ నుంచి ఎన్వోసీలు తీసుకుని ఎఫ్‌టీఎల్ పరిధిలో లేదంటూ నిర్మాణాలు చేపట్టారు. విస్తీర్ణాన్ని బట్టి కమీషన్లు రూ.లక్షల్లో గుంజినట్లు చెబుతున్నారు. ఎఫ్‌టీఎల్ పరిధిలో వరద సాక్ష్యంగా సరిహద్దులు గుర్తించాలని గ్రామస్థులు డిమాండ్ చేస్తున్నారు.

**ఉస్మాన్‌సాగర్‌కు భారీ వరద**

వారం రోజులుగా కురుస్తున్న వర్షాలతో ఎగువ ప్రాంతాలైన వికారాబాద్, శంకర్‌పల్లి ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున వరద వస్తుండటంతో ఉస్మాన్‌సాగర్(గండిపేట) జలాశయంలోకి వరద భారీగా చేరుతోంది. జలాశయం పూర్తి స్థాయి నీటిమట్టం 1790 అడుగులు కాగా 1785.70అడుగులకు చేరిందని జలమండలి అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. ప్రస్తుతం చెరువులోకి 2500 క్యూసెక్కుల వరద చెరువులోకి వస్తోందని వారు వివరించారు.

# సాంకేతికత ఘనం.. స్పందన శూన్యం

హైదరాబాద్ : ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకోవడంలో ఒక అడుగు ముందున్న కాలుష్య నియంత్రణ మండలి, పౌరుల ఫిర్యాదుల పరిష్కారంలో నాలుగడుగులు వెనక్కి వేస్తోంది. కాలుష్య కట్టడికి 'జనవాణి కాలుష్య నివారిణి', 'సమీర్' యాప్‌లలో 'కంప్లైంట్స్' విభాగాలను ప్రవేశపెట్టిన విషయం తెలిసిందే. నిత్యం పదుల సంఖ్యలో ఫిర్యాదులు అందుతున్నా.. ఒకటి, అర మినహా పరిష్కరించిన దాఖలాలు లేవు.

**వరుస ఫిర్యాదులు..**

పరిశ్రమల నుంచి వెలువడే ఘాటు వాసనలు ఉక్కిరి బిక్కిరి చేస్తున్నాయంటూ బాచుపల్లి హరితవనం కాలనీ వాసులు కొన్నేళ్లుగా వరుసగా ఫిర్యాదులు చేస్తున్నారు. సుమారు 16 కంపెనీల జాబితాను పీసీబీ ముందు ఉంచి ఎన్నిసార్లు ఫిర్యాదులు చేసినా తనిఖీలు చేయడం లేదని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. ఈ నేపథ్యంలోనే కాలనీలోని ప్రతి ఇంటి నుంచి వరుసగా ఫిర్యాదులు చేయాలని నిర్ణయించారు. అయినా సమస్య పరిష్కారం కాకపోతే సంయుక్తంగా నిరాహార దీక్ష చేపట్టాలని నిర్ణయించారు.నల్లగండ్లలోనూ ఇదే పరిస్థితి. పరిశ్రమల నుంచి ఘాటు వాసనలు, వ్యర్థాలతో ఇబ్బందులు పడుతున్నామని ఫిర్యాదు చేయగా, అధికారుల నుంచి స్పందన లేదని అనురాగ్ అనే స్థానికుడు వాపోయారు.బొల్లారం, పాశమైలారం పారిశ్రామిక వాడలకు ఆనుకొని ఉన్న ప్రాంతాల్లో ఈ సమస్య నెలకొంది.నాచారం, జీడిమెట్ల, కాటేదాన్, ఉప్పల్, బాలానగర్, చింతల్ ప్రాంతాల నుంచి ప్రతి నెలా వందల సంఖ్యలో ఫిర్యాదులు అందుతున్నాయి.

**చిత్ర సహితంగా..**

JANAVANI - KALUSHYA NIVARINI
Telangana Pollution Control Board

సమస్యల పరిష్కారానికి కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి (సీపీసీబీ) సమీర్ యాప్‌లో ఫిర్యాదుల విభాగాన్ని ప్రవేశపెట్టింది. సమస్య నమోదు చేసి 'కరెంట్ లొకేషన్' ట్యాగ్ చేసి, చిరునామా, వ్యక్తిగత వివరాలు నమోదు చేస్తే సరిపోతుంది. ట్రాకింగ్ ద్వారా అప్‌డేట్ తెలుసుకోవచ్చు. ఏ ప్రాంతం నుంచి ఎన్ని ఫిర్యాదులు వచ్చాయనే వివరాలను ఇతరులు సైతం పరిశీలించొచ్చు.

రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి ఫిర్యాదుల కోసం 'జనవాణి- కాలుష్య నివారిణి' యాప్‌ను ప్రవేశపెట్టింది. అధికారిక వెబ్‌సైట్‌లోనూ ఈ విభాగం నుంచి ఫిర్యాదు చేసే వెసులుబాటు కల్పించింది. ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా అధికారులు స్పందించడం లేదని బాధితులు వాపోతున్నారు.

# నోరు తెరిచిన బావి.. ప్రమాదకరంగా మారి

పెద్దపల్లి : గ్రామీణ ప్రాంతాల్లో రహదారుల అభివృద్ధి, విస్తరణ పనులు నిర్వహిస్తున్న అధికారులు రోడ్డు పక్కన ఉండే బావులు, చెరువులు, కాలువలపై నిర్లక్ష్యం చేయడంతో వాహనదారులు తరచూ ప్రమాదాలబారిన పడుతున్నారు. పెద్దపల్లి, సుల్తానాబాద్ పట్టణాల్లో ఎస్సారెస్పీ కాలువలు ప్రమాదకరంగా ఉన్నాయి. సుల్తానాబాద్ శివారులోని డి-83 కాలువలో పలు వాహనాలు పడిపోయిన ఘటనలున్నాయి. పెద్దపల్లిలోని కొంతంవాడ మీదుగా వెళ్లే ఎస్సారెస్పీ కాలువలోకి గతంలో కారు దూసుకెళ్లగా ఎవరికీ ఏం కాలేదు.

**ఇక్కడ బాగు..**

ధర్మారం, ఓదెల మండలంలోని పలు గ్రామాల్లో రోడ్డుపక్కనే బావులుండగా రక్షణ కంచెలు నిర్మించారు. పెద్దపల్లి పట్టణ శివారులోని బంధం చెరువు నుంచి వచ్చే వరద ప్రవాహం వెళ్లే ఒర్రెను ఆనుకొని రాజీవ్ రహదారి వెళ్తుండటంతో అధికారులు ముందు జాగ్రత్త చర్యలుగా దారి వెంట బలమైన రేయిలింగ్ నిర్మించారు.

**రోడ్డు పక్కనే..**

పెద్దపల్లి పురపాలిక పరిధి బంధంపల్లి స్టేజీ వద్ద, బంధంపల్లి నుంచి గొల్లపల్లి వెళ్లే దారిలో మరో వ్యవసాయ బావి రోడ్డు పక్కనే ప్రమాదకరంగా ఉన్నాయి. పెద్దపల్లి నుంచి జూలపల్లి దారిలో వెంకట్రావుపల్లి,



వడ్కాపూర్ సమీపంలో పలు వ్యవసాయ బావులు రోడ్డుపక్కనే ఉన్నాయి. కుమ్మరికుంట నుంచి జూలపల్లి వచ్చే ఆర్అండ్‌బీ రోడ్డు కొంత దూరం కాలువ వెంటే వెళ్తుంది. కుమ్మరికుంట నుంచి కొత్తూరు మీదుగా కటికనపల్లి దారిలో రోడ్డు పక్కన వ్యవసాయ బావులు ప్రమాదకరంగా ఉన్నాయి.

పెద్దపల్లి నుంచి కూనారం వెళ్లే దారిలో మారేడుగొండ, కాల్వశ్రీరాంపూర్ నుంచి గుంపులకు వెళ్లేదారిలో పలు బావులతోపాటు చెరువులు, కుంటలు రోడ్డు వెంటే ప్రమాదకరంగా ఉన్నాయి.

పెద్దపల్లి నుంచి ముప్పిరితోట మీదుగా దూళికట్ట వెళ్లే రోడ్డులోనూ వ్యవసాయ బావులు ప్రమాదకరంగా ఉన్నాయి.

ముత్తారం మండలం మచ్చుపేట శివారు నుంచి దారి పొడవునా పది వరకు వ్యవసాయ బావులున్నాయి.

పాలకుర్తి మండల కేంద్రం నుంచి ఈసాల తక్కలపల్లి వెళ్లే దారిలో వ్యవసాయ బావి, బోడగుట్టపల్లి వద్ద ఎస్సారెస్పీ కాలువ వంతెన, జిల్లా కేంద్రం నుంచి తుర్కల మద్దికుంట వెళ్లేదారిలో గాంధీనగర్ దాటిన తర్వాత బావి ప్రమాదకరంగా ఉంది.

# పట్టణ హరితం.. అంతంతమాత్రం

కోరుట్ల: పచ్చదనం పెంపునకు ప్రభుత్వం ఏటా 'వన మహోత్సవం' కార్యక్రమం నిర్వహిస్తోంది. పట్టణాల్లో పురపాలక సంఘాల ఆధ్వర్యంలో పట్టణ ప్రగతి నర్సరీలు ఏర్పాటు చేసి సుమారు 30 రకాల మొక్కలు పెంచుతున్నారు. నిర్దేశించిన లక్ష్యం మేరకు నాటుతున్నామని లెక్కల్లో చెబుతున్నా క్షేత్ర స్థాయిలో పరిస్థితి అంతంతమాత్రంగానే ఉంటోంది. పట్టణ రహదారుల్లో, కాలనీల రోడ్లపై, ప్రజల నివాసాల్లో పచ్చదనం కనిపించడం లేదు. ఈ ఏడాదైనా మున్సిపల్ అధికారులు పట్టణాల్లో విస్తృతంగా మొక్కలు నాటించి లక్ష్యాన్ని పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాల్సి ఉంది. జిల్లాలోని జగిత్యాల, కోరుట్ల, మెట్‌పల్లి, ధర్మపురి, రాయికల్ పట్టణాల పరిధిలో మొత్తం 7.73 లక్షల మొక్కలు నాటాలని లక్ష్యంగా పెట్టుకోగా ఇప్పటివరకు సుమారు 2.60 లక్షల మొక్కలు మాత్రమే నాటారు. మరో 5 లక్షలకు పైగా మొక్కలు నాటాల్సి ఉంది.

**పట్టణ ప్రగతి నిధులతో శాశ్వత నర్సరీలు**

జిల్లాలోని అయిదు పట్టణాల్లో అయిదేళ్ల క్రితం పట్టణ ప్రగతి నిధులతో శాశ్వత నర్సరీలు ఏర్పాటు చేసి ఏడాదంతా మొక్కల పెంపకం చేపడుతున్నారు.అనువైన నాణ్యమైన మట్టిని తీసుకొచ్చి కవర్లలో నింపడం, ప్రత్యేకంగా తెప్పించిన విత్తనాలను సిబ్బందితో నాటించడం, క్రమం తప్పకుండా నీటిని పట్టిస్తూ మొక్కలు పెంచుతున్నారు.

పట్టణ ప్రగతి నర్సరీల్లో నీడనిచ్చే వాటితో పాటు, పండ్లు, పూల రకాలకు



చెందిన సుమారు 30 రకాల మొక్కల పెంపకం చేపట్టారు.

నీడనిచ్చే మొక్కలను ప్రత్యేక జాగ్రత్తల మధ్య 4, 5 అడుగుల ఎత్తు వరకు పెంచుతున్నారు.రహదారులకు ఇరువైపులా, ప్రభుత్వ స్థలాల్లో, కార్యాలయాల్లో మున్సిపల్ కార్మికులతో నీడనిచ్చే మొక్కలను నాటిస్తున్నారు. మొక్కల పెంపకంలో ప్రజల భాగస్వామ్యం ఉండేలా ఇళ్ల ఆవరణలో పండ్ల, పూల మొక్కలు తప్పనిసరిగా నాటించేలా చర్యలు తీసుకుంటున్నారు.ఇంటికి రెండు, మూడు మొక్కలను పంపిణీ చేయాలని నిర్ణయించిన అధికారులు త్వరలో అందజేసేందుకు నిర్ణయించారు.

**ఇంటింటికీ పూలు, పండ్ల మొక్కలు**

పట్టణంలో నిర్దేశించిన మేరకు మొక్కలు నాటించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం. కార్మికులతో రోడ్లకు ఇరువైపులా, ఖాళీ స్థలాల్లో నాటిస్తున్నాం. ముఖ్యంగా ఇంటింటికీ పండ్లు, పూల మొక్కలు పంపిణీ చేయించి మహిళలతో నాటించాలని నిర్ణయించాం. బొప్పాయి, జామ, నిమ్మ, బత్తాయి వంటి పండ్ల మొక్కలను అందజేసేలా చర్యలు తీసుకుంటున్నాం. బి.రవీందర్, కోరుట్ల మున్సిపల్ కమిషనర్

# అరుదైన అవకాశం.. ఆదాయం ఘనం

కొత్తగూడెం : అరుదైన లోహాల అన్వేషణ దిశగా సింగరేణి యాజమాన్యం వేగంగా అడుగులు వేస్తోంది. సింగరేణి పరిధిలో అరుదైన భూలోహకాలు (రేర్ ఎర్త్ ఎలిమెంట్స్) ఉన్నట్లు నిర్ధారించుకుని.. వాటిని వెలికితీసేందుకు ప్రయత్నిస్తోంది.

**రెండు సంస్థలతో ఒప్పందాలు**

కీలక ఖనిజాల అన్వేషణ, పరిశోధన, అధునాతన సాంకేతిక వాడకం, ఉత్పత్తితో పాటు పర్యావరణహిత పద్ధతుల వినియోగంలో పరస్పర లాభదాయక ఒప్పంద పత్రాలపై ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మినరల్స్ అండ్ మెటీరియల్స్ టెక్నాలజీ (ఐఎంఎంటీ), సింగరేణి సంస్థ అధికారులు జూన్ రెండో వారంలో సంతకాలు చేశారు. కీలక ఖనిజాలు, అరుదైన భూలోహకాలపై పరిశోధన, ఉత్పత్తి నిమిత్తం కేంద్ర బొగ్గు గనుల శాఖకు చెందిన నాన్ ఫెర్రస్ మెటీరియల్స్ టెక్నాలజీ డెవలప్‌మెంట్ సెంటర్‌తో సింగరేణి సంస్థ ఈనెల 4న ఒప్పందం కుదుర్చుకుంది.

**ఉభయ జిల్లాల్లోని కొన్ని గుట్టల్లోనూ..**

అరుదుగా లభించే పదార్థాలు (రేర్ ఎర్త్ ఎలిమెంట్స్) సింగరేణిలోని కొన్ని ఉపరితల గనుల్లో ఉన్నట్లు సింగరేణి సంస్థ ప్రాథమికంగా నిర్ధారించుకుంది. విద్యుదుత్పత్తి సందర్భంగా విడుదలయ్యే బూడిదలోనూ భూ లోహకాలు ఉన్నాయని కనుగొంది. మణుగూరుకు సమీపంలోని దుర్గంగుట్ట బ్లాకులో సగటున 266.21పీపీఎం స్థాయిలో ఇవి లభ్యమైనట్లు చెబుతోంది. ఖమ్మం, భద్రాద్రి జిల్లాల్లోని కొన్ని గుట్టల్లోనూ రేర్ ఎర్త్ ఎలిమెంట్స్ ఉన్నట్లు తేలిందని పేర్కొంటోంది. లాంథనం, సీరియం, ప్రసియోడీమియం వంటి ఆరు రకాల తేలికైన లోహకాలు, ఇట్రియం, స్కాండియం, డిస్ప్రోజియం వంటి ఎనిమిది రకాల భార లోహకాలు సింగరేణి ప్రాంతంలో ఉన్నట్లు కనుగొంది. ఎంతో విలువైన భూ లోహకాలను ఉత్పత్తి చేసేందుకు అయ్యే ఖర్చు, వాటిని విక్రయిస్తే వచ్చే లాభం మొదలైన అంశాలను విశ్లేషించాల్సి ఉంది. అరుదైన లోహాల ధరలు అధికంగా ఉంటున్నందున ఉత్పత్తి ఖర్చు కన్నా విక్రయించగా వచ్చే ఆదాయం అధికంగా ఉంటుందని సింగరేణి యాజమాన్యం భావిస్తోంది. ఈ భూ లోహకాలను వెలికితీయటం సింగరేణికి లాభించే అంశం. అందుకే ఈ రంగంలో అనుభవం కలిగిన కంపెనీలతో ఒప్పందాలు కుదుర్చుకుంటున్నాం. దేశీయంగా కీలక ఖనిజాల ఉత్పత్తికి ప్రభుత్వాలు ప్రాధాన్యమిస్తుండటంతో సింగరేణి ఈ రంగం వైపు దృష్టి సారించింది.ఎన్.బలరాం, సింగరేణి సీఎండీ

# పురాల్లో స్వచ్ఛతపై శీతకన్ను

సిద్దిపేట : ప్రజలు సహకరించాల్సి ఉంటుంది. అధికారులు, సిబ్బంది విధుల నిర్వహణలో మరింత దృష్టి పెట్టాల్సి ఉంటుంది. అప్పుడే పురపాలికలకు స్వచ్ఛ సర్వేక్షణ్‌లో ఉత్తమ ర్యాంకులు సాధ్యమవుతాయి. జిల్లాలోని కొన్ని పురపాలికల్లో ప్రధానంగా వ్యర్థాల నిర్వహణ సరిగా లేకపోవడంతో గతం కంటే ర్యాంకులు పడిపోయాయి. సిద్దిపేట ఒకప్పుడు జాతీయస్థాయిలో మెరిసింది. ఆదర్శ పట్టణం నేడు వెనుకబాటుకు గురైంది. రాష్ట్రస్థాయిలో 73వ, జాతీయస్థాయి 448వ ర్యాంకు సాధించింది. ఇంటింటి చెత్త సేకరణ 86 శాతం, ఇంటి వద్దే వేర్వేరుగా ఇస్తున్నది 53 శాతం, నిర్వహణ 58 శాతంగా ఉంది. ఘన వ్యర్థాల నిర్వహణకు చర్యలు చేపట్టాల్సి ఉంది. బహిరంగ ప్రాంతాల్లో చెత్త పారబోతకు అడ్డుకట్ట వేయాలి. సంబంధిత అంశంపై కమిషనర్ ఆశ్రిత్‌కుమార్‌ను సంప్రదించగా.. విధుల్లో చేరినప్పటి నుంచి పారిశుద్ధ్యం మెరుగునకు ప్రత్యేకంగా దృష్టి సారిస్తూ ముందడుగు వేస్తున్నామని తెలిపారు.



మూడు రోజులకోసారి... రాష్ట్రంలో 142వ ర్యాంకు పొందింది. డంపింగ్‌యార్డు పనులు అసంపూర్తిగా ఉంది. పట్టణంలో మూడు రోజులకోసారి ఇంటింటికీ చెత్త సేకరణ చేస్తున్నారు. అసంపూర్తిగా ఉన్న డంపింగ్‌యార్డు ఆవరణలో కుమ్మరిస్తున్నారు. సిబ్బంది, నిధుల కొరతతో పూర్తిస్థాయిలో చేయలేని పరిస్థితి ఉంది.. ఇప్పుడిప్పుడే గాడిలో పడుతోందని మెరుగైన ర్యాంకు యత్నిస్తామని కమిషనర్ నాగేందర్ తెలిపారు.

**మరింత దిగజారింది**

దుబ్బాక రాష్ట్ర స్థాయిలో 97.. జాతీయ స్థాయిలో 946వ ర్యాంకులో నిలిచింది. గత సంవత్సరం 18వ స్థానాన్ని సాధించింది. ఈసారి దిగజారింది. పురలో 20 వార్డులున్నాయి. ఇంటింటి చెత్త సేకరణ 54 శాతం, తడి, పొడి వ్యర్థాల నిర్వహణ 34 శాతం జరుగుతోంది. సిబ్బంది లేక వ్యర్థాల నిర్వహణకు చర్యలు వేరుచేయడం లేదు. డీఆర్‌సీసీ కేంద్రంలో విద్యుత్తు కనెక్షన్ లేకపోవడంతో నిరుపయోగంగా ఉంది. పూర్తి స్థాయి పారిశుద్ధ్య అధికారి పోస్టు ఖాళీగా ఉంది. వ్యర్థాల నిర్వహణపై మరింత దృష్టి పెడతామని.. సిబ్బంది కొరతను అధిగమిస్తామని కమిషనర్ కె.రమేశ్‌కుమార్ చెప్పారు.

# సహకారం అమోఘం

హుస్నాబాద్: సంపూర్ణ పారిశుద్ధ్య కార్యక్రమాల నిర్వహణ తడి, పొడి చెత్త వేరుగా సేకరించడం వంటి పలు అంశాల ప్రాతిపదికగా హుస్నాబాద్ పురపాలికకు స్వచ్ఛ సర్వేక్షణ్‌లో అవార్డు లభించింది. జాతీయ స్థాయిలో 139, రాష్ట్రంలో 9వ ర్యాంకు.. జిల్లాలో మొదటి ర్యాంకును హుస్నాబాద్ సాధించింది. పురపాలికలో 20 వార్డులున్నాయి. ప్రధానంగా పేదలు ఉండే ప్రాంతాల్లో స్వచ్ఛతను చేపట్టారు. కార్మికులకు పీపీఈ కిట్ల పంపిణీ, వైద్య పరీక్షలు నిర్వహించారు. గతంలోని స్వచ్ఛ సర్వేక్షణ్‌లో మూడు అవార్డులు లభించాయి. సిబ్బందికి ప్రజలు సహకరించడం వల్లే అవార్డు సాధించగలిగామని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు.

**మెరుగైన ర్యాంకు** గజ్వేల్‌-ప్రజ్ఞాపూర్ రాష్ట్ర స్థాయిలో 35వ ర్యాంకు సాధించింది. గతంలో 142వ ర్యాంకు. 100 శాతం చెత్త సేకరణ చేపడుతున్నారు. రోడ్ల పక్కన కుప్పలుగా వ్యర్థాలు పారబోయడాన్ని నిరోధిస్తున్నారు. పబ్లిక్ టాయిలెట్లు పర్యవేక్షించేందుకు వారంలో రెండు సార్లు ప్రత్యేక సమీక్ష నిర్వహిస్తున్నారు. 13 వేలకు పైగా నివాసాలు, 55 వేల జనాభా, 20 వార్డులు కలిగిన మున్సిపాలిటీలో 132 మంది సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు.

# ఆహార శుద్ధికి చేయూత కరవు



పెద్దపల్లి : స్వయం సహాయక సంఘాల మహిళలు మరింత ఆర్థిక అభ్యున్నతి సాధించేందుకు కేంద్రం ప్రధాన మంత్రి ఫార్మలైజేషన్ మైక్రో ఫుడ్ ప్రాసెసింగ్ ఎంటర్‌ప్రైజెస్(పీఎంఎఫ్‌ఎంఈ) పథకాన్ని అమలు చేస్తోంది. సంఘాల్లోని సభ్యులకు ఎలాంటి పూచీకత్తు లేకుండా ఆహార శుద్ధి పరిశ్రమలు నెలకొల్పేందుకు రాయితీ అవకాశాన్ని కల్పించింది. అవగాహన లోపంతో ఉమ్మడి జిల్లాలో ఈ లక్ష్యం అటకెక్కింది. నైపుణ్యం, మార్కెటింగ్ మెలకువలు లేకపోవడంతో మహిళలు వ్యాపారాల్లో రాణించలేకపోతున్నారు. ఆసక్తి ఉన్న అతివలకు ప్రోత్సాహకంకరవై యూనిట్లు ఏర్పాటు చేయడం లేదు. అధికారులు క్షేత్రస్థాయిలో మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలు గుర్తించి తగిన చర్యలు తీసుకుంటే వారు విభిన్న వ్యాపారాలపై దృష్టి పెట్టే అవకాశముంది.ఉమ్మడి జిల్లాలో 50,183 స్వశక్తి సంఘాల్లో 5,55,242 మంది మహిళలు సభ్యులుగా కొనసాగుతున్నారు. ప్రతి జిల్లాకు గతేడాది రెండు వందల చొప్పున యూనిట్ల లక్ష్యం విధించారు. రూ.50 వేల నుంచి రూ.20 లక్షల వరకు రుణం మంజూరు కానుంది. కొత్తగా నెలకొల్పడంతోపాటు పాత వాటిని పునరుద్ధరించుకోవడం, యంత్రాల సామర్థ్యం పెంచుకోవచ్చు. మహిళలకు 35 శాతం రాయితీ ఉంది. ఇప్పటి వరకు పెద్దపల్లిలో 168, కరీంనగర్‌లో 13, జగిత్యాలలో 142, సిరిసిల్లలో 64 యూనిట్లు మాత్రమే స్థాపించారు. ఉమ్మడి జిల్లాలో 800 యూనిట్లు లక్ష్యం ఉండగా 387 మాత్రమే గ్రౌండింగ్ చేశారు. కరీంనగర్‌లో అత్యల్పంగా ఉంది.

**నాణ్యమైన ఆహార పదార్థాలు అందించేలా..**

స్థానికంగా పండిస్తున్న పంట ఉత్పత్తులతోపాటు ప్రజలకు నాణ్యమైన ఆహార పదార్థాలు అందించేందుకు ఈ పథకాన్ని అమలు చేస్తున్నారు. పిండిగిర్నీ, అటుకుల మిల్లు, కారం, పసుపు పొడి మిల్లు, పచ్చళ్ల తయారీ, మురుకులు, కుర్‌కురే, పౌల్ట్రీ, పశువుల దాణా తయారీ, తీపి పదార్థాలు, బిస్కెట్లు, పాల పదార్థాలు, చిరు ధాన్యాలు, నూనె, అప్పడాలు, పిండి వంటలు ఇలా 25రకాలకుపైగా ఉత్పత్తి చేసుకోవచ్చు. ప్రజల అవసరాలను బట్టి ఆహార శుద్ధి పరిశ్రమల యూనిట్లు ఏర్పాటు చేసుకునే వెసులుబాటు కల్పించారు. అయితే మహిళలు ఎక్కువగా పిండి, కారం, పసుపు పొడి యూనిట్లకే మొగ్గు చూపుతున్నారు.

**అధికారులు ఇలా చేస్తే...**

కార్పొరేట్ సంస్థల పోటీని తట్టుకునే విధంగా నైపుణ్యాలు అందించాలి. రుచికరమైన నాణ్యమైన ఉత్పత్తులపై అవగాహన కల్పించాలి. జీఎస్టీ చెల్లింపులు, మార్కెట్ మెలకువలపై పట్టు సాధించేందుకు తర్ఫీదు ఇవ్వాలి. వ్యాపారంలో నిలదొక్కుకునే వరకు మార్కెటింగ్ అవకాశాలు కల్పించాలి.

# ఎన్నేళ్లూ.. ఈ కన్నీళ్లు..!



సూర్యాపేట : పుట్టుకతో కొందరు..అనారోగ్యంతో, ప్రమాదవశాత్తు ఇంకొందరు.. ఇలా జిల్లాలో వైకల్యంతో బాధపడుతున్న దివ్యాంగులు 'ఆసరా' అందక అష్టకష్టాలు పడుతున్నారు. కుటుంబ ఆర్థిక పరిస్థితి అంతగా సహకరించక అవస్థలు ఎదుర్కొంటున్నారు. అందుకు ఆర్థిక భరోసా ఉంటుందని సర్కారు సదరం ధ్రువీకరణ పత్రం జారీచేసింది. దాని ఆధారంగా పింఛన్ కోసం సంబంధిత కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. ప్రభుత్వం మంజూరు కోసం అనుమతి ఇస్తే దరఖాస్తులు తీసుకొని ఆసరా అందిస్తామంటూ అధికారులు తిప్పి పంపుతున్నారు.

**మూడేళ్లుగా నిరీక్షణ**

జిల్లా వ్యాప్తంగా వైకల్యంతో బాధపడుతూ సదరం ధ్రువీకరణ పత్రం పొందిన వారు ఈ మూడేళ్ల కాలంలో 2,022 మంది ఉన్నట్లు అధికార గణాంకాలు చెబుతున్నాయి. ప్రతి మండలంలో పదుల సంఖ్యలో ఉన్నారు. నూతనకల్ మండలంలో 74, మోత్కూరు 20, తిరుమలగిరి 41, తుంగతుర్తి 42, జాజిరెడ్డిగూడెం 16 మంది ఉన్నారు. వీరిలో చాలావరకు నిరుపేదలే. కొందరు మహిళలే కుటుంబ భారాన్ని మోస్తున్నారు. వైకల్యంతోపాటు అనారోగ్య సమస్యల నుంచి ఉపశమనం పొందడానికి అవసరమైన మందుల కొనుగోలుకు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఒక్కొక్కరూ ఒక్కో సమస్యతో అవస్థలు పడుతూ ప్రతి కలెక్టరేట్‌లో జరుగుతున్న ప్రజావాణిలో అర్జీలు పెట్టుకుంటూ ప్రభుత్వ చేయూత కోసం ఎదురుచూస్తున్నారు.

**పలుమార్లు దరఖాస్తు చేశా**

మద్దెల ఏసు, తుంగతుర్తి

కొన్నేళ్ల వరకు కూలీ పనులకు వెళ్లి కుటుంబాన్ని పోషించుకున్నా. రెండేళ్ల కిందట కాలికి గాయమవగా వైద్యులు కాలు సగానికి తొలగించారు. సదరం ధ్రువీకరణ పత్రం రావడంతో పింఛను కోసం దరఖాస్తు చేసుకున్నా. ఇప్పటికీ నాలుగుసార్లు సంబంధిత కార్యాలయానికి వెళ్లాను. నేటికీ మంజూరు కాలేదు.

**రెండేళ్లుగా నిలిపివేశారు**

ఎర్ర కృష్ణ, తుంగతుర్తి

రోడ్డు ప్రమాదంలో కాళ్లు, చేతులు విరగటంతో వైద్యులు ఆపరేషన్ చేసి రాడ్స్ వేశారు. దాంతో కనీసం నడవలేని పరిస్థితి. మొదట సదరం ధ్రువీకరణ పత్రంలో 45శాతం వైకల్యం నమోదు చేయగా రెండేళ్లపాటు పింఛను ఇచ్చారు. ధ్రువీకరణ పత్రం గడువు ముగియడంతో పింఛన్ నిలిపివేశారు. రెన్యువల్‌కు వెళ్తే అందుకుతగ్గ వైకల్య శాతం ఇవ్వలేదు. తన ఆరోగ్య, కుటుంబ స్థితిగతుల్ని చూసి ఆసరా అందించాలంటూ కృష్ణ కన్నీరు పెట్టుకున్నారు.

**కార్యాలయం చుట్టు తిరుగుతున్నా**

బత్తుల లావణ్య, నూతనకల్‌వైకల్యంతో బాధపడుతున్న నాకు సదరం సర్టిఫికెట్ వచ్చింది. రెండేళ్ల కిందట పింఛన్ కోసం దరఖాస్తు చేసుకున్నా. వారానికి ఒకసారి కార్యాలయం చుట్టు తిరుగుతున్నా మంజూరు కావడం లేదు. చేయూత ఇచ్చి ఆదుకోవాలి.

# పల్లెలకు కొత్త వెలుగులు



ఆలేరు : వర్షాభావ పరిస్థితుల కారణంగా జిల్లాలో విద్యుత్తు వినియోగం బాగా పెరిగిందనే చెప్పవచ్చు. వినియోగదారులకు మరింత నాణ్యమైన విద్యుత్తు అందించాల్సిన బాధ్యత ప్రభుత్వం యంత్రాంగం పైన ఉంది. ఉపకేంద్రాలు, నియంత్రికలు అందుకనుగుణంగా పెంచుకోవాల్సిన అవసరం ఏర్పడింది. ఈ విషయమై నాణ్యమైన విద్యుత్తు పంపిణీకి టీఎస్‌ఎస్‌పీడీసీఎల్ జిల్లాకు నూతనంగా 33/11 కేవీ సామర్థ్యం కలిగిన 16 విద్యుత్తు ఉపకేంద్రాలను మంజూరు చేసింది. సాధ్యమైనంత తొందరలో వీటి నిర్మాణాలు చేపట్టి వినియోగంలోకి తెచ్చేలా అధికార యంత్రం సమాయత్తమవుతోంది. సంబంధిత వివరాలు క్లుప్తంగా..

**స్థల సేకరణలో యంత్రాంగం..**

జిల్లాకు మంజూరైన విద్యుత్తు ఉపకేంద్రాల నిర్మాణాలకు కనీసం ఎకరం స్థలం అవసరం ఉంటుంది. ఈ మేరకు సంబంధిత శాఖల అధికారులు స్థలాల సేకరణలో నిమగ్నమయ్యారు. ఒక్కో కేంద్రం నిర్మాణానికి ప్రభుత్వం సుమారు రూ.3 కోట్లు కేటాయించింది. లో ఓల్టేజీ సమస్య, తరచూ ట్రిప్ అవడం లాంటివి జరుగుతున్నందున వీటి నిర్మాణాలతో ఇక నుంచి సమస్యలకు చెక్ పడనుంది. ప్రధానంగా విద్యుత్తు పరంగా అత్యంత సమస్యాత్మక ప్రాంతాలుగా గుర్తించిన నాగినేనిపల్లి (బొమ్మలరామారం), వంకమామిడి (సంస్థాన్ నారాయణపురం), దూదివెంకటాపురం (రాజపేట) ప్రాంతాల్లో త్వరితగతిన నిర్మాణానికి దృష్టి సారించనున్నారు.

**ఎక్కడెక్కడంటే..**

కొరటికల్(ఆత్మకూర్(ఎం), దూదివెంకటాపురం(రాజపేట), గంధమల్ల (తుర్కపల్లి), మాసాయిపేట (యాదగిరిగుట్ట), సీతారామపురం(గుండాల), మాటూరు (మోటకొండూరు), నాగినేనిపల్లి (బొమ్మలరామారం), నర్సాపురం (వలిగొండ), దోతిగూడెం (భూదాన్‌పోచంపల్లి), వంకమామిడి, చిమిర్యాల, లక్ష్మమ్మగూడెం (సంస్థాన్ నారాయణపురం), శేరిల్లా, ఎనకటితండా (చౌటుప్పల్), మునివంపుల (రామన్నపేట), కోటమర్తి (అడ్డగూడూరు). **ఈ సారైనా నిర్మాణం జరిగేనా..**

రాజపేట మండలం దూదివెంకటాపురం శివారులో గత ప్రభుత్వ హయాంలోనే ఉపకేంద్రం మంజూరైంది. రెవెన్యూ అధికారులు సూచించిన స్థలం జడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో ఉందనే గ్రామస్థుల విన్నపం మేరకు అప్పట్లో నిర్మాణానికి వెనక్కితగ్గారు. అప్పటి ఎమ్మెల్యే గొంగిడి సునీత శంకుస్థాపన సైతం చేసినప్పటికీ సాంకేతిక పరమైన అడ్డంకుల కారణంగా పనులు ప్రారంభించలేదు. నిర్మాణం చేపడితే రాజనగర్, సోమారం, నెమిల, నగరం, ధర్మారెడ్డిగూడెం, దూదివెంకటాపురం గ్రామాలకు విద్యుత్తు పరంగా ప్రయోజనం చేకూరనుంది. ఈసారి ఎలాగైనా నిర్మాణం చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

# సిద్ధించని స్వచ్ఛ లక్ష్యం

సంగారెడ్డి : స్వచ్ఛ సర్వేక్షణ్(2024-25) ర్యాంకుల్లో జిల్లాలోని పురపాలికలు వెనుకబడ్డాయి. రెండు చోట్ల మినహా ఆరు పాత బల్దియాలు ఆశించిన ర్యాంకులు సాధించలేదు. ఇంటింటి చెత్త సేకరణ సరిగా చేయకపోవడం.. డంపింగ్ యార్డుల నిర్వహణ వైఫల్యం, పారిశుద్ధ్య వ్యవస్థ అధ్వానంగా ఉండటంతో ఈ పరిస్థితి నెలకొందనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

**రెండు చోట్లే మెరుగు** జిల్లాలో పాత మున్సిపాలిటీలు ఎనిమిది ఉన్నాయి. వాటిలో హైదరాబాద్‌కు సమీపంలో ఉన్న తెల్లాపూర్(18), అమీన్‌పూర్(31)కు మాత్రమే ఓడీఎఫ్ డబ్ల్యూప్లస్ ర్యాంకులు దక్కాయి. రాష్ట్రంలో 143 పురపాలక సంఘాలు ఉన్నాయి.

**వైఫల్యానికి ప్రధాన కారణాలివి**

జిల్లాలోని అన్ని పట్టణాల్లోనూ ఇంటింటి చెత్త సేకరణ పూర్తిస్థాయిలో జరగడం లేదు. 60 శాతం మాత్రమే సేకరిస్తున్నారు.



తడి, పొడి చెత్త వేర్వేరుగా సేకరించడం లేదు.

సదాశివపేట, జహీరాబాద్‌లో డంపింగ్ యార్డులున్నా.. నిర్వహణ కొరవడింది. సంగారెడ్డిలో 30 శాతం చెత్తను మాత్రమే రీసైక్లింగ్ చేస్తున్నారు. నారాయణఖేడ్‌లో 50 శాతానికి మించడం లేదు. అందోలు-జోగిపేట, బొల్లారంలో డంపింగ్ యార్డులు లేవు.

నిషేధిత పాలిథీన్ కవర్లు విచ్చలవిడిగా వాడుతున్నా.. కట్టడి చర్యలు కరవయ్యాయి.మున్సిపాలిటీలకు మంచి ర్యాంకు రావడానికి ప్రజాభిప్రాయ సేకరణ కీలకం. జిల్లాలోని అన్ని పురపాలికలు ప్రజాభిప్రాయ సేకరణలో పూర్తిగా వెనుకబడ్డాయి. వీటిపై ప్రచారం చేయకపోవడమే ప్రధాన కారణం.

# నత్తనడకన ప్రయాణ ప్రాంగణాలు

గజ్వేల్: గజ్వేల్‌తోపాటు ప్రజ్ఞాపూర్‌లో చేపట్టిన మూడు బస్టాండ్ల నిర్మాణం నత్తనడకన కొనసాగుతున్నాయి. మూడేళ్ల క్రితం పనులు ప్రారంభమయ్యాయి. ఏడాది గడువు ఉండగా ఇంకా ప్రజలకు అందుబాటులోకి రాలేదు. నిధుల విడుదల, పర్యవేక్షణ లేక పనుల్లో జాప్యం అవుతోంది. మొన్నటివరకు ఎండలు, ప్రస్తుతం వానలతో బస్సుల కోసం ఎదురుచూసే ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. గజ్వేల్ పట్టణంలో రూ.2.56 కోట్ల వ్యయం, ప్రజ్ఞాపూర్‌లో నిర్మించే చిన్న బస్టాండుకు రూ.3.81 కోట్లు గతంలో మంజురయ్యాయి. ప్లాట్‌ఫారాలు నిర్మించాల్సి ఉంది. ప్రజ్ఞాపూర్‌లో దాదాపు సగానికిపైగా పనులు పెండింగులో ఉన్నాయి. విద్యార్థులు, వ్యాపారులు, ఉద్యోగులు, సాధారణ ప్రజలు రోజూ ఈ పట్టణానికి సుమారు 25 వేల మంది రాకపోకలు సాగిస్తుంటారు. ప్రయాణికులు తలదాచుకునేందుకు



ఎలాంటి సౌకర్యం లేకపోవటంతో అవస్థలు పడుతున్నారు. స్థానికులు పలుమార్లు ప్రజాప్రతినిధులకు వినతి పత్రాలు ఇచ్చిన పురోగతి లేదు.

**దూరంగా ఉండటంతో ఆదరణ తక్కువ**

గజ్వేల్-తూప్రాన్ ప్రధాన రోడ్డులో బాహ్యవలయ రహదారి జంక్షన్ సమీపంలో గత ప్రభుత్వం దాదాపు రూ.5 కోట్ల వ్యయంతో ప్రధాన బస్టాండును నిర్మించింది. సీసీరోడ్లు, ఇతర సౌకార్యలు కల్పించకపోవటంతో అక్కడికి బస్సులు రావటం లేదు. పలితంగా ఇప్పుడు నిరుపయోగంగా ఉంది. సంగారెడ్డికి వెళ్లేవి, అక్కడి నుంచి వచ్చే బస్సులు తప్ప ఇక్కడికి వేరే బస్సులు వచ్చే అవకాశం లేదు. పట్టణానికి మూడు కిలోమీటర్ల దూరంలో ఉండటంతో పనికిరాకుండా పోయింది. పాతికేళ్ల కిందట అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజ్ఞాపూర్ శివారులో బస్టాండు నిర్మించింది. ఊరికి దూరంగా ఉందని ప్రయాణికులు ఆదరించలేదు. దానిని డీఎం కార్యాలయంగా మార్చారు. గజ్వేల్‌లోనూ ఇదేతీరు నిర్మించారు.

# మన్యం వాసులకు మంచి రోజులు

కొత్తగూడెం : ఆధునిక వైద్యసదుపాయాలు అందుబాటులో లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్న మన్యం వాసులకు మంచిరోజులు రానున్నాయి. ఇప్పటివరకు యూజీ వైద్యవిద్య ఉన్నచోటే పీజీ కోర్సులను ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలలు నిర్వహిస్తున్నాయి. ఈ ఏడాది నుంచి నేరుగా పీజీ వైద్యకళాశా లల ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం రంగం సిద్ధం చేస్తోంది. రాష్ట్రంలోని ఐదు ప్రాంతాల్లో యూజీ లేకుండానే పీజీ కళాశాలలు నెలకొల్పాలని నిర్ణయించగా.. అందులో భద్రాచలం పట్టణానికి చోటు కల్పించింది.

**బోధనాసుపత్రిగా ఏరియా వైద్యశాల**

పీజీ కళాశాల ఏర్పాటుతో భద్రాచలంలో 200 పడకలు కలిగిన ఏరియా వైద్యశాల పీజీ కోర్సుల కోసం బోధనాసుపత్రిగా మారనుంది. స్థానికంగా అధునాతన వైద్యసదుపాయాలు అందుబాటులోకి వస్తాయి. నాలుగు రాష్ట్రాల సరిహద్దుల్లో ఉన్న గిరిజనులకు ఉన్నతస్థాయి వైద్యచికిత్స సులువుగా అందుతుంది. ప్రత్యేక వైద్యసదుపాయాలు(కార్డియాలజీ, న్యూరాలజీ, ఆర్థోపెడిక్స్ వంటివి) భద్రాచలం ప్రభుత్వాసుపత్రిలో లభ్యమవుతాయి. రోగులు ఖమ్మం, హైదరాబాద్ వంటి నగరాలకు ప్రయాణించాల్సిన అవసరం తగ్గుతుంది. ముఖ్యంగా పీజీ సీట్ల సంఖ్య పెరగటంతో జిల్లా యువతకు వైద్యవిద్యలో అవకాశాలు మెరుగుపడతాయి.

**జిల్లాకు మరో మణిహారమే..**మారుమూల గిరిజన ప్రాంతాల్లో సేవలందించేందుకు వైద్యులెవరూ ఆసక్తి చూపించని ప్రస్తుత పరిస్థితుల్లో పీజీ వైద్యకళాశాల ఏర్పాటు.. వైద్యరంగం పరంగా జిల్లాకు మణిహారంగా మారనుంది. పీజీ కళాశాలలు ఎక్కువ సంఖ్యలో స్పెషలిస్టు డాక్టర్ల(ఎండీ, ఎంఎస్, డీఎం, ఎంసీహెచ్)ను తయారుచేస్తాయి. వీరు స్థానికంగా నాణ్యమైన వైద్యసేవలు అందించేందుకు అవకాశముంటుంది. కళాశాల, బోధనాసుపత్రి ఏర్పాటు ద్వారా ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయి. డాక్టర్లు, నర్సులు, టెక్నీషియన్లు, సహాయక సిబ్బంది సంఖ్య పెరుగుతుంది. పీజీ కళాశాలలు వైద్య పరిశోధనలను ప్రోత్సహిస్తాయి. దీనివల్ల కొత్త చికిత్స పద్ధతులు, ఔషధాలు అభివృద్ధి చెందుతాయి. ముఖ్యంగా గిరిజన ప్రాంతాల్లో ఎక్కువగా వ్యాపించే డెంగీ, మలేరియా, టీబీ రోగాల నివారణకు ఇవి సహాయపడతాయి. **భద్రాచలం అభివృద్ధికి బాటలు..**కళాశాల ఏర్పాటు కోసం రోడ్లు, విద్యుత్తు, అంతర్జాల సేవల వంటి మౌలిక సదుపాయాలు, ఆర్థిక కార్యకలాపాల కేంద్రాలు (వసతిగృహాలు, దుకాణాలు) పెరుగుతాయి. ఇవి స్థానిక ఆర్థిక వ్యవస్థకు ఊతమిస్తాయి. గిరిజన సమాజం ఆధునిక వైద్యవిద్య, సేవల్లో ఏకీకృతమవుతుంది. గిరిజన సంస్కృతికి గౌరవం లభిస్తుంది. పేద గిరిజనులకు ఆధునిక వైద్యం ఉచితంగా అందుతుంది. భద్రాచలంలో పీజీ వైద్యకళాశాల ఏర్పాటుకు సంబంధించి ప్రభుత్వం నుంచి మార్గదర్శకాలు అందలేదు. వైద్యకళాశా ల ఏర్పాటైతే వైద్యపరంగా జిల్లావాసులకు మంచిరోజులు వచ్చినట్లే. వివిధ విభాగాల్లో విద్యనభ్యసిం చేవారు ఉండటం ఆధునిక వైద్యసేవలు అందుబాటులోకి వస్తాయి.

# మా వాళ్లే..అటు చూడొద్దు

ఏలూరు: ఆయన చెప్పిందే శాసనం అనేలా ఉద్యోగులు పాటిస్తున్నారు. ప్రజాపంపిణీ బియ్యాన్ని నల్లబజారుకు తరలించేవారిపై కఠిన చర్యలు చేపట్టాలని ముఖ్యమంత్రే చెప్పారు. కానీ జిల్లాలో మెట్ట ప్రాంత ప్రజాప్రతినిధి ఒకరు ఇందుకు భిన్నంగా రేషన్‌మాఫియాతో అంటకాగుతూ వారిచ్చే మాముళ్లు పుచ్చుకుని చివరకు యంత్రాంగాన్నే బియ్యం పట్టుకోవద్దని ఆదేశించటం చర్చనీయాంశమవుతోంది.

**కిడ్నాప్‌లు చేసుకునే దాకా..**

రేషన్ మాఫియా ఆగడాలు శ్రుతి మించాయి. మెట్ట, ఏజెన్సీ ప్రాంతంలో పీడీఎస్ బియ్యం సేకరించే విషయంలో మాఫియా మధ్య ఏర్పడిన ఆధిపత్య పోరు చివరకు ఒకరికొకరు కిడ్నాప్‌లు చేసుకునే వరకు వెళ్లింది. తూ.గో.జిల్లాకు చెందిన మాఫియా గత కొన్నాళ్ల నుంచి మెట్ట, ఏజెన్సీ మండలాల్లో బియ్యం సేకరించి నేరుగా కాకినాడ పోర్టుకు తరలించి సొమ్ము చేసుకుంటోంది. ప్రస్తుతం తాడేపల్లిగూడేనికి చెందిన మాఫియా మెట్ట ప్రాంతానికి చెందిన ప్రజాప్రతినిధి అండతో ఇక్కడకు వచ్చి బియ్యం సేకరిస్తోంది. ఇది మా అడ్డా. మమ్మల్ని ప్రజాప్రతినిధి చేసుకోమన్నారు. విజిలెన్స్‌కు మాపై ఫిర్యాదు చేస్తున్నావ్...అసలు నీ సంగతి ఏమిటి అని తూ.గోకు చెందిన వ్యాపారిని ఇటీవలే జంగారెడ్డిగూడెం-అశ్వారావుపేట రహదారిలో ఓ మారుమూల ప్రాంతానికి తీసుకెళ్లి బంధించి అర్ధరాత్రి దాకా విడిచిపెట్టలేదు. సెల్‌ఫోన్లు లాగేసుకుని భయభ్రాంతులకు గురిచేశారు.

**కేసుతోనే సరిపుచ్చారు!**



వారి నుంచి తప్పించుకుని ఆ బాధితుడు నేరుగా పోలవరం సబ్‌డివిజన్‌లో ఓ స్టేషన్‌కు వెళ్లి తనను కిడ్నాప్ చేశారని ఫిర్యాదు చేయగా మొక్కుబడిగా కేసు కట్టి అంతటితో సరిపుచ్చారు. పోలీసులు మిన్నకుండిపోవటంపై విమర్శలొచ్చాయి. ఇలాంటి ఉదంతాలను చాలా తీవ్రంగా పరిగణిస్తారు. కానీ ఈకేసు విషయంలో పోలీసులపై ఒత్తిడి ఉన్నట్లు చర్చ సాగుతోంది. బియ్యం, గంజాయి మాఫియాపై ఉక్కుపాదం మోపాలని నేర సమీక్షలో ఎస్పీ తరచూ చెబుతున్నా కిందిస్థాయిలో యంత్రాంగం గాలికొదిలేస్తోంది.

**ఉన్నతాధికారులకు చెప్పలేదా?**

ఆ ప్రజాప్రతినిధి తమను పిలిచి రేషన్ మాఫియాకు అడ్డు తగలొద్దని హెచ్చరించి పంపారని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లిన పాపాన పోలేదు. కొందరు డీటీలు ఆ ప్రజాప్రతినిధి పిలవగా వెళ్లారు. ఆ వ్యాపారులు మావాళ్లే.. జోక్యం చేసుకోవద్దని అధికారులను ఆదేశించటం చూస్తే ప్రభుత్వానికి చెడ్డపేరు వచ్చినా పర్లేదు అనేలా ఆయన తీరు ఉంది.

# లేదు తోవ.. తెండి నావ

భీమవరం : మురుగు కాలువలు ఆక్రమించి శాశ్వత నిర్మాణాలు, ఔట్‌లెట్ వ్యవస్థ అస్తవ్యస్తం, వేసవిలో పూర్తి చేయాల్సిన పూడిక తొలగింపు ఇప్పటికీ కాకపోవడం వెరసి వర్షం కురిస్తే పలు కాలనీల్లో ప్రజలు ఇంటికి వెళ్లాలంటే పడవలు అవసరమన్నట్టుగా పరిస్థితి మారిపోయింది. ముంపు ఇబ్బందులపైన పుర అధికారులతో మాట్లాడానని పురపాలక రాజమహేంద్రవరం ప్రాంతీయ సంచాలకుడు సీహెచ్ నాగనరసింహారావు తెలిపారు. భారీ వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణ శాఖ హెచ్చరికలతో ముంపు ప్రభావం లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించినట్లు పేర్కొన్నారు.

**కాలనీళ్లే..** వానొస్తే భీమవరంలోని ప్రధాన రహదారులు, హౌసింగ్‌బోర్డు కాలనీ, నర్సయ్యఅగ్రహారం, బ్యాంకు కాలనీ, శ్రీరామపురం, బలుసుమూడి, వంశీకృష్ణానగర్ ముంపులోనే ఉంటాయి. పాలకొల్లులోని హౌసింగ్ బోర్డు కాలనీ, శ్రీరాంపేట, బ్యాంకు కాలనీ, బస్టాండు ప్రాంతాలు, బ్రాడీపేట, కోడుగట్టు, పల్లపువీధి, కొత్తపేట, తణుకులో ఇరగవరం కాలనీ, బ్యాంకు కాలనీ, ఎన్జీవో కాలనీ, కప్పల వెంకన్న కూడలి, ఉండ్రాజవరం కూడలి, వేల్పూరు రోడ్డు, నరసాపురం బస్టాండ్ ప్రాంతం, పొన్నపల్లి, మెయిన్‌రోడ్డు, వైఎస్సార్‌కాలనీ, రుస్తుంబాద, మాధవాయపాలెం, నందమూరికాలనీ, తాడేపల్లిగూడెంలో స్టేషన్‌రోడ్డు, యాగర్లపల్లి, రెల్లి కాలనీ, కడగట్ల, కె.ఎన్‌రోడ్డుకు ముంపు బాధ తప్పదు. భీమవరంలో ఆరు గంటలకు కొత్త బస్టాండ్ దగ్గర ద్విచక్ర వాహనంపై



బయల్దేరిన ప్రైవేటు ఉద్యోగి కేవలం అయిదారు నిమిషాల్లోనే రెండో పట్టణంలోని అంబేడ్కర్ కూడలికి చేరవచ్చు. కానీ వర్షపు నీటితో వెళ్లడానికి 45 నిమిషాలు పట్టింది.

విద్య, వైద్య, వాణిజ్య రంగాల్లో పోటీ పడుతున్న జిల్లాలోని పట్టణాలు వాన కురిస్తే హైదరాబాద్‌ను గుర్తు చేస్తున్నాయి. బుధవారం సాయంత్రం రెండు మూడు గంటల పాటు 236 మిల్లీమీటర్ల వాన కురిస్తేనే రహదారులు జలమయమై దారులన్నీ మూసుకుపోయాయంటే ఎడతెరిపి లేకుండా పడితే పరిస్థితి ఎలా ఉండేదోనని పట్టణ ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

**ఇదీ లెక్క..** జిల్లాలోని ఆరు పట్టణాల్లో పూడిక తీయడానికి గత ఆర్థిక సంవత్సరంలో రూ.2.10 కోట్లకు పైగా కేటాయించారు. డ్రెయిన్లలో సిల్టు తీశారో లేదో పర్యవేక్షణ లేదు. గతంలో అన్ని చోట్లా డ్రెయిన్లపై 875కు పైగా ఆక్రమణలను గుర్తించారు. వాటిని తొలగించలేదు. ఇటీవల డ్రెయిన్ల ఆనవాళ్లే లేదు. భీమవరంలో జాతీయ రహదారి పొడవునా రూ.1.20 కోట్లతో నిర్మించిన డ్రెయిను కప్పేయడంతో ప్రకాశంచౌక్, రూపాంతర దేవాలయం, పోలీసుబొమ్మకూడలి వరకు చెరువును తలపిస్తుంది.

# ఐటీకి పూర్వకళ.. సాకారం యువత కల



విశాఖపట్నం: వైకాపా పాలనలో ఐటీ కంపెనీలకు ఇవ్వాల్సిన రాయితీలు, ప్రోత్సాహకాలకు ఎగనామం పెట్టారు. ఫలితంగా కొన్ని కంపెనీలు విశాఖను వదిలి వెళ్లిపోయాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే కొత్త ఐటీ పాలసీ తీసుకొచ్చి, భారీగా రాయితీలు ప్రకటించి సాగర తీరానికి ఆహ్వానం పలికింది.

కొన్ని దిగ్గజ కంపెనీలు ముందుకొచ్చి విశాఖలో కార్యకలాపాలు సాగించడానికి ఒప్పందాలు చేసుకోగా, మరికొన్ని కంపెనీలు వరుస కట్టాయి. అందుకు అవసరమైన భూ కేటాయింపులు చేస్తూ ఇటీవల మంత్రి మండలి నిర్ణయం తీసుకుంది.

భూ కేటాయింపులు జరిగిన కంపెనీలు 12 నెలల వ్యవధిలో తమ కార్యకలాపాలు సాగించడంతోపాటు, నిర్దేశించిన లక్ష్యం ప్రకారం యువతకు ఉపాధి కల్పించేలా అడుగులు పడుతున్నాయి.

**ఏ కంపెనీకి భూములు ఎక్కడంటే:** విశాఖలో టీసీఎస్ క్యాంపస్ విస్తరణకు ఐటీహిల్స్-3లో 22 ఎకరాలను కేటాయించారు. ఏఐ డేటా సెంటర్, క్లౌడ్ డేటా సెంటర్ ఏర్పాటుకు గూగుల్‌తో ఒప్పందం కాగా, తొలుత మధురవాడలో భూమి ఇవ్వాలని నిర్ణయించారు. అయితే తర్లువాడలో గుర్తించిన 200 ఎకరాల్లో 80 ఎకరాల మేర కేటాయింపులు చేయనున్నారు. కాగ్నిజెంట్ టెక్నాలజీ సొల్యూషన్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్‌కు మధురవాడలో 22.19 ఎకరాలు కేటాయించారు. ఉర్సా క్లస్టర్ ప్రైవేట్ లిమిటెడ్ డేటా సెంటర్, ఐటీ ఆఫీస్ స్పేస్ ఏర్పాటుకు కాపులుప్పాడ వద్ద 56.5 ఎకరాలు, ఐటీ హిల్-3లో 3.5ఎకరాలు కేటాయించారు. ఫీనమ్ పీపుల్ సంస్థకు 4.45 ఎకరాలు ఐటీ హిల్స్‌లో కేటాయించారు. హిల్ నెంబరు 3లో 2.5 ఎకరాలు, హిల్ నెంబరు 4లో 7.79 ఎకరాలు ఏఎన్ఎస్ఆర్ గ్లోబల్ కార్పొరేషన్‌కు ఇచ్చారు. ఐటీ హిల్-3పై 3.6 ఎకరాలు, పరదేశిపాలెంలో 50 ఎకరాలు సిఫీ ఇన్ఫినిట్ స్పేసెస్ లిమిటెడ్‌కు కేటాయించారు.

**ప్రస్తుతం 150 వరకు కంపెనీలు**

మధురవాడలోని ఐటీ హిల్స్, నగరంలో కలిపి వివిధ స్థాయిల ఐటీ కంపెనీలు 150 వరకు ఉన్నాయి. వీటిలో డబ్ల్యూఎన్ఎస్ (5వేల మంది), పాత్ర (3వేలు), టెక్‌మహేంద్ర (1500), కాండియంట్ (వెయ్యి), ఇన్ఫోసిస్ (వెయ్యి), ఫ్లూయింట్‌గ్రిడ్, మిరాకల్, ఏసీఎన్, తదితర కంపెనీలున్నాయి. వీటన్నింటిలో సుమారు 30వేల మంది ఉపాధి పొందుతున్నారు. గత ప్రభుత్వం ఇన్నోవేషన్ వ్యాలీ స్టార్టప్ భవనం బోసిపోయేలా చేసింది. ప్రస్తుతం కొన్ని స్టార్టప్ కంపెనీలతో ఈ భవనం తిరిగి పూర్వకళ సంతరించుకుంటోంది.

# రూపాయికే ఇంటి ప్లాన్




అమలాపురం : పట్టణాల్లో నూతనంగా ఇంటిని నిర్మించుకునే వారికి కూటమి ప్రభుత్వం తీపి కబురు చెప్పింది. 50 చదరపు మీటర్లలోపు నిర్మాణాలకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుని రూపాయి ఫీజు చెల్లిస్తే ఇంటి ప్లాన్ మంజూరు చేస్తారు. గతంలో ఈ ఫీజులు రూ.వేలల్లో ఉండేవి.

**దరఖాస్తు విధానం..** పురపాలిక పరిధిలో అనుమతి కలిగిన సాంకేతిక నిపుణులు(ఎల్‌టీపీ)ను కలిసి ఖాళీ స్థలం ఫొటో, దస్తావేజులు, వాటి లింక్ డాక్యుమెంట్లు, వివరాలు, ప్లాన్‌తో సహా ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలి. వెంటనే చలానా చెల్లించాలని సందేశం వస్తుంది. రూపాయి చెల్లిస్తే అనుమతులు వచ్చినట్లే. తాజా నిబంధనలతో కార్యాలయాలకు వెళ్లకుండానే ఆన్‌లైన్‌లో ప్లాన్ పొందవచ్చు. గతంలో 50 చదరపు మీటర్ల విస్తీర్ణంలో భవనం నిర్మించాలంటే అభివృద్ధి, ఇతర ఛార్జీలతో సహా ఆ ప్రాంతంలో స్థలం విలువలో 15 నుంచి 20 శాతం వరకు ఖర్చయ్యేది.

**జిల్లా వివరాలు..** జిల్లాలో అమలాపురం, మండపేట, రామచంద్రపురం పురపాలక సంఘాలు, ముమ్మిడివరం నగర పంచాయతీ ఉన్నాయి. వీటిలో ఏటా 10వేల వరకు నూతన ఇళ్ల నిర్మాణాలకు దరఖాస్తులు వస్తున్నట్లు అధికారులు తెలిపారు. వీటిలో 50 చ.మీ.లోపు ఉన్నవి 40శాతం వరకు ఉంటున్నాయి. వీటిని నిర్మించుకునే వారంతా పేద, మధ్య తరగతి వర్గాల వారే ఉంటున్నారు. తాజాగా ప్రభుత్వం ఇచ్చిన ఉత్తర్వుల ప్రకారం వీరందరికీ ఉపసమనం కలగనుంది.

**సడలింపు ఇచ్చింది-నిర్మల్ కుమార్, కమిషనర్, అమలాపురం**

భవన నిర్మాణ అనుమతుల్లో ప్రభుత్వం సడలింపు ఇచ్చింది. ఈ వెసులుబాటు కేవలం జీ ప్లస్ వన్ భవనాలకు మాత్రమే వర్తిస్తుంది. అంతకు మించి నిర్మిస్తే మొత్తం ఫీజు చెల్లించాల్సి ఉంటుంది. ఈ ఫీజు కేవలం నివాసా గృహాలకు మాత్రమే వర్తిస్తుంది.

# జ్వరాలు వైరల్



నంద్యాల : పట్టణానికి చెందిన రామారావు నాలుగు రోజులుగా జ్వరంతో బాధపడుతున్నారు. స్థానికంగా ప్రైవేటు ఆసుపత్రిలో చూపించుకున్నా తగ్గలేదు. దీంతో సర్వజన వైద్యశాలకు వచ్చారు. వైద్యులు పరీక్షలు చేసి వైరల్ ఫీవర్ అని నిర్ధారించి మందులు ఇచ్చి పంపించారు. నగరానికి చెందిన రేణుకమ్మ గత ఐదు రోజులుగా జ్వరంతో పాటు జలుబు, ఒళ్లు నొప్పులతో ఇబ్బంది పడుతున్నారు. ప్రైవేటు వైద్యుల వద్ద చూపించుకోగా పరీక్షలు చేసి టైఫాయిడ్ అని చెప్పారు. తర్వాత ఆమె సర్వజన వైద్యశాలలో చూపించుకోగా వైరల్ ఫీవర్ అని తేలింది. ఉమ్మడి జిల్లాలో వైరల్ జ్వరాలు విజృంభిస్తున్నాయి..వారం రోజులుగా జ్వర బాధితులతో ఆసుపత్రుల్లో ఓపీ అమాంతం పెరిగింది. కర్నూలు సర్వజన వైద్యశాలలోని 9వ నంబరు ఓపీకి రోజుకు 150 మంది జ్వర బాధితులు వస్తున్నారు. వీరిలో 70 మందికి పైగా వైరల్ జ్వరాలు, దగ్గు, జలుబుతో బాధపడే వారున్నారు. చాలా కుటుంబాల్లో ఒకరిద్దరు జ్వరాల బారినపడ్డారు. జిల్లా వ్యాప్తంగా వారం రోజులుగా వర్షాలు కురుస్తున్నాయి. పరిసరాల్లో నీళ్లు నిలిచాయి. ఖాళీ స్థలాలు చెరువుల్లా మారాయి. వీధుల్లో పోగైన చెత్తాచెదారం కుళ్లి తీవ్ర అపరిశుభ్ర వాతావరణం నెలకొంది. దీంతో దోమలు విపరీతంగా పెరిగాయి. వీటి కట్టడికి అధికారులు ఏమాత్రం చర్యలు తీసుకోవడం లేదు.

**అప్రమత్తతే ఔషధం**

వాతావరణంలో అనూహ్య మార్పులతో సీజనల్ వ్యాధులు ప్రబలుతున్నాయని సర్వజన వైద్యశాల జనరల్ ఫిజీషియన్ ప్రొఫెసర్ డా.మహేశ్వరరెడ్డి తెలిపారు. ప్రస్తుత పరిస్థితుల్లో ప్రజలు జ్వరాల బారినపడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు.కాచి వడపోసిన నీరు తాగాలి. బయట ఆహారం తీసుకోకూడదు. ఇంట్లో వేడిగా ఉన్న ఆహారం తీసుకోవాలి. చిన్నారులను చల్లటి పదార్థాలకు దూరంగా ఉంచితే మంచిది.ఇంటి పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలి. నీళ్ల నిలవకుండా జాగ్రత్తపడాలి. దోమతెరలు వాడాలి. కిటికీలకు మెష్‌లు ఏర్పాటు చేసుకోవాలి.సిగరెట్, బీడీలు తాగే అలవాటున్న వృద్ధుల్లో రోగ నిరోధక శక్తి తక్కువగా ఉంటుంది. వీరు జాగ్రత్తగా ఉండాలి.మధుమేహ రోగులు, వృద్ధులు అప్రమత్తంగా ఉండాలి. వీలైనంత వరకు ప్రయాణాలకు దూరంగా ఉండాలి.

వర్షాకాలంలో ఏసీలను సరిగా శుభ్రం చేసుకోవాలి. ఏసీలకు అలవాటు పడ్డ వారు త్వరగా వైరల్ జ్వరాల బారినపడే ప్రమాదం ఉంది.

# ముం'చేను'

ఉండి : అల్పపీడన ప్రభావంతో కురిసిన కుండపోత వర్షానికి జిల్లాలోని పల్లపు ప్రాంతాల్లో వరిచేలు జలదిగ్బంధంలో చిక్కాయి. మట్టిపూడికతో పాటు తూడు, గుర్రపుడెక్క, ఇతర వ్యర్థాలతో నిండిపోయిన డ్రెయిన్లల్లో మురుగునీరు సాఫీగా ముందుకెళ్లని పరిస్థితులున్నాయి. జిల్లాలోని 20 మండలాల్లో 24 గంటల వ్యవధిలో 90 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. పంటలపై ఈ ప్రభావం ఎక్కువగా పడింది ఉదయం పొడి వాతావరణం ఏర్పడటంతో రైతులు పొలంబాట పట్టారు. అత్తిలి మండలం తిరుపతిపురం, వరిఘేడు ప్రాంతాల్లో నీట మునిగిన వరిచేలను కలెక్టర్ చదలవాడ నాగరాణి పరిశీలించి అక్కడి రైతులతో మాట్లాడారు. లోతట్టు ప్రాంతాల్లోని పంట పొలాల్లోకి వర్షపు నీరు చేరిందని ఆమె గుర్తించారు. నీరు పూర్తిగా బయటకెళ్లితే అక్కడ పంట దెబ్బతిన్నదీ లేనిదీ తెలియదు.

**15 మండలాల్లో ప్రభావం..** జిల్లాలో 2,06,245 ఎకరాలకు 1,71,902 ఎకరాల్లోనే ఖరీఫ్ వరి నాట్లు పడ్డాయి. అధిక వర్షాలతో రైతులు నాట్లేయలేదు. 34,343 ఎకరాల్లో వేయాలి. కుండపోత వర్షానికి జిల్లాలో 15 మండలాల్లో ఉన్న 21,560 ఎకరాల్లో వరి చేలు ముంపులో ఉన్నాయని జిల్లా వ్యవసాయాధికారి జడ్ వెంకటేశ్వరరావు తెలిపారు. తాడేపల్లిగూడెం, పెంటపాడు, అత్తిలి, తణుకు, ఇరగవరం, తదితర చోట్ల ఎక్కువగా నీటిలో ఉన్నాయని చెప్పారు.

**డ్రెయిన్‌లోకి మళ్లింపు..** భారీ వర్షాల హెచ్చరికల నేపథ్యంలో విజ్జేశ్వరం వద్ద డెల్టాలోని 11 ప్రధాన కాలువలకు బుధవారం సాయంత్రం నుంచే 500 క్యూసెక్కుల సాగునీటి విడుదలకు పరిమితం చేశారు. అంతకు ముందు 6,500 క్యూసెక్కుల నీరొదిలారు. జిల్లాలోని కాలువల్లో నీటిమట్టాన్ని తగ్గించేందుకు సర్‌ప్లస్ వియర్లన్నీ తెరిచి డ్రెయిన్‌ల్లోకి మళ్లిస్తున్నారు. సాగునీటితో చేలు దెబ్బతినకుండా



ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకుంటున్నామని జల వనరుల శాఖ అధికారులు తెలిపారు. భగ్గేశ్వరం, యనమదుర్రు, రుద్రాయకోడు, చినకాపవరం తదితర డ్రెయిన్లల్లోని తూడు, గుర్రపుడెక్క మురుగునీటి ప్రవాహానికి అవరోధంగా ఉన్నాయని రైతులు వాపోతున్నారు.

**తణుకులో 236.6 మి.మీ వర్షపాతం**

జిల్లాలో సగటు వర్షపాతం 90 మి.మీగా నమోదైంది. అత్యధికంగా తణుకులో 236.6 మి.మీ, ఇరగవరం- 196.6, పెనుగొండ - 193.8, పెంటపాడు - 189.0, తాడేపల్లిగూడెం -162.2, గణపవరం-144.4, అత్తిలి-85.4, పోడూరు- 82.6, ఆకివీడు-77.2, పాలకోడేరు -76.2, పెనుమంట్ర-75.2, ఉండి-54.4, కాళ్ల-42.6, ఆచంట-40.2, పాలకొల్లు- 35.2, నరసాపురం-32.4, భీమవరం-27.6, వీరవాసరం-22.2, యలమంచిలి-17.4, మొగల్తూరులో 8.6 పడింది. యనమదుర్రు డ్రెయిన్‌లో నీటి ఉద్ధృతి బాగా పెరిగింది. వానకు 1.54 ఎకరం విస్తీర్ణంలో ఉన్న తణుకు మత్స్యశాఖ కార్యాలయం, దాని ఆవరణలో చెరువులో అంగుళం ఉన్న 30 లక్షల సీడ్ కొట్టుకుపోయింది.

# పూడికతీత.. పనులు సాగదీత

బొబ్బిలి: పెద్దగెడ్డ జలాశయం నుంచి నీరు విడిచిపెట్టి సుమారు 15 రోజులు అవుతున్నా.. ఇంతవరకు శివారు ప్రాంతానికి సాగునీరు అందలేదు. ఈ జలాశయం నుంచి పాచిపెంట, సాలూరు, రామభద్రపురం మండలాలకు చెందిన 12 వేల ఎకరాలకు సాగునీరు అందాల్సి ఉంది. కాలువ చెంతనే ఉన్నా నీరు రాకపోవడంతో రైతులు తల్లడిల్లుతున్నారు. సకాలంలో పూడికతీత పనులు చేయక, కాలువల మరమ్మతులు చేపట్టక నీరు అందడం లేదు. నారుమడులు ఎండిపోవడంతో దూర ప్రాంతం నుంచి పైపులతో తెచ్చి తడుపుతున్నారు.కాలువలు అధ్వానం..

పెద్దగెడ్డ శివారు ప్రాంతాలైన రామభద్రపురం, కొట్టక్కి, తారాపురం, జన్నివలస, బూసాయివలస, ఇట్లామామిడిపల్లి, సోంపురం తదితర గ్రామాలకు చెందిన 3,100 ఎకరాలకు సాగునీరు అందాల్సిఉంది. ఇంతవరకు సెంటు భూమికి కూడా అందలేదు. పూడికతీత పనులు చేపట్టకపోవడంతో పనికిరాని మొక్కలు ఎక్కువగా పెరిగి ఉన్నాయి. రూ.20 లక్షల మేర నిధులు మంజూరైనా అధికారులు సకాలంలో పనులు చేయలేకపోయారు. పాచిపెంట, సాలూరు మండలాల్లో కూడా పూడికతీయలేదు. ప్రధాన కాలువ అధ్వానంగా ఉంది. పిల్ల కాలువల పరిస్థితి మరింత దారుణం.

చర్యలు తీసుకుంటాం.. - శ్రీనివాసరావు, డీఈ, పెద్దగెడ్డ

పెద్దగెడ్డ జలాశయం నుంచి సాగునీరు అందేలా చర్యలు తీసుకుంటాం. పూడికతీత పనులు జరుగుతున్నాయి. శివారు ఆయకట్టుకు నీరు వచ్చేలా చూస్తాం.

# బస్తాలు పరిచి.. బలోపేతం మరిచి..

కనిగిరి : వరుస వర్షాలతో మోపాడు దిగువ ప్రాంత వాసులు చిగురుటాకుల్లా వణుకుతున్నారు. గతంలో అర్ధరాత్రి వేళ కట్ట కొట్టుకుపోయి వందలాది మంది ప్రాణాలు గాల్లో కలిసిపోయాయి. ఆ సంఘటన నేటికీ అక్కడి వారికి కునుకు లేకుండా చేస్తోంది. పామూరు మండలంలోని మోపాడు జలాశయం గట్టు నేటికీ బలహీనంగా ఉండటం వారి ఆందోళనకు కారణం !

పామూరులోని మోపాడు జలాశయం వద్ద నేటికీ ప్రమాదకర పరిస్థితి నెలకొంది. గతంలో రిజర్వాయర్ నుంచి లీకేజీలు ఏర్పడ్డాయి. అప్పట్లో సాగునీటి పారుదల అధికారులు కష్టపడి అలుగును పెద్దది చేసి పైనుంచి వరద నీరు రిజర్వాయర్‌లోకి రాకుండా చేశారు. యుద్ధప్రాతిపదికన ఇసుక బస్తాలు వేసి లీకేజీలను తాత్కాలికంగా నిలువరించారు. నిధులు మంజూరు చేసి శాశ్వత రక్షణ కల్పిస్తామని ప్రజా ప్రతినిధులు, అధికారులు హామీ ఇచ్చినా కార్యరూపం దాల్చలేదు. నేటికీ నిధులు మంజూరు కాలేదు.వైకాపా హయాంలో.. : అవిగో నిధులు..ఇవిగో నిధులంటూ గత వైకాపా ప్రభుత్వ హయాంలో ప్రజాప్రతినిధులు హడావుడి చేశారు తప్ప మంజూరు చేయలేదని మోపాడు దిగువ ప్రాంత రైతులు వాపోతున్నారు. రూ. 2 కోట్లు ఇస్తామని చెప్పినా విడుదల చేయలేదు. కట్ట బలోపేతానికి ఇప్పటివరకూ పాలకులు ఎలాంటి చర్యలు తీసుకోలేదు. గత తెలుగుదేశం హయాంలో రూ.33 కోట్ల జైకా, ఇతర నిధులతో ప్రధాన కాల్వలు బాగు చేశారు. ఆ తర్వాత వచ్చిన పాలకులు కట్ట గట్టితనానికి ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో దిగువ గ్రామాల వారు భీతిల్లుతున్నారు. 1996 నాటి పరిస్థితి పునరావృతమైతే.. : వాస్తవంగా జలాశయం నిల్వ సామర్థ్యం 29 అడుగులు మాత్రమే. 2023 సంవత్సరంలో భారీ వర్షాలు, వరదలతో నీటిమట్టం 31 అడుగులకు చేరి కట్టకు లీకేజీలు రావడంతో స్థానికులు భయభ్రాంతులకు గురయ్యారు. 1996లో ఒక్కసారే కురిసిన భారీ వర్షాలకు రిజర్వాయర్ కట్ట తెగి 183 మంది వరదలో కొట్టుకుపోయి ప్రాణాలు కోల్పోయారు. అదే పరిస్థితి నెలకొంటే తమని ఆదుకునేదెవరని మోపాడు, కంభాలదిన్నె, బొట్ల గూడూరు, కమ్మవారిపాలెం, రేగిచెట్లపల్లి, లక్ష్మీనర్సాపురం ప్రజలు భయపడుతున్నారు. గత పరిణామాలను దృష్టిలో ఉంచుకుని వెంటనే నిధులు మంజూరుచేసి కట్టను గట్టిపర్చాలని వారు కోరుతున్నారు. ఈ విషయమై ఇరిగేషన్ డీఈ విజయభాస్కర్‌రెడ్డిని వివరణ కోరగా, ఎలాంటి నిధులు మంజూరు కాలేదన్నారు. గతంలో జైకా, ఇతర నిధులతో కాల్వల మరమ్మతులు, ఇతర పనులు చేపట్టారన్నారు.

# ఆలస్యమైనా ఆదరణ

శ్రీకాళహస్తి: వైకాపా మూసేసిన కళాశాలను కూటమి ప్రభుత్వం మళ్లీ అందుబాటులోకి తెచ్చింది. రెండో విడత దరఖాస్తుల స్వీకరణకు అవకాశం ఇవ్వడంతో పలువురు సద్వినియోగం చేసుకున్నారు. ఇంజినీరింగ్ విద్యార్థుల కోసం జేఎన్‌టీ విశ్వవిద్యాలయం శ్రీకాళహస్తిలో నూతనంగా ఏర్పాటు చేసిన శ్రీకాళహస్తీశ్వర ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (స్కిట్)కు కొంత మేర ఆదరణ లభించింది. ఇంజినీరింగ్ కళాశాలలో ప్రస్తుతం ఉన్న 330 సీట్లకు 68 సీట్లు భర్తీ చేసుకోవడం గమనార్హం. ఈ విద్యా సంవత్సరం నుంచే తరగతులు అందుబాటులోకి తేవాలని ప్రభుత్వం సంకల్పించింది. ఇందుకోసం పలు దఫాలు జేఎన్‌టీయూ యాజమాన్యంతో ప్రభుత్వం జరిపిన చర్చలు సఫలమయ్యాయి. తొలి విడత దరఖాస్తుల స్వీకరణకు అవకాశం అయ్యాక స్కిట్‌కు అనుమతులు వచ్చాయి. ప్రస్తుతం ఎక్కువగా డిమాండ్ ఉన్న కంప్యూటర్ కోర్సులను ప్రవేశపెట్టాలని నిర్ణయించింది. అందులో భాగంగా కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ (సీఎస్ఈ), ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ అండ్ మెషిన్ లెర్నింగ్ (సీఎస్ఎం), డేటా సైన్స్ (సీఎస్‌డీ), ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యునికేషన్ ఇంజినీరింగ్ (ఈసీఈ), ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజినీరింగ్




(ఈఈఈ) కోర్సులకు ఒక్కో విభాగానికి 66 సీట్లు వంతున 330 సీట్లు నిర్ణయించింది. ప్రస్తుతం రెండో విడత దరఖాస్తుల స్వీకరణల నేపథ్యంలో సీఎస్ఈ 33, సీఎస్ఎం 18, సీఎస్‌డీ 8, ఈసీఈ 7, ఈఈఈ 2 వెరసి 68 దరఖాస్తులు అందాయి.

**విద్యార్థులకు వరమే..:** ఈ విద్యా సంవత్సరం నుంచి తరగతుల ప్రారంభానికి అన్నీ ఏర్పాట్లు సిద్ధం చేస్తోంది. విద్యార్థినీ, విద్యార్థులకు వేర్వేరుగా వసతిగృహాలు అందుబాటులోకి తెస్తున్నారు. తరగతి గదులకు రంగులు వేసి అందంగా తీర్చిదిద్దారు. ఇందులో చేరే విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ ఉండటం, జేఎన్‌టీయూఏ సొంత కళాశాలలో చదివే అవకాశం లభించడం విద్యార్థులకు వరమని పాలకులు, నిర్వాహకులు అంటున్నారు.

# ఏవీ ముద్రలు.. తేలని లొసుగులు

అనంతపురం : పెట్రోలు, డీజిల్ కొనుగోలు సమయంలో వాహనదారులు నష్టపోకుండా కేంద్ర ప్రభుత్వం మార్గదర్శకాలు రూపొందించింది. వాటిని అమలు చేసే బాధ్యతలు తూనికలు, కొలతల శాఖ యంత్రాంగానికి అప్పగించింది. యంత్రం, పంపులు, నాజిల్ (గొట్టాలు) పరికరాలకు ఏడాదికోసారి ముద్ర వేయించాలని నిబంధన విధించారు. మీటరు బోర్డు, యంత్రంలో ఏదేని సాంకేతిక మరమ్మతు ఎదురైతే అధికారులకు సమాచారం అందించాలి. నిర్వాహకులు సొంతంగా ఎలాంటి మరమ్మతులు చేయించకూడదు. తూనికలు, కొలతల శాఖ అధికారులు తనిఖీ చేసి, అన్నీ బాగుంటే టాంపరింగ్ చేయకుండా బోర్డుకు సీలు వేస్తారు. అయితే ఈ ముద్రలు వేయించకుండా జిల్లాలో చాలాచోట్ల నిర్లక్ష్యం వహిస్తున్నారు. అధికారులు జరిపిన ఆకస్మిక



తనిఖీల్లో పలుచోట్ల నిబంధనలు ఉల్లంఘించినట్లు తేలింది.

**ఆకస్మిక తనిఖీ.. అపరాధ రుసుం**

ఉమ్మడి జిల్లాలో 2025 ఏప్రిల్ నుంచి జూన్ వరకు పలు బంకుల్లో సకాలంలో ముద్ర వేయించని 104 మంది యజమానులకు రూ.11.75 లక్షలు అపరాధ రుసుం విధించాం. బసవేశ్వర ఫిల్లింగ్ సెంటర్‌పై (ఓబుళాపురం)- రూ. 25 వేలు, ఏకలవ్య ఫిల్లింగ్ స్టేషన్ (తాడిపత్రి) రూ.25 వేలు, శివసాయి ఫిల్లింగ్ స్టేషన్ (తాడిపత్రి)- రూ.25వేలు, సిద్దలింగేశ్వర ఫిల్లింగ్ స్టేషన్ (బుక్కరాయసముద్రం) రూ. 25 వేలు అపరాధ రుసుం విధించాం. లొసుగులు ఉన్నట్లు గమనిస్తే.. చరవాణి నంబరు 98490 95707కు ఫిర్యాదు చేయవచ్చు.

తూనికలు, కొలతల శాఖ అసిస్టెంట్ కంట్రోలరు సుధాకర్

# ముంచుకొచ్చినా.. పూడిక తీయరు..!

రాజమహేంద్రవరం: జిల్లాలో వర్షాలు జోరుగా పడుతున్నాయి. కాలువలు పొంగిపొర్లుతున్నాయి. పల్లపు ప్రాంతాలు నీట మునుగుతున్నాయి. కాలువల్లో పూర్తి స్థాయిలో పూడిక తొలగించకపో వడంతో ముంపు తీవ్రత ఎక్కువగా ఉంది. వేసవిలో చేపట్టిన పనులు నామమాత్రంగా ఉండటంతో పూడిక పెరిగిపోయింది. ఏటా వీటి కోసం ప్రత్యేక బడ్జెట్ కేటాయిస్తారు. ఆయా పురపాలికల్లో సిబ్బంది కొరతతో ఈ పనులు జరగడం లేదు. రాజమహేంద్రవరం, కాకినాడ నగరపాలక సంస్థ పరిధిలోని ప్రధాన కాలువల్లో నిత్యం వ్యర్థాలు మేట వేస్తున్నాయి. పెరుగుతున్న జనాభా, అవసరాలకనుగుణంగా కాలువల విస్తరణ లేకపోవడంతో ఇబ్బందికర పరిస్థితులు ఏర్పడుతున్నాయి. చిన్న పురపాలికల్లో కూడా ఇదే పరిస్థితి నెలకొంది. ఒకప్పుడు నాలుగైదు చోట్ల ముంపు సమస్య ఉంటే, ప్రస్తుతం అంతకు రెండింతలు ఉండటం గమనార్హం.

# ఎర్రమట్టి కొండలు తరిగిపోతున్నాయ్



శింగనమల : కొండలు తవ్వి ఎర్రమట్టిని యథేచ్ఛగా అమ్మేస్తున్నారు. ఫలితంగా ఎర్రమట్టి వ్యాపారం జోరుగా సాగుతోంది. శింగనమల, నార్పల, గార్లదిన్నె, బుక్కరాయసముద్రం ఎర్రమట్టి కొండలు తరిగిపోతున్నాయి. మట్టి తవ్వకాలను అడ్డుకొనేందుకు ఏర్పాటు చేసిన మైనింగ్ అధికారుల తనిఖీ కేంద్రాల ముందే వాహనాలు వెళుతున్నా పట్టించుకోవడం లేదన్న ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి.

**నేలమట్టం చేస్తూ...**

శింగనమల మండలం కొరివిపల్లి వద్ద జేసీబీలతో మట్టి తవ్వకాలు చేస్తున్నారు. నాగులగుడ్డం సమీప కొండలాల్లోనే ఇదే తంతు సాగుతోంది. నార్పల మండలంలోని పులసలనూతల, మూగేతిమ్మంపల్లి, నడిమిదొడ్డి, నాయనపల్లి, చామలూరు గ్రామాల కొండల్ని వదలడం లేదు. గార్లదిన్నె మండలం కల్లూరు వద్ద శింగారప్ప కొండలో మట్టి తవ్వకాలతో రూ.లక్షలు గడిస్తున్నారు. బుక్కరాయసముద్రం మండలం దయ్యాలకుంటపల్లి, బొమ్మలాటపల్లి, రెడ్డిపల్లి గ్రామాల్లో జోరుగా తవ్వకాలు జరుపుతున్నారు. కొండల్ని కొల్లగొట్టడమే కాకుండా పచ్చని చెట్లను తొలగిస్తున్నారు. నిత్యం పదుల సంఖ్యలో ట్రాక్టర్లలో మట్టితరలుతోంది. **రూ.లక్షల్లో అక్రమార్జన**

నియోజకవర్గంలోని అనేక గ్రామాల్లో కొందరు ఎర్రమట్టిని వ్యాపారంగా మార్చుకొన్నారు. ఇళ్ల నిర్మాణాలకు, పునాదులు పూడ్చేందుకు, రియల్‌ఎస్టేట్ వ్యాపారులకు విక్రయిస్తున్నారు. నిత్యం పదుల సంఖ్యలో ట్రాక్టర్లు, టిప్పర్ల ద్వారా మట్టిని తరలిస్తున్నారు. ఒక ఎర్రమట్టి ట్రాక్టర్ రూ.వెయ్యి, టిప్పరు రూ.5 వేలకు విక్రయిస్తున్నారు. ఫలితంగా నిత్యం రూ.లక్షల్లో అక్రమార్జన సాగుతోంది.

నార్పలలో ఉదయం నుంచి సాయంత్రం వరకు ట్రాక్టర్‌లు తిరుగుతూనే ఉంటాయి. అత్యంత రద్దీగా ఉన్న సర్కిల్ గుండా వాహనాలు వెళుతున్నా ఎవరికీ పట్టడం లేదు.

**ఎవరికీ అనుమతులు లేవు..**

– అరుణకుమారి, తహసీల్దారు, నార్పల

కొండల్లో మట్టిని తవ్వేందుకు ఎవరికీ ఎలాంటి అనుమతులు ఇవ్వలేదు. ప్రభుత్వ భూముల్లో మట్టి తవ్వుకునేందుకు ఎవరికీ హక్కు లేదు. క్షేత్రస్థాయిలో పరిశీలిస్తాం. నిబంధనలకు విరుద్ధంగా తవ్వకాలు జరిపితే తగిన చర్యలు తీసుకుంటాం.

# చెరువులకు జలకళ




అనంతపురం : విస్తారంగా కురుస్తున్న వానలతో పల్లెలు ఆనందంతో ఉప్పొంగిపోతున్నాయి. గడిచిన రెండు మాసాల్లో వరుణుడు కరుణించలేదు. ఈనెలలో సాధారణ వర్షపాతానికి రెట్టింపు స్థాయిలో కురవడంతో అన్నదాతల మోములో చిరునవ్వు విరబూస్తోంది. ఉమ్మడి జిల్లాలో మొత్తం 1487 చెరువులు ఉంటే.. ఏకంగా 5.189 టీఎంసీలు నిల్వ ఉండటం గమనార్హం. ఎక్కడికక్కడ కుంటలు, చెక్‌డ్యాంల్లోనూ వర్షపు నీరు నిల్వ ఉండటంతో భూగర్భ జలమట్టం సైతం పెరిగింది. దీంతో వాటి పరిధిలోని ఆయకట్టు సాగుకు మార్గం సుగమమైంది. త్వరలోనే హంద్రీనీవా, హెచ్చెల్సీ జలాలతో చెరువులను నింపే అవకాశం ఉంది. గతంలో ఎన్నడూ లేనివిధంగా ఈసారి చెరువులను నింపడానికి ప్రాధాన్యం ఇవ్వనున్నారు.

**18 చోట్ల నిండాయి**

మొత్తం 514 చెరువుల్లోకి నీరు వచ్చింది. ఇందులో వంద శాతం భర్తీ అయిన చెరువుల్లో అనంతలో పది, శ్రీసత్యసాయిలో ఎనిమిది ప్రకారం ఉన్నాయి. అనంత జిల్లాలో అనంత గ్రామీణ మండలంలో రెండు, వజ్రకరూరులో మూడు, గుత్తి, గుంతకల్లు, పామిడి, విడపనకల్లు, తాడిపత్రిలో ఒక్కొక్కటి ఉండగా... శ్రీసత్యసాయిలో సీకేపల్లి, గాండ్లపెంటలో నాలుగు ప్రకారం, ఎన్‌పీ కుంట, ముదిగుబ్బ, బుక్కపట్నం, గోరంట్లలో ఒక్కొక్కటి చొప్పున ఉన్నాయి. 75 శాతం మేర పూర్తయిన చెరువులు 29... 50 శాతం నిండినవి 89.. 25 శాతం మేర నీరున్నవి 378 ఉన్నాయి. వాన నీరు భూమిలోకి కొంతమేర ఇంకడం సహజమే. దీని ప్రకారం చూస్తే.. జూన్ నుంచి ఆగస్టు ఒకటో తేదీ దాకా 65.46 టీఎంసీలు భూమిలో నిల్వ ఉన్నట్లే. అనంత జిల్లాలో 33.67 టీఎంసీలు, శ్రీసత్యసాయి జిల్లాలో 31.79 టీఎంసీలు ఉన్నాయి. ప్రస్తుతం అనంత జిల్లా సగటు భూగర్భ నీటి మట్టం 11.01 మీటర్లు, శ్రీసత్యసాయిలో 12.75 మీటర్ల మేర ఉంది.

వర్షపాతం విషయానికి వస్తే.. జూన్ నుంచి ఆగస్టు 14వ తేదీ నాటికి అనంత జిల్లా సాధారణ వర్షపాతం 160.29 మి.మీ ఉండగా.. ఇప్పటి దాకా 233.98 మి.మీ వర్షం కురిసింది. శ్రీసత్యసాయిలో 179.63 మి.మీకుగాను ఏకంగా 219.62 మి.మీ వర్షపాతం నమోదైంది.

# సెలవైతే.. కొల్లగొట్టుడే!



అనకాపల్లి : 'వరుసగా ప్రభుత్వ సెలవులొస్తే చాలు గ్రావెల్ బేరాలొప్పుకుంటారు. రెండు బ్యాచ్‌లుగా విడిపోయి.. రాత్రి, పగలు రెండు పూటలా దొరికిన కొండనల్లా కొల్లగొడుతున్నారు. చెరువులు, కొండవాలు ప్రాంతాలని తేడా లేకుండా చెరిచేస్తున్నారు.' .. ఇదీ సబ్బవరం మండలంలో చీకటి గ్రావెల్ దందా! ఈ ప్రాంతంలోని కొంతమంది మట్టి అక్రమ రవాణానే వ్యాపారంగా చేసుకుని కార్యకలాపాలు సాగిస్తున్నారు. ఈ కారణంగా రహదారులు పాడవుతున్నాయని స్థానికులు మొత్తుకుంటున్నా ఎవరూ చెవికెక్కించుకోవడం లేదు. తవ్వకందారులతో స్థానిక నేతలు కలిసిపోయి చెరువులు, కొండలను ధ్వంసం చేస్తున్నారు.

సబ్బవరం పరిసర ప్రాంతాల్లో స్థిరాస్తి వ్యాపారం జోరుగా సాగుతోంది. లేఅవుట్లు, ఇళ్ల నిర్మాణాలకు మట్టి, గ్రావెల్‌కి డిమాండ్ బాగా పెరిగింది. గొల్లలపాలెం, తంగిరాలపాలెం, ఎదురునెరవ, గంగవరం, ఒమ్మివానిపాలెం, బాటజంగాలపాలెం తదితర గ్రామాలకు సమీపంలో చెరువులు, కొండవాలు ప్రాంతాలు ఉన్నాయి. మామూలు రోజుల్లో స్తబ్దుగా ఉంటున్న అక్రమార్కులు వరసగా ప్రభుత్వ సెలవు దినాలు రాగానే రెచ్చిపోతున్నారు. ఎంతమేర గ్రావెల్, మట్టి కావాలో ముందే అడ్వాన్సులు తీసుకుని రాత్రివేళ భారీ యంత్రాలతో తవ్వకాలు సాగిస్తున్నారు.

అసకపల్లి వజ్రాల కొండ చుట్టూ కొండవాలు ప్రాంతంలో తవ్వకాలు చేస్తున్నారు. కొద్ది రోజుల క్రితం స్థానికులు అడ్డుకుని, అధికారులకు ఫిర్యాదులు చేసినా పట్టించుకోలేదు. ప్రస్తుతం గంగవరం సమీపంలోని కొండవాలు ప్రాంతంలో అక్రమార్కుల కన్ను పడింది. ఇక్కడ సమీపంలో లేఅవుట్ వేస్తున్నారు. కొన్ని రోజులుగా రాత్రివేళ కొండను కొల్లగొట్టి గుట్టుగా తరలిస్తున్నారు.

**అక్రమంగా తవ్వితే చర్యలు..** చెరువులు, ప్రభుత్వ స్థలాలు, కొండవాలు ప్రాంతాల్లో మట్టి తవ్వకాలకు ఎలాంటి అనుమతులు ఇవ్వలేదు. సబ్బవరంలో తవ్వకాలు జరగకుండా నిరంతరం నిఘా ఉంచాలని రెవెన్యూ అధికారులకు చెప్పాం. రాత్రి వేళల్లోనూ నిఘా ఉంచుతాం. ప్రభుత్వ స్థలాల్లో నిబంధనలకు విరుద్ధంగా తవ్వకాలు చేస్తే.. చర్యలు తీసుకుంటాం.

శ్రీనివాస్, ఏడీ మైనింగ్, అనకాపల్లి

# ధర ఉన్నా.. నాణ్యత లేక

పలమనేరు : పట్టు రైతుల పరిస్థితి వైకుంఠపాళిని తలపిస్తోంది. ధర ఉంటే.. పంట ఉండదు. పంట ఉంటే ధర ఉండకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుతం పట్టుగూళ్ల ధరలు ఆశాజనకంగా ఉన్నా.. వర్షాల కారణంగా దిగుబడి పడిపోయింది. వాతావరణంలో తేమశాతం ఎక్కువగా ఉండటంతో గూళ్ల నాణ్యత అంతగా లేదని వాపోతున్నారు. జిల్లాలో ప్రధానంగా పలమనేరు, కుప్పం నియోజకవర్గాల్లో 10 వేల హెక్టార్లలో రైతులు మల్బరీ సాగు చేస్తున్నారు. సాగులో నష్టాలు చూస్తుండటంతో చాలా మంది ఉద్యాన పంటల వైపు మొగ్గు చూపుతున్నారు. దాంతో మల్బరీ విస్తీర్ణం సైతం గణనీయంగా తగ్గింది. గతంలో పలమనేరు నియోజకవర్గంలో 15 వేల ఎకరాల్లో మల్బరీ సాగు ఉండగా.. ప్రస్తుతం 6 - 7 వేల హెక్టార్లకు పడిపోయింది.

**పెరిగిన పట్టుగూళ్ల ధరలు**మార్కెట్‌లో గత నెల కిలో పట్టు గూళ్లు రూ.500 ధర పలికింది. అంతకు ముందు రూ.300 - రూ.400 ఉంది. ప్రస్తుతం రూ.636 నుంచి రూ.700 ధర పలుకుతోంది.



దిగుబడి మాత్రం లేదని రైతులు సతమతమవుతున్నారు. గతంలో మార్కెట్‌కు రోజుకు ఏడు నుంచి 10 టన్నుల వరకు పట్టుగూళ్లు రాగా ప్రస్తుతం రోజుకు 1,025 కిలోలు మాత్రమే వస్తోంది. ఈ విషయమై మార్కెట్ అధికారి అనిల్ కుమార్‌ను సంప్రదించగా.. మార్కెట్‌కు ప్రస్తుతం తక్కువ గూళ్లు వస్తున్నాయని.. వచ్చిన వాటిలోనూ నాణ్యత లేక ధర పలకడం లేదని చెప్పారు.

**ఆకు మాత్రం అమ్ముకుంటున్నా..**

నేను ఏడెకరాల్లో మల్బరీ సాగు చేశా. ప్రస్తుతం పట్టుగూళ్లకు ధర వచ్చింది. పంట మాత్రం రావడం లేదు. వర్షాలకు పట్టుగూళ్లు దెబ్బతినడంతో నాసిరకం గూళ్లు వస్తున్నాయి. వీటికి మార్కెట్‌లో పెద్దగా ధర పలకడం లేదు. అందుకే పండించిన మల్బరీ ఆకును ఇతర రైతులకు విక్రయిస్తున్నా. బాబు, పట్టు రైతు, పలమనేరు

# పల్లె ప్రగతికి మార్గం

కర్నూలు :కోడువరు మండలం బైనదొడ్డి గ్రామానికి ఇటీవల పూర్తి చేసిన సీసీరోడు ఈ ఊరికి ఇన్నేళ్లు నేరుగా రహదారి లేదు. ఇతర గ్రామాలకు వెళ్లాలన్నా.. ఇతరులు ఈ పల్లెకు రావాలన్నా వర్కూరు- మెరుగుదొడ్డి రోడ్డు నుంచి అర కిలోమీటరుకు పైగా నడిచి వెళ్లాల్సి వచ్చేది. వర్షాలు పడినప్పుడు.. అత్యవసర సమయంలో నరకం అనుభవించాల్సి వచ్చేదని గ్రామస్థులు గుర్తు చేసుకుంటున్నారు. ప్రస్తుతం గ్రామానికి రూ.40 లక్షల ఉపాధి నిధులతో 0.60 కి.మీ సీసీరోడ్డు వేయడంతో బైనదొడ్డి వాసులు కూటమి ప్రభుత్వానికి కృతజ్ఞతలు చెబుతున్నారు. దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించి 78 ఏళ్లు పూర్తయినా జిల్లాలోని పలు గ్రామాలకు రహదారి సౌకర్యం లేదు.



కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఇలాంటి పల్లెలకు రవాణా వసతి కల్పించేందుకు చర్యలు చేపట్టింది. రోడ్డు వసతి లేని 24 గ్రామాలకు 14 కి.మీ రహదారులు నిర్మించేందుకు కూటమి ప్రభుత్వం రూ.18.02 కోట్ల ఉపాధిహామీ నిధులు మంజూరు చేసింది. పల్లె పండగలో భాగంగా ఇప్పటి వరకు 14 గ్రామాలకు రహదారులు పూర్తి చేశారు.

**కూటమి ప్రభుత్వానికి కృతజ్ఞతలు**

'మా గ్రామాలకు రోడ్డు వసతి కల్పించిన కూటమి ప్రభుత్వానికి, కలెక్టర్, పంచాయతీరాజ్ ఇంజినీర్లకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నామని గూడూరు, కోడువరు, హొళగుంద, గోనెగండ్ల, పత్తికొండ, తుగ్గలి మండలాల పరిధిలోని 14 గ్రామాల ప్రజలు పేర్కొన్నారు. 14 గ్రామాల ప్రజలు గురువారం కర్నూలు కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో కలెక్టరు రంజిత్‌బాషాను కలిసి సన్మానించారు. పీఆర్ ఇన్‌ఛార్జి ఎస్ఈ మద్దన్న, డ్వామా పీడీ వెంకటరమణయ్య, విశ్రాంత ఎస్ఈ రామచంద్రారెడ్డి, డీఈఈలు శ్రీనివాసులు, కర్రెన్న, శేషయ్య, ఏఈఈ ముక్తార్‌బాషా పాల్గొన్నారు.

# ఇక లెక్క పక్కా..

పుత్తూరు : స్వయం సహాయక సంఘాలకు సంబంధించి ఆర్థిక కార్యకలాపాలన్నీ ఇక నుంచి పక్కాగా జరగనున్నాయి.. ఈ మేరకు కూటమి ప్రభుత్వం 'మన డబ్బులు-మన లెక్కలు' పేరిట ప్రత్యేక యాప్‌ను ఈ నెల 16 నుంచి అందుబాటులోకి రానున్నట్లు అధికారులు వెల్లడించారు.. ఇప్పటివరకు బ్యాంకులకు చెల్లిస్తున్నా నోటీసులు రావడం, సిబ్బంది చేతివాటం, సభ్యుల పేరిట అక్రమంగా రుణాలు పొందడం తదితర అవకతవకలు జరిగేవి.. ఈ యాప్ అందుబాటులోకి వస్తే ఇవన్నీ ఇకపై జరగవు.

**ఉమ్మడి చిత్తూరు జిల్లాలో..**ఉమ్మడి చిత్తూరు జిల్లాలో మొత్తం 678 వీవోలు ఉండగా.. తొలుత ఎంపిక చేసిన వీవోల పరిధిలో అమలు చేస్తారు. యాప్‌లో సంఘాలకు చెందిన వివరాలన్నీ అప్‌లోడ్ చేస్తారు. సభ్యులకు చెందిన ప్రత్యేక ఐడీతో నమోదయ్యేలా చూస్తారు. పాస్‌వర్డ్ సాయంతో ఎప్పటికప్పుడు వివరాలు చూసుకోవచ్చు. లావాదేవీలన్నీ కనిపిస్తాయి. సంఘ వివరాలు సైతం తెలుసుకోవచ్చు. మరో వైపు సమాచారం అప్‌డేట్‌లో భాగంగా ఇప్పటికే మెప్మా పరిధిలోని సంఘాలను ఆడిట్ చేశారు. దీంతో పారదర్శకంగా సేవలు అందనున్నాయని మెప్మా పీడీ రవీంద్ర పేర్కొన్నారు.

# అ'ధన'పు వెలుగులు

కర్నూలు : విద్యుత్తు అదనపు లోడు క్రమబద్ధీకరణకు ఆ శాఖ 50 శాతం రాయితీ ప్రకటించడంతో వినియోగదారుల నుంచి మంచి స్పందన లభించింది. మార్చి 1 నుంచి జూన్ 30వ తేదీ వరకు దరఖాస్తులు ఆహ్వానించింది. పెద్ద సంఖ్యలో వినియోగదారులు ముందుకొచ్చారు. నిర్ణీత రుసుము చెల్లించి దరఖాస్తు చేసుకున్నారు. ఉమ్మడి జిల్లాలో మొత్తం 7,673 విద్యుత్తు కనెక్షన్లకు సంబంధించి 10,427 కిలోవాట్ల అదనపు లోడు పెంచాలంటూ రూ. 1,26,11,850 మేర నగదు జమ చేశారు.


**పెరిగిన విద్యుత్తు వినియోగం**

కొత్తగా విద్యుత్తు కనెక్షన్ మంజూరు నిమిత్తం గ్రామాల్లో కనీసం ఒక కిలోవాట్, పట్టణాల్లో 2 కిలోవాట్ల చొప్పున దరఖాస్తు చేయిస్తున్నారు. పదేళ్ల కిందట గృహాల్లోని ఎలక్ట్రానిక్స్ పరికరాల వినియోగం ఆధారంగా 0.5 కిలోవాట్ లోడుకు మాత్రమే రుసుం చెల్లించేవారు. కాలక్రమేణా ఎలక్ట్రానిక్ వస్తువుల వినియోగం పెరుగుతోంది. ప్రత్యేకించి ఏసీల వాడకం విపరీతంగా పెరగడంతో పల్లెలు, పట్టణాలన్న తేడా లేకుండా లోవోల్టేజీ సమస్య వేధిస్తోంది. దీంతో తరచూ విద్యుత్తు అంతరాయాలు ఏర్పడుతున్నాయి. ఇందుకనుగుణంగా అవసరమైన చోట నియంత్రికలు ఏర్పాటు చేయడంలో జాప్యం జరుగుతోంది.

**నియంత్రికల ఏర్పాటుకు మార్గం**

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా విద్యుత్తు అధికారులు నిరంతరం తనిఖీలు చేస్తూ అదనపు లోడు రుసుం విధిస్తున్నారు. దీంతో కొందరు వినియోగదారులు పునః పరిశీలనకు వినియోగదారులు అర్జీలు సమర్పిస్తున్నారు. మరి కొందరు రుసుం చెల్లించడంలో ఆలస్యం చేస్తున్నారు. ఈ కారణాలతో అదనపు లోడు తట్టుకునేలా అధిక సామర్థ్యమున్న నియంత్రికల ఏర్పాటు చేసేందుకు నిధులు కొరత వేధిస్తోంది. తాజాగా దరఖాస్తు రూపంలో నిధులు సమకూరడంతో నాణ్యమైన విద్యుత్తును అందించేందుకు అవసరమైన చోట నూతన నియంత్రికలు ఏర్పాటు చేయనున్నారు.

**రాయితీతో పెరిగిన స్పందన**



ఇళ్లలోని ఫ్యాన్లు, ఏసీలు, టీవీలు, వాషింగ్ మెషీన్లు, ఇతర పరికరాలకు వినియోగిస్తున్న విద్యుత్తు ఆధారంగా లోడు అంచనా వేసి దాన్ని కిలోవాట్లలో లెక్కిస్తారు. కిలోవాట్‌కు విద్యుత్తు శాఖకు సెక్యూరిటీ డిపాజిట్ రూ. 200, దరఖాస్తుకు రూ. 50, డెవలప్‌మెంట్ ఛార్జీగా రూ. 2 వేలు చెల్లించాలి. అంటే అదనంగా కిలోవాట్ విద్యుత్తు పొందాలంటే రూ. 2,250 రుసుము చెల్లించాల్సి ఉంటుంది. అయితే డెవలప్‌మెంట్ ఛార్జీలో 50 శాతం రాయితీ ప్రకటించారు. ఒక్కో కిలోవాట్‌కు రూ. 1250 చొప్పున వసూలు చేశారు. ఎంత అదనపు లోడు క్రమబద్ధీకరించుకున్నా 50 శాతం రాయితీ ఇచ్చారు. దీంతో చాలామంది స్వచ్ఛందంగా ముందుకొచ్చి రుసుము చెల్లించారు.

దీనికితోడు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సూర్యఘర్ పేరుతో సౌర ఫలకాల ఏర్పాటుకు ప్రోత్సాహకం ఇస్తోంది. ఈ పథకం కింద సౌర ఫలకాలు ఏర్పాటు చేసుకునే వారు ఇంట్లో విద్యుత్తు లోడు ఎన్ని కిలోవాట్లు ఉంటే అంతే సామర్థ్యంతో సౌర విద్యుత్తు యూనిట్‌ను ఏర్పాటు చేసుకోవాల్సి ఉంటుంది. ఈ నేపథ్యంలో చాలామంది వినియోగదారులు సోలార్ యూనిట్లను దృష్టిలో పెట్టుకుని లోడు పెంపునకు దరఖాస్తు చేసుకుంటున్నారు. దీంతో సంస్థకు మరింత ఆదాయం సమకూరుతోంది.

సర్వీసులు 2,408
అదనపు లోడు (కిలోవాట్లు) 3,471
ఆదాయం(రూ.ల్లో) 42,30,850

# ఉత్సవం వస్తోంది.. 'ఉరు'కులు పెట్టాలి



మంత్రాలయం : నెలరోజుల ఉత్సవం.. ఐదు రాష్ట్రాల భక్తులు.. ఇసుకేస్తే రాలనంత జనం.. ఉరుకుంద శ్రీ నరసింహ ఈరన్న స్వామి సన్నిధి కిటకిటలాడుతుంటుంది.. ప్రసిద్ధి గాంచిన ఈ పుణ్యక్షేత్రం శ్రావణమాస ఉత్సవాలకు సిద్ధమైంది.. ఈనెల 25 నుంచి నెల రోజుల పాటు జరిగే ఉత్సవాలకు ఆంధ్ర, కర్ణాటక, తెలంగాణ, మహారాష్ట్ర, తమిళనాడు తదితర ప్రాంతాల నుంచి లక్షలాదిగా భక్తులు తరలొస్తారు. వారొచ్చే బాటలు నలుదిక్కులూ బాగా లేవు.. అడుగడుగునా గుంతలతో నిండిపోవడంతో ప్రయాణికులకు ఇబ్బందులు తప్పేలా లేవు. ఆలయానికి ఏడాదికి రూ. 12 నుంచి రూ. 15 కోట్ల ఆదాయం వస్తోంది.. పశ్చిమ ప్రాంత వాసుల ఇంటి దేవుడి కోవెలకు వెళ్లి మొక్కుతీర్చుకోవడానికి 'మార్గం'సుగమం చేయాలని భక్తజనం విన్నవిస్తోంది.

**నలుదిక్కులా గుంతలే**

ఆలయానికి ప్రధానంగా ఆదోని నుంచి ఎరిగేరి, కామవరం మీదుగా చేరుకుంటారు. తెలంగాణ, కర్ణాటకలోని రాయచూరు, గుల్బర్గా తదితర ప్రాంతాల నుంచి వచ్చేవారు మాధవరం, కోసిగి మీదుగా ఉరుకుందకు వస్తారు. బళ్లారి, సిరుగుప్ప, సింధనూరు తదితర ప్రాంతాల నుంచి కౌతాళం మీదుగా చేరుకుంటారు. మాన్వి, సిరవార, దేవదుర్గ తదితర ప్రాంతాల వారు కౌతాళం మండలంలోని కుంబళనూరు వద్ద తుంగభద్ర నదిని దాటి హాల్వి గ్రామం మీదుగా ఉరుకుందకు చేరుకుంటారు. ఆలయానికి నలువైపులా ఉన్న రహదారుల నుంచి భక్తులు వాహనాలు, బస్సుల్లో వేలాదిగా తరలొస్తారు.

ఆదోని-ఉరుకుంద మార్గంలో ఎరిగేరి నుంచి ఉరుకుంద-హాల్వి వరకు 18.2 కి.మీ రహదారి నిర్మాణానికి 2020లో పుష్కరాల సందర్భంగా రూ. 4 కోట్లు మంజూరయ్యాయి. ఇంతవరకు ఎలాంటి పనులు చేపట్టలేదు. దీంతో ఈ రహదారిలో అడుగడుగునా గుంతలే ఏర్పడ్డాయి. ఇటీవలే కూటమి ప్రభుత్వం మరమ్మతులు చేపట్టినా.. మళ్లీ గుంతలమయంగా మారాయి.

హాల్వి-ఉరుకుంద, ఉరుకుంద-కౌతాళం, ఉరుకుంద-ఆదోని గ్రామాల మధ్య రహదారులు గుంతలమయంగా మారాయి. హాల్వి రహదారిలో అడుగడుగునా గుంతలే దర్శనమిస్తున్నాయి.

ఉరుకుంద-కోసిగి రహదారి అనేక మలుపులు, ఇరువైపులా పంటపొలాలు ఉండటంతో ఒక వాహనమే వెళ్లడానికి వీలుంది. ఎదురెదురుగా మరో వాహనం వస్తే రాకపోకలు స్తంభిస్తాయి. గతంలో ఆదోని-ఉరుకుంద రహదారిలో గుంతల్లో వాహనాలు అదుపుతప్పి పలువురు భక్తులు గాయపడగా, ఓ వృద్ధుడు మరణించారు.

# గాజులదిన్నె నింపితేనే గడపకు నీరు



కర్నూలు : హంద్రీనీవా సుజల స్రవంతి(హెచ్ఎన్ఎస్ఎస్) కాల్వ వస్తున్న నీటిని గాజులదిన్నెకు ఎప్పటి నుంచి మళ్లిస్తారన్నది చర్చనీయాంశంగా మారింది. తుంగభద్ర డ్యాంలో 80 టీఎంసీలకు మించి నీటిని నిల్వ చేయలేం.. ఎల్లెల్సీకి రబీకి నీటిని విడుదల చేయమని తుంగభద్ర బోర్డు అధికారులు అధికారికంగానే ప్రకటించారు. దీంతో సుంకేసుల జలాశయంలో తగినంత నీటిని నిల్వ చేసే పరిస్థితి ఉండదని తేల్చారు. ఈ నేపథ్యంలో కర్నూలు నగరంలో నివసిస్తున్న సుమారు 6.5 లక్షల మందికి సుంకేసుల నుంచి తాగునీరు అందించడం సవాలుగా మారనుంది. దీన్ని అధిగమించడానికి గాజులదిన్నెలో నీటిని నిల్వ చేసుకుని వచ్చే వేసవిలో వినియోగించుకోవాలని తీర్మానించారు.

**పెండింగు పనులు పూర్తయితే..**

గాజులదిన్నె ప్రాజెక్టు సామర్థ్యాన్ని 4.5టీఎంసీల నుంచి 5.5 టీఎంసీలకు పెంచే పనులను రూ. 57.35కోట్లతో చేపట్టారు. ఇంకా 476.19ఎకరాల భూమిని సేకరించాల్సి ఉంది. రైతులకు పరిహారం చెల్లించలేదు. తాజాగా హెచ్ఎన్ఎస్ఎస్ నుంచి పుష్కలంగా నీరు వస్తున్న నేపథ్యంలో పెండింగు పనులు పూర్తిచేయాలి.

**హంద్రీ వస్తోంది.. అప్రమత్తం కావాలి**

హంద్రీనీవా కాల్వలో 3,850 క్యూసెక్కులు ప్రవహించేలా విస్తరించారు. తాజాగా నీటిని విడుదల చేశారు. హంద్రీనీవా కాల్వ నుంచి గాజులదిన్నె జలాశయానికి వెళ్లే కాలువ ప్రవాహ సామర్థ్యం 300 క్యూసెక్కులే. 114 రోజుల పాటు నీటిని తరలిస్తే గానీ జలాశయానికి మూడు టీఎంసీల నీరు వచ్చే పరిస్థితి లేదు. ప్రస్తుతం జలాశయంలో 1.6 టీఎంసీల నీరుంది. మొత్తం సామర్థ్యం 4.5 టీఎంసీలు. ఇప్పటి నుంచే నీటిని తరలిస్తేనే వచ్చే వేసవికి తాగునీటిని పూర్తిస్థాయిలో నిల్వచేసుకునే వెసులుబాటు కలుగుతుంది.

ఇటీవల జరిగిన నీటిపారుదల సలహామండలి సమావేశంలో జిల్లా కలెక్టర్ రంజిత్‌బాషా కూడా అధికారులను అప్రమత్తం చేశారు. నగర అవసరాలకు తగినట్లుగా గాజులదిన్నె ప్రాజెక్టులో నీటిని నిల్వ చేయాలని ఆదేశాలు ఇచ్చారు. అయినప్పటికీ అధికారులు ఎలాంటి చర్యలు చేపట్టాలన్నది ఇంకా ఖరారు చేయలేదు. వాస్తవానికి జలవనరుల శాఖ, కార్పొరేషన్ అధికారులు సమావేశం ఏర్పాటు చేసుకుని ప్రభుత్వపరంగా చేయాల్సిన ముందస్తు ఏర్పాట్లపై చర్చించుకోవాల్సి ఉండగా ఆ దిశగా ఏమాత్రం ఆలోచించడంలేదు.

# పండ్ల తోటలకు 'ఉపాధి' గొడుగు



నంద్యాల : ఇప్పటి వరకు ఉపాధి హామీ పనుల్లో మట్టి పనులకు ప్రాధాన్యమిచ్చిన అధికారులు పండ్ల తోటల సాగుకు ప్రోత్సాహం అందించాలని నిర్ణయించారు. రైతుల పొలాలు, చెరువు గట్లు, ఖాళీ స్థలాలు, రహదారుల ఇరువైపులా మొక్కలు నాటాలని ప్రణాళిక రూపొందించారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 9,000 ఎకరాల్లో పండ్ల తోటలు పెంచాలని డ్వామా లక్ష్యంగా నిర్ణయించుకుంది. కర్నూలు జిల్లాలో 4,500 ఎకరాలు, నంద్యాలలో 4,500 ఎకరాల్లో పెంచేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. ఈ జాబితాలో కొబ్బరి, మామిడి, నిమ్మ, జామ, చీనీ, సపోటా, నేరేడు, మునగ తోటలు ఉన్నాయి. ఉమ్మడి జిల్లాలోని 53 మండలాల్లో తోటల సాగు లక్ష్యంగా నిర్ణయించుకున్నా.. మెట్ట ప్రాంతాల్లో తొలి ప్రాధాన్యం ఇవ్వనున్నారు.

**నీటి వనరుల గట్లపై..**

గ్రామాల్లోని చెరువులు, జలాశయాల గట్లపైన కొబ్బరి మొక్కల పెంపకానికి ప్రణాళికలు రూపొందించారు. మైనర్ ఇరిగేషన్ చెరువుల వివరాలు సేకరించి అక్కడి పరిస్థితులను పరిశీలిస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో 100 చొప్పున ఎకరాల్లో అవెన్యూ ప్లాంటేషన్ ఏర్పాటు చేయనున్నారు. అదేవిధంగా ఒక్కో 50 కి.మీ. పొడవునా రహదారుల వెంట నీడనిచ్చే మొక్కలు పెంచనున్నారు. ఒక్కొక్క జిల్లాలో 30 సంస్థల్లో పండ్ల మొక్కలు పెంచనున్నారు. చుట్టూ ప్రహరీ ఉండి రక్షణకు అనువుగా ఉండే ప్రభుత్వ పాఠశాలలు, కార్యాలయాల్లో వీటిని పెంచనున్నారు.

**మహిళా సంఘాలకు బధ్యతలు**

మొక్కల సంరక్షణ బాధ్యతను స్వయం సహాయక సంఘాల సభ్యులకు అప్పగించాలని నిర్ణయించారు. మొక్కల పెంపకం, నిర్వహణ బాధ్యతలను ఉపాధి పథకం సహకారంతో వారే చూస్తారు. కొబ్బరి చెట్ల దిగుబడి వచ్చిన తర్వాత వాటిపై వచ్చే ఆదాయాన్ని ఆయా సంఘం సభ్యులందరికీ వర్తించేలా ప్రణాళికలు రూపొందించారు.

**ఎకరానికి 60 మొక్కలు**

డోన్, ప్యాపిలి, బేతంచెర్ల, బనగానపల్లి, కోవెలకుంట్ల, రుద్రవరం, ఆత్మకూరు, మిడుతూరు, కొత్తపల్లె, మహానంది, పాణ్యం, గడివేముల, సంజామల, పత్తికొండ, కృష్ణగిరి, వెల్దుర్తి, నందవరం, చిప్పగిరి, ఆస్పరి, దేవనకొండ, హాలహర్వి, పెద్దకడబూరు, సి.బెళగల్, గూడూరు తదితర మండలాలకు ప్రాధాన్యం ఇవ్వనున్నారు.

ఎకరానికి 60 మొక్కల చొప్పున నాటనున్నారు. మొక్కలను ప్రభుత్వ నర్సరీల ద్వారా తెప్పిస్తారు. ప్రభుత్వం ఇప్పటికే ధరలు నిర్ణయించింది. మామిడి, కొబ్బరి, చీనీ, దానిమ్మ మొక్కలు అందుబాటులో ఉన్నాయి. మునగ సాగుకు విత్తనాలను సిద్ధంగా ఉంచారు.

# విద్యార్థులు అధికం.. వసతులు హీనం..

పార్వతీపురం : మండలంలోని ఎమ్మార్‌నగరం జడ్పీ ఉన్నత పాఠశాలలో ఏటా విద్యార్థుల సంఖ్య పెరుగుతున్నా సరిపడా వసతులు లేక ఇబ్బందులు ఎదురవుతున్నాయి. అయిదేళ్లుగా అదనపు తరగతి గదులు, వంటశాల, భోజన గదుల నిర్మాణాలు ప్రకటనలకే పరిమితం అయ్యాయి. పాఠశాలలో 6 నుంచి పది తరగతుల్లో 416 మంది చదువుతున్నారు. కొన్ని తరగతులకు రెండేసి గదుల్లో బోధన సాగుతోంది. ప్రధానోపాధ్యాయుడు, సిబ్బంది, ఉపాధ్యాయులు,



ప్రయోగశాల, గ్రంథాలయం, మధ్యాహ్న భోజన సరకుల నిల్వలకు గదుల అవసరం ఉంది. 10 గదులే ఉండటంతో వంటలకు అవస్థలే..: ఇక్కడ విద్యార్థులకు అవసరమైనన్ని పాత్రల్లేక బయట నుంచి తీసుకొచ్చి వంటలు చేస్తున్నారు. ఇక్కడ ఉన్నది ఒక్కటే సిలిండర్ కావడంతో కొన్నిసార్లు కట్టెల పొయ్యిలే దిక్కవుతున్నాయి. అధికారుల దృష్టికి తీసుకెళ్లినా సిలిండర్ల సంఖ్య పెంచలేదని హెచ్ఎం డీవీ.కుమార్ తెలిపారు. విషయం ఎంఈవో 2 ప్రసాద్ వద్ద ప్రస్తావించగా.. పరిశీలించి చర్యలు చేపడతామన్నారు.

# ఉచిత ఇసుకకు రెక్కలు

డోన్ : ఉచిత ఇసుక వ్యాపారులకు కాసులు కురిపిస్తోంది. తుంగభద్ర తీరం వెంట కె.శింగవరం, ఈర్లదిన్నె, పల్‌దొడ్డి, ముడుమాల, కొత్తకోట, కౌతాళం మండల పరిధిలో పలు చోట్ల ఇసుక తవ్వకాలకు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. కౌతాళంలో ఓపెన్, సి.బెళగల్ మండలంలో డీసిల్టింగ్ పద్ధతిలో ఇసుక తీస్తారు. డోన్ పట్టణ పరిధిలో ఎక్కడా రీచ్‌లు లేవు.. నిల్వ కేంద్రాన్ని కూడా ఏర్పాటు చేయలేదు.. దీన్ని వ్యాపారులు తమకు అనుకూలంగా మార్చుకొన్నారు. పట్టణానికి సమీపంలో ఉన్న అనంతపురం జిల్లా తాడిపత్రిలోని ఇసుక రీచ్‌ల వద్ద ఉచితంగా తీసుకొస్తున్నారు. టిప్పర్లలో తెచ్చి కంబాలపాడు సర్కిల్ సమీపంలో పెద్దఎత్తున నిల్వ చేసుకొంటున్నారు.

**టిప్పర్లలో తెచ్చి.. ట్రాక్టర్ లెక్కన అమ్మి**

డోన్ పట్టణానికి చెందిన కొందరు తాడిపత్రి నుంచి టిప్పర్లలో తీసుకొస్తున్నారు. అక్కడ ఒక టిప్పర్‌కు రూ. 13 వేల చొప్పున చెల్లిస్తున్నారు. ఇక్కడ పట్టణ సమీపంలో నిల్వ చేసి ట్రాక్టర్ లెక్కన విక్రయిస్తున్నారు. ఒక ట్రాక్టర్ ఇసుకను రూ. 2500 నుంచి రూ. 3 వేలకు విక్రయిస్తున్నారు. ఒక టిప్పర్‌లో ఐదు ట్రాక్టర్ల వరకు ఇసుక వస్తుంది. నిత్యం అక్కడ వాహనాలు బారులు తీరుతున్నాయి. ఇసుక నిల్వలపై రెవెన్యూ సిబ్బందికి ఇటీవల సమాచారం అందటంతో తనిఖీలకు వెళ్లారు. వ్యాపారులు బెదిరింపులకు దిగారు. ఇసుకను స్వాధీనం చేసుకుంటే ఎలా పనిచేస్తారో చూస్తామంటూ ఓ వ్యాపారి



హుకుం జారీ చేయడం గమనార్హం. "డోన్ సమీపంలో ఇసుక నిల్వలపై అధికారికంగా అనుమతుల్లేవు.. సిబ్బందిని క్షేత్రస్థాయికి పంపించి పరిశీలన చేయించి చర్యలు తీసుకుంటామని" ఆర్డీవో నరసింహులు తెలిపారు.

**వాగుల్లో తెచ్చి..**

గృహ అవసరాల నిమిత్తం వాగులు, వంకలు, నదుల నుంచి ఇసుకను ఉచితంగా తీసుకెళ్లొచ్చని ప్రభుత్వం ప్రకటించింది. అందుకు గనులు, భూగర్భ శాఖ రూపొందించిన ఏపీ శాండ్ పోర్టల్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. గ్రామస్థాయిలో పంచాయతీ కార్యదర్శి, వీఆర్వో, ఊరు దాటి వెళ్లే వాహనాలను తహసీల్దారు, ఎంపీడీవో, ఎస్సై పర్యవేక్షించాలి. ముందస్తు రిజిస్ట్రేషన్ లేకుండా ఇసుకను తీసుకెళ్తే జరిమానా విధించొచ్చు. క్షేత్రస్థాయిలో తనిఖీలు లేకపోవడంతో అక్రమార్కులు గృహ అవసరాల పేరుతో నదులు, వాగులు, వంకల్లో ఇసుకను తవ్వి ఊరు దాటిస్తున్నారు. ట్రాక్టరు ఇసుక రూ. 1,500-2,500, రూ. 3 వేల వరకు విక్రయిస్తున్నారు. ఇది బహిరంగంగా జరుగుతున్నా సచివాలయ ఉద్యోగుల నుంచి గనులు, రెవెన్యూ, పోలీసు శాఖల అధికారుల వరకు ఎవరూ పట్టించుకోవడం లేదు.

# మల్లన్న భద్రతకు మసక

శ్రీశైలం : శ్రీశైల మహాక్షేత్రంలో నిఘా కళ్లు మసక బారాయి. తరచూ చోరీలు జరగడం ఆందోళన కలిగిస్తోంది. భ్రమరాంబ మల్లికార్జున స్వామివార్లను దర్శించుకునేందుకు నిత్యం వేలాది మంది భక్తులు వస్తుంటారు. ఆలయ భద్రతకు ప్రైవేటు సెక్యూరిటీ సిబ్బంది, హోంగార్డులు, ఆర్మ్‌డ్ పోలీసులు, ఎస్పీఎఫ్ కానిస్టేబుళ్లు పనిచేస్తున్నారు. వీరందరినీ సమన్వయం చేసి పనిచేయించడానికి ముఖ్య భద్రతాధికారి(చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్) పోస్టును దేవాదాయశాఖ మంజూరు చేసింది. కొన్నేళ్ల పాటు ఆ పోస్టును భర్తీ చేసి నిర్వహణ చేపట్టారు. ఈ కుర్చీని గత మూడేళ్ల నుంచి ఖాళీగా ఉంచడంతో పర్యవేక్షణ గాడి తప్పుతోంది.

**ట్రాఫిక్ విధులకే హోంగార్డులు**

శ్రీశైల క్షేత్ర పరిధిలో మొత్తం 500 సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. వీటిని పరిశీలించేందుకు ఈవో కార్యాలయం పక్కనే కమాండ్ కంట్రోల్ రూం ఏర్పాటు చేశారు. దీని బాధ్యత సెక్యూరిటీ గార్డులకు అప్పగించారు. అక్కడ హోంగార్డులను నియమించకపోవడం లోపభూయిష్టంగా కనిపిస్తోంది. స్వామి అమ్మవార్ల ఆలయ ప్రాంగణాలు, క్యూలైన్లపైన నిఘా పెట్టాల్సి ఉండగా, నైపుణ్యం తక్కువగా ఉండే సెక్యూరిటీ గార్డులను నియమిస్తుండడంతో ఆలయంలో జరిగే దొంగతనాలను సకాలంలో గుర్తించలేకపోతున్నారు. పోలీస్ శాఖలో శిక్షణ పొంది



వచ్చిన హోంగార్డులను కేవలం క్షేత్ర పరిధిలోని పలు ప్రదేశాల వద్ద ట్రాఫిక్ విధులకు వినియోగించు కుంటున్నారు.

**పర్యవేక్షణ ఖాళీ**

శ్రీశైల దేవస్థానంలో ముఖ్యభద్రతాధికారి(సీఎస్‌వో) పోస్టును మూడేళ్ల నుంచి ఖాళీగా ఉంచారు. డీఎస్పీ స్థాయి అధికారిని నియమించాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఆ హోదా కలిగిన వారు ఆసక్తి చూపడం లేదు. డీఎస్పీ అధికారినే నియమించాలని కొందరు ఈవోలు మొండి పట్టు పట్టడంతో అతీగతి లేకుండా పోయింది. ప్రస్తుతం పర్యవేక్షకుడి హోదా అధికారికి అదనపు బాధ్యతలు అప్పగించారు. ఆలయంలో పనిచేసే ఆర్మ్‌డ్, ఎస్పీఎఫ్, హోంగార్డులు, సెక్యూరిటీ గార్డులకు షిఫ్టుల వారీగా రోల్ కాల్ నిర్వహిస్తుంటారు. రోల్‌కాల్‌లో భద్రతా సిబ్బంది విధులకు హాజరు కావడమే కాకుండా, డ్యూటీ పాయింట్‌లో ఏ విధంగా అప్రమత్తంగా వ్యవహరించాలన్నది హెచ్చరిస్తుండాలి. మొక్కుబడిగా రోల్‌కాల్ జరుతుండటం లోపాలకు తావిస్తోంది. ఆలయ ప్రాంగణంలో డోర్ ఫ్రేమ్ మెటల్ డిటెక్టర్లు తక్కువగా ఉన్నాయి. లగేజీ స్కానర్ పనిచేయడం లేదు. మెటల్ డిటెక్టర్లు, స్కానర్లను ఏర్పాటు చేయాలి.

## ఆటిజం బాలలకు ప్రత్యేక పాఠశాల

పెదవాల్తేరు : పోలియో వ్యాధి నివారణలో పెదవాల్తేరు ప్రభుత్వ రాజీవ్‌చంద్రమణి దేవి (ఆర్.సి.డి.) ఆసుపత్రి ఒకప్పుడు దేశంలోనే అగ్రగామిగా నిలిచింది. రాష్ట్రం నుంచే కాకుండా ఇతర రాష్ట్రాల ప్రజలు కూడా ఇక్కడికి వచ్చేవారు. సంవత్సరాలపాటు ఇక్కడే ఉంటూ శస్త్రచికిత్స, ఫిజియోథెరపీ చేసుకొని పూర్తిగా నయమైన తరువాత స్వస్థలాలకు వెళ్లేవారు. ప్రస్తుతం పోలియో తగ్గిపోవడంతో ఆసుపత్రిలో చిన్నపిల్లలు, ఎముకల వ్యాధులకు వైద్యం అందిస్తున్నారు. ఆసుపత్రిలో ఆటిజం బాలలకు ప్రత్యేకంగా పాఠశాల ఏర్పాటు చేశారు. ఇక్కడ బాధిత పిల్లలకు ఉచితంగా ఫిజియోథెరపీ, స్పీచ్‌థెరపీ ఇస్తారు. వస్తువులను పోల్చుకోవడంపై, పేర్లపై అవగాహన కల్పిస్తామని, సెరిబ్రల్‌పాల్సీ సమస్యలతో బాధపడుతున్న వారికి చికిత్స చేస్తామని



ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ హెచ్.వి.గోపాలకృష్ణ తెలిపారు. 70 పడకల సామర్థ్యం గల ఆసుపత్రిలో ప్రతి నెల సుమారు 15 వరకు కాలివంకర్లు, తదితర అవకరాలకు శస్త్రచికిత్సలు చేస్తుంటామన్నారు. ఆసుపత్రికి ఎముకల సంబంధిత వ్యాధులతో ఎక్కువ మంది వస్తున్నారు. ఇక్కడ అన్ని రకాల రక్తపరీక్షలు, ఎక్స్‌రే, ఈసీజీ, తదితర వైద్యపరికరాలు ఉన్నాయి. ప్రమాదవశాత్తు గాయపడిన వారికి చికిత్స అందిస్తామని, వంశపారం పర్యంగా వచ్చే వ్యాధులకు వైద్యం అందుబాటులో ఉంటుందని డాక్టర్ గోపాలకృష్ణ తెలిపారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఓపీ ఉంటుందని చెప్పారు.

## దారి.. మహాదారుణం!

అనకాపల్లి : భీమిలి-నర్సీపట్నం (బీఎన్) రోడ్డు.. జిల్లాలోని రహదారుల్లో ప్రధానమైనది. 81 కి.మీ. పొడవుండే ఈ రోడ్డు చోడవరం, బుచ్చెయ్యపేట, రావికమతం, రోలుగుంట మండలాలను కలుపుతుంది. రోజూ కొన్ని వేల సంఖ్యలో వాహనాలు తిరుగుతాయి. 20 ఏళ్లలో దీనికి కనీసం ఒక్కసారి కూడా మరమ్మతులు చేయలేదు. దీంతో చాలాచోట్ల రూపురేఖలు లేకుండా పోయింది. గత ప్రభుత్వ హయాంలో మహాదారుణంగా తయారైంది. గత ఐదేళ్లలో 8 మందికిపైగా గోతుల్లో పడి మృతి చెందారు. 50 మందికి పైగా క్షతగాత్రులయ్యారు. వందల సంఖ్యలో వాహనాలు మరమ్మతుకు గురయ్యాయి.

గ్రానైట్, క్వారీ వాహనాలు భారీగా తిరగడంతో బీఎన్ రోడ్డు పలుచోట్ల ఛిద్రమైంది. పాలకులు, అధికారులు దీని మరమ్మతులపై నిర్లక్ష్యం వహిస్తున్నారు. ఈ రోడ్డులో ప్రయాణమంటే నరకంలా తయారైందంటూ చోడవరానికి చెందిన కొంతమంది న్యాయవాదులు కోర్టులో పిటీషన్ వేశారు. దీంతో న్యాయాధికారి జిల్లా కలెక్టర్‌తోపాటు పలువురు అధికారులకు నోటీసులు జారీ చేశారు. ఈనెల 26న కలెక్టర్‌తో సహా మరికొంతమంది అధికారులు న్యాయస్థానంలో హాజరు కావాల్సి ఉంది. దీంతో జిల్లా అధికారిక యంత్రాంగం ఆగమేఘాలపై తాత్కాలికంగా గోతులు పూడ్చే కార్యక్రమం చేపట్టింది. కనీసం ఈ పనులైనా సక్రమంగా చేస్తున్నారా.. అంటే అదీ లేదు. మొత్తం గోతులు పూడ్చడం మానేసి కేవలం పెద్దగుంతలను మాత్రమే కప్పుతున్నారు. వాటిలోనూ కంకర, మట్టి వేసి రోలర్ తిప్పి.. మమ అనిపించేస్తున్నారు. కొన్ని ప్రాంతాల్లో పనులు ఇప్పటికీ ప్రారంభించలేదు. అధికారులు న్యాయస్థానంలో సమాధానం చెప్పేందుకు తూతూమంత్రంగా పనులు చేస్తున్నారని వాహనదారులు మండిపడుతున్నారు. నాలుగు రోజులు



వానలు పడితే ఇప్పుడు కప్పిన మట్టి కొట్టుకుపోయి మళ్లీ గోతులు తేలుతాయి. పూర్తి స్థాయిలో రోడ్డు నిర్మాణంపై దృష్టిపెట్టాలని ప్రజలు కోరుతున్నారు. **నిధులిచ్చినా పనులు శూన్యం:** చోడవరం మండలం గంధవరం నుంచి నర్సీపట్నం వరకు, బుచ్చెయ్యపేట మండలం వడ్డాది నుంచి మాడుగుల మండలం తాటిపర్తి వరకూ రహదారి అభివృద్ధికి గత ప్రభుత్వంలో న్యూ డెవలప్‌మెంట్ బ్యాంక్ (ఎన్‌డీబీ) రూ. 110 కోట్లు మంజూరు చేసింది. కానీ.. వైకాపా ప్రభుత్వం నిధులు సకాలంలో విడుదల చేయకపోవడంతో గుత్తేదారు పనులు గాలికొదిలేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కూడా పనుల్లో పురోగతి లేదు. **ప్రజలకు ఇబ్బందులు లేకుండా మరమ్మతులు:** బీఎన్ రోడ్డు అధ్వానంపై న్యాయస్థానం నోటీసులు ఇచ్చింది వాస్తవమే. రోడ్డు పరిస్థితిని మేమూ గుర్తించాం. గుత్తేదారుకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చాం. తొలుత ప్రజలకు ఇబ్బంది లేకుండా మరమ్మతులు చేస్తున్నాం. తర్వాత పూర్తిస్థాయిలో నిర్మాణ పనులు చేపడతాం.సాంబశివరావు, ఆర్అండ్‌బీ ఈఈ, అనకాపల్లి

## కానరాని చినుకు.. కర్షకులకు లేదు కునుకు



పెద్దవడుగూరు : జిల్లాలో ఈఏడాది వరుణుడు కరుణించకపోవడంతో ఖరీఫ్ పంటలసాగుపై మొదట్లోనే రైతన్నలు ఆశలు వదులుకోవాల్సి వస్తోంది. పెద్దవడుగూరు మండలం ఆవులాంపల్లి, విరుపాపురం గ్రామాల్లో రైతులు నెలరోజుల కిందట సాగు చేసిన పత్తిపంటకు వర్షం లేక తేమశాతం భూమిలో లేకపోవడంతో మొక్కల ఎదుగుదల ఆగిపోయింది. ఆవులాంపల్లికి చెందిన శంకర్‌రెడ్డి ఏడు ఎకరాల్లో వేసిన పత్తిపంటను ట్రాక్టర్ సాయంతో తొలగించారు. ఈఏడాది జులై మాసం పూర్తి కావస్తున్నా చినుకు జాడకరవైందని, ఇక లాభం లేదనుకొని ప్రత్యామ్నాయ పంటలే దిక్కని వాపోయారు. సుమారు రూ.50 వేల వరకు పెట్టుబడి పెట్టారు. ఇదే బాట మరికొంత మంది రైతు ఉండటం గమనార్హం. జిల్లాలో సాధారణ వర్షపాతం 120 మి.మీ ఉండగా కనీసం ఇరవై మి.మీ.లు కూడా నమోదు కాకపోవడాన్ని బట్టి ఇక్కడి కరవు పరిస్థితి ఏస్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు.

# మామూళ్ల మత్తు.. అక్రమార్కులకు మద్దతు!



అనంతపురం : అక్రమార్కుల చర్యలు.. అధికారుల నిర్లక్ష్యం వెరసి ప్రభుత్వ ఖజానాకు రూ.వందల కోట్లు నష్టం వాటిల్లుతోంది. గత వైకాపా పాలనలో అక్రమ లేఅవుట్లు పుట్టగొడుగుల్లా ఏర్పాటయ్యాయి. ప్రభుత్వం నుంచి ఎలాంటి అనుమతులు లేకుండానే ప్లాట్లు వేసి విక్రయించారు. ఫలితంగా ప్రభుత్వానికి రావాల్సిన ఆదాయానికి గండిపడుతోంది. భూబదిలీ చేయకుండానే ప్లాట్లు వేయడం ద్వారా రెవెన్యూ శాఖకు నష్టం వాటిల్లుతోంది. కూటమి ప్రభుత్వం వచ్చాక అక్రమ లేఅవుట్లపై ప్రజాప్రతినిధులు, స్థానికులు ఫిర్యాదు చేస్తున్నా పట్టించుకోవడం లేదు. అహుడా అధికారులు నివేదికలు అందిస్తున్నా పంచాయతీ అధికారులు పట్టించుకోవడం లేదు. మొక్కుబడిగా నోటీసులు ఇచ్చి వదిలేస్తున్నారు. దీంతో అమాయకులు అనుమతులు లేని లేఅవుట్లలో ప్లాటు కొనుగోలు చేసి నష్టపోతున్నారు.

**నిబంధనల ఉల్లంఘన**

ఉమ్మడి అనంతపురం జిల్లాలోని అత్యధిక శాతం పంచాయతీలు అహుడా (అనంతపురం, హిందూపురం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ) పరిధిలోకి వస్తాయి. లేఅవుట్‌లో 10 శాతం భవిష్యత్తు అవసరాలకు కేటాయించాలి. ప్రాంతాన్ని బట్టి 33, 60 అడుగుల రోడ్లు ఏర్పాటు చేయాలి. దీంతో 30 నుంచి 40 శాతం భూమి వదులుకోవాల్సి వస్తుందని యజమానులు అహుడా నుంచి అనుమతులు తీసుకోవడం లేదు.

అహుడా నివేదిక మేరకు పంచాయతీ అధికారులు చర్యలు తీసుకోవాలి. లేఅవుట్ యజమానులకు నోటీసులు అందించి ఎల్‌ఆర్‌ఎస్‌కు అవకాశం ఇవ్వాలి. స్పందించకపోతే తొలగించాలి. అలా చేయకపోతే పంచాయతీ కార్యదర్శులపై చట్టపరంగా చర్యలు తీసుకునే అధికారం జిల్లా అధికారికి ఉంటుంది. అహుడా నివేదికలను అటు పంచాయతీ అధికారి, ఇటు కార్యదర్శులు బుట్టదాఖలు చేస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. అనుమతులు లేని వాటికి రిజిస్ట్రేషన్ చేయవద్దని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు నివేదికలు పంపుతున్నా వారు పట్టించుకోవడం లేదు.

**రూ.వందల కోట్ల నష్టం**

అహుడా అనుమతి పొందాలంటే భూమి విలువను బట్టి ఎకరాకు రూ.50 వేల నుంచి రూ.లక్ష వరకు చెల్లించాలి. రెండు జిల్లాల్లో అనుమతులు లేని లేఅవుట్ల విస్తీర్ణం సుమారు 6 వేల ఎకరాలు ఉంటుంది. ఈ లెక్కన ప్రభుత్వానికి కనీసం రూ.50 కోట్ల నష్టం చేకూరుతోంది. లేఅవుట్‌లో 10 శాతం భూమి చొప్పున ఇరు జిల్లాల్లో సుమారు 600 ఎకరాలు పంచాయతీలకు స్వాధీనం చేయాల్సి ఉంటుంది.ఆ భూమి విలువ కనీసం రూ.300 కోట్లు ఉంటుందని అంచనా.

**తగిన చర్యలు తీసుకుంటాం- నాగరాజు, డీపీవో, అనంతపురం**

అనధికార లేఅవుట్లకు సంబంధించి బాధ్యులకు ఇప్పటికే నోటీసులు అందించాం. త్వరలోనే చట్టప్రకారం చర్యలు తీసుకుంటాం. విధిగా నిబంధనలు పాటించాల్సిందే.

# ఎత్తిపోతలకు నిధుల గ్రహణం



ముదిగుబ్బ : హంద్రీనీవా నీటితో భూములను సస్యశ్యామలం చేయాలన్న లక్ష్యం నీరుగారిపోతోంది. ముదిగుబ్బ మండలం ములకవేముల వద్ద నిర్మిస్తున్న ఎత్తిపోతల పథకం పనులు నిధులలేమితో అసంపూర్తిగా నిలిచిపోయింది. రూ. 1.47 కోట్లతో లిఫ్ట్ ఇరిగేషన్ పథకాన్ని తీసుకొచ్చారు. అనంతపురం జిల్లా నుంచి చిత్తూరుకు వెళ్లే హంద్రీనీవా కాలువ ముదిగుబ్బ మండలంలో 8 కిలోమీటర్ల మేర ఉంది. మలకవేముల క్రాస్‌లోని హంద్రీనీవా నుంచి ఆ గ్రామ చెరువుకు నీరందేలా ఏర్పాటు చేశారు. లిఫ్ట్ పద్ధతిలో హంద్రీనీవా జలాలను చెరువుకు నింపేలా పంప్‌హౌస్, ట్రాన్స్‌ఫార్మర్ యార్డ్ ఏర్పాటు చేయాల్సి ఉంది.

**తవ్వి వదిలేశారు..**2021, జులైలో పంప్‌హౌస్ నిర్మాణానికి గుంత తవ్వి వదిలేశారు. కాలువ నుంచి చెరువు వరకు పైప్‌లైన్ తవ్వి కొంతమేర పైపులు ఏర్పాటు చేశారు. ఏడాదిన్నరలో పనులు పూర్తిచేయాల్సి ఉన్నా నిధులలేమితో 20 శాతమే అయింది . మిగిలిన 80 శాతం పనులు ఆగిపోయాయి. గత వైకాపా పాలనలో పనులు ముందుకు సాగలేదు. పథకం పూర్తయితే ఏటా 0.039 టీఎంసీల హంద్రీనీవా జలాలను చెరువులో నింపుతారు. ముదిగుబ్బ మండలం ములకవేముల, ఎనుములవారిపల్లితో పాటు నల్లమాడ మండలంలోని ఎర్రవొంకపల్లి, చుట్టుపక్కల గ్రామాలతో కలిపి సుమారు 200 ఎకరాలకు సాగు నీటి సమస్య తీరుతుంది. భూగర్భజలాలు పెరిగి మరిన్ని బీడుభూములు సాగులోకి వచ్చే అవకాశముంది.

**ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం**

– లోకేష్, ఏఈఈ, ఏపీఎస్ఐడీసీ పనులు నిలిచిపోయిన విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. కొన్ని బిల్లులు మంజూరు కావాల్సి ఉంది. పనులు పూర్తిచేసేలా చర్యలు తీసుకుంటున్నాం.

# నవోదయం స్ఫూర్తి.. నాటు సారా విముక్తి!



అనంతపురం : నాటుసారా వ్యసనం వ్యక్తి ఆరోగ్యంతోపాటు కుటుంబాన్ని కబళిస్తోంది. ఆర్థికంగా కుంగదీసి కుటుంబాలను వీధిన పడేస్తుంది. దీన్ని దృష్టిలో ఉంచుకుని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం నాటుసారా నిర్మూలించడానికి 'నవోదయం 2.0' పేరుతో ప్రత్యేక కార్యక్రమాన్ని ప్రారంభించింది.

**జిల్లాలో 51 నాటుసారా రహిత గ్రామాలు**

అనంతపురం జిల్లాలో ప్రభుత్వం చేపట్టిన నివారణ చర్యల కారణంగా నాటుసారా తయారీ తగ్గుముఖం పట్టింది. జిల్లాలో ఏడాది క్రితం 104 నాటుసారా ప్రభావిత గ్రామాలు ఉండేవి. ప్రస్తుతం వాటిలో 51 ఊళ్లు ఆ మహమ్మారి రహిత గ్రామాలుగా రూపాంతరం చెందాయి. ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ శాఖ సారా ప్రభావిత గ్రామాలను ఎ, బి, సి కేటగిరీలుగా విభజించి నవోదయం 2.0 కార్యక్రమాన్ని పకడ్బందీగా చేపట్టింది. దానివల్ల కలిగే దుష్ప్రభావాలపై గ్రామసభల ద్వారా అవగాహన కల్పించారు. సారా తయారు చేస్తే పడే శిక్షలు గురించి పత్రికలు, టీవీలు, సామాజిక మాధ్యమాల్లో ప్రచారం నిర్వహించారు. సారా తయారీ, విక్రయాల్లో ప్రమేయం ఉన్న వారిని గుర్తించి బైండోవర్ చేశారు.

**నక్కనదొడ్డి తండా ఆదర్శం..**

ప్రభుత్వం చేపట్టిన నవోదయం కార్యక్రమం ఓ గ్రామంలో నాటుసారా పేరు వినిపించకుండా చేసింది. గుంతకల్లు మండలం నక్కనదొడ్డి పంచాయతీలోని నక్కనదొడ్డి తండాలో నాటుసారా గుప్పుమనేది. తండాలో 170 కుటుంబాలు ఉండగా, 30 కుటుంబాలకు సారా తయారీనే జీవనోపాధిగా ఉండేది. దీన్ని ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న అబ్కారీ అధికారులు ఆ ఊరిని పూర్తిగా మార్చారు. సారా తయారీకి బెల్లం సరఫరా చేసే వ్యాపారులపైనా కేసులు నమోదు చేశారు. కొందరు పాడి పరిశ్రమ ద్వారా ఉపాధి పొందుతున్నారు. 12 మందికి ప్రభుత్వం రుణాలు ఇవ్వడానికి ప్రతిపాదనలు పంపారు. 40 మంది మహిళలకు ఐవోసీ సంస్థ సహకారంతో ఉచితంగా టైలరింగ్‌లో శిక్షణ ఇప్పించారు. త్వరలో వీరందరికీ కుట్టుమిషన్లు అందజేయనున్నారు. తమ గ్రామం నాటుసారా రహితంగా గుర్తించడంపై నక్కనదొడ్డి తండా సర్పంచి డుంగావత్ వరలక్ష్మి హర్షం వ్యక్తం చేశారు.

**సంపూర్ణంగా నిర్మూలిస్తాం..**

– నాగమద్దయ్య, డిప్యూటీ కమిషనర్, ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్

నవోదయంతో ప్రజల్లో గణనీయంగా మార్పు వస్తోంది. ఈ ఏడాది చివరికల్లా జిల్లాలో నాటుసారా సంపూర్ణంగా నిర్మూలిస్తాం. నక్కనదొడ్డి తండా ఓ స్ఫూర్తి. జిల్లాలో మొదటి నాటుసారా రహిత గ్రామంగా ప్రకటించాం. సారా తయారీ ఆధారంగా బతికే వారికి ప్రత్యామ్నాయ జీవనోపాధి చూపిస్తాం.

## అమాత్యా.. రైవాడపై దయ చూపరూ!

దేవరాపల్లి : జిల్లాలోని జలాశయాల్లో ముఖ్యమైన రైవాడ నిర్వహణ లోపాలతో కొట్టుమిట్టాడుతోంది. దేవరాపల్లి, కె.కోటపాడు, చోడవరం తదితర మండలాలకు చెందిన 15,344 ఎకరాలతో పాటు విజయనగరం జిల్లా వేపాడ మండలానికి చెందిన అదనపు ఆయకట్టు 6 వేల ఎకరాలకు సాగునీరందించేందుకు దీనిని 40 ఏళ్ల కింద నిర్మించారు. విశాఖ నగరానికి ప్రతిరోజూ 50 క్యూసెక్కుల తాగునీరు ఈ జలాశయం ద్వారానే అందిస్తున్నారు. ఇంతటి ప్రాధాన్యం కలిగిన రైవాడ నిర్వహణపై పాలకులు దశాబ్దాలుగా నిర్లక్ష్యం చేస్తూనే ఉన్నారు. మధ్యతరహా నీటిపారుదలకు చెందిన ఈ జలాశయం నీటి నిల్వ సామర్థ్యం 3.6 టీఎంసీలు. దీని అత్యధిక నీటిమట్టం 114 మీటర్లు. 1990లో వచ్చిన భారీ వరదకు జలాశయ నీటిమట్టం ఒక్కసారిగా ప్రమాదస్థాయిని దాటింది. 65 వేల క్యూసెక్కుల సామర్థ్యం కలిగిన గేట్లపై నుంచి సుమారు లక్ష క్యూసెక్కులు ప్రవహించింది. ఈ ఉద్ధృతికి స్పిల్‌వే బాడీవాల్‌పై నుంచి కిందవరకు బీటలు వారింది. కుడి, ఎడమ కాలువల ప్రధాన తూములు సైతం బీటలువారాయి. అంతేకాకుండా వాటికి అమర్చిన రెగ్యులేటింగ్ గేట్లు సైతం వంగిపోయి పూర్తిగా దెబ్బతిన్నాయి. మట్టిగట్టు సైతం చాలాచోట్ల జారింది.

**336 కోట్లతో ప్రతిపాదన ...** నిపుణులు చేసిన హెచ్చరిక నేపథ్యంలో



ప్రమాదస్థితిలో ఉన్న ఈ జలాశయం వద్ద అత్యవసరంగా చేపట్టాల్సిన పనులను డ్రిప్ (డ్యాం రీహేబిటేషన్ అండ్ ఇంప్రూవ్‌మెంటు ప్రోగ్రాం) కింద చేపట్టడానికి ప్రభుత్వం నిర్ణయించింది. ఈ పనుల కోసం రూ. 336 కోట్లు మంజూరు చెయ్యాల్సిందిగా ప్రపంచ బ్యాంకును కోరింది. గత వైకాపా ప్రభుత్వం దీని గురించి ఏ మాత్రం పట్టించుకోలేదు. ప్రస్తుతం అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వంలోనైనా దీనికి మోక్షం కలుగుతుందనే ఆశాభావాన్ని రైతులు వ్యక్తం చేస్తున్నారు. అంతేకాకుండా ఈ జలాశయం నుంచి సాగునీరందించే కుడి, ఎడమ కాలువల ఆధునికీకరణకు తెదేపా ప్రభుత్వం రూ. 30 కోట్లతో జైకా నిధులు మంజూరు చేసింది. ఈ పనులు సైతం అసంపూర్తిగా ఉండిపోయాయి. రైతులకు వెన్నుదన్నుగా నిలిచిన ఈ జలాశయాన్ని కాపాడుకోవడానికి ప్రస్తుత ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి శతవిధాలా కృషి చేస్తున్నారు. ఇప్పటికే ఈ విషయాన్ని సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లారు. జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు శనివారం చోడవరంలో పర్యటించనున్నారు. ఆయన ఈ జలాశయం పరిరక్షణపై దృష్టిసారించి పెండింగ్ పనులు పునః ప్రారంభించడంపై సారించాలని ఈ ప్రాంత రైతులు కోరుతున్నారు.

**హెచ్చరించిన నిపుణుల బృందం**

ఈ జలాశయాన్ని జాతీయ జలాశయాల భద్రతా మండలికి చెందిన నిపుణుల బృందం 2018-2019లో పరిశీలించింది. గతంలోలాగే వరద వస్తే జలాశయానికి ముప్పు వాటిల్లే ప్రమాదం ఉందని నిర్ధారించింది. అత్యవసరంగా ఈ జలాశయం వద్ద అత్యవసరంగా చెయ్యాల్సిన పనులపై పలు కీలక సూచనలు చేసింది. తమ నివేదికని రాష్ట్ర ప్రభుత్వం ద్వారా సీడబ్ల్యూసీకి (సెంట్రల్ వాటర్ కమిషన్) పంపించింది. ఈ నిపుణుల బృందం అనేక సూచనలు చేసింది. రేడియల్ గేట్లను అమర్చాలని, బీటలు వారిన పియర్స్‌తోపాటు పొర్లుకట్ట పునర్నిర్మాణం చెయ్యాలని, మట్టిగట్టు జారిన దగ్గర పటిష్ఠం చెయ్యాలని, సుమారు 6 మీటర్లు పొడవైన మట్టికట్టకు అనుసంధానంగా సర్వీసు రోడ్డు నిర్మించాలని కుడి, ఎడమ కాలువల ప్రధాన తూములను పునర్నిర్మించాలని సూచించింది.

## పాడిరైతులకు అండ.. మినీ గోకులం

దేవరాపల్లి : కూటమి ప్రభుత్వం మినీ గోకులాలకు శ్రీకారం చుట్టింది. మొదటి విడతలో గత ఏడాది జిల్లాకు 813 మినీ గోకులం షెడ్లు మంజూరుకాగా వీటిలో 742 పూర్తి చేశారు. ప్రస్తుతం వాటికి చెల్లింపులు చేస్తున్నారు. రెండో విడతలో పంచాయతీకి రెండు చొప్పున మినీ గోకులాల ఏర్పాటుకు పశుసంవర్ధక శాఖ అధికారులు ప్రణాళికలు సిద్ధం చేశారు. జిల్లాలో 646 పంచాయతీలు ఉన్నాయి. వీటిలో 1292 గోకులాల యూనిట్లు నిర్మించాలనేది ప్రతిపాదన.

ప్రభుత్వ మార్గదర్శకాలను అనుగుణంగా లబ్ధిదారులను ఎంపిక చేయనున్నారు. రైతులు పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో జిల్లా నీటి యాజమాన్య సంస్థకు (డ్వామా) దరఖాస్తు చేసుకోవాలి.

**యూనిట్ల వివరాలు:** రెండు పశువుల యూనిట్ విలువ రూ, 1.15 లక్షలు, నాలుగింటికి రూ. 2.3 లక్షలు, ఆరింటికి రూ. 2.3 లక్షలుగా నిర్ణయించారు. ఉపాధి హామీ పథకం కింద 90 శాతం రాయితీ



రాగా, మిగిలిన 10 శాతం వాటా లబ్ధిదారులు చెల్లించాలి.

**మేకలు, గొర్రెలకు:** 20 గొర్రెలు, మేకల యూనిట్ విలువ రూ.1.30 లక్షలు, 50 జీవాలకు రూ.2.30 లక్షలు, 100 కోళ్ల షెడ్డుకు రూ. 87 వేలు, 200లు పైన ఉన్న వాటి యూనిట్ విలువ రూ. 1.32 లక్షలుగా నిర్ణయించారు. ఉపాధి హామీ పథకం కింద 70 శాతం రాయితీ రాగా, మిగిలిన 30 శాతం లబ్ధిదారులు వాటా కింద చెల్లించాలి.

**అనుమతులు రాగానే దరఖాస్తుల స్వీకరణ:** జిల్లాలో 1292 మినీ గోకులాల యూనిట్లు ఏర్పాటుకు అడుగులు వేస్తున్నాం. ఉపాధి హామీ పథకం నిధులతో వీటిని నిర్మిస్తాం. కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లి అనుమతులు రాగానే అర్హులైన రైతుల నుంచి గోకులాలకు సంబంధించి దరఖాస్తులు స్వీకరిస్తాం.

బి.రామమోహనరావు, జిల్లా పశుసంవర్ధక శాఖాధికారి




# తెలుగమ్మాయి జిలి బిలి అందాలు

ఇటీవలి కాలంలో గ్లామర్ రంగంలో తెలుగమ్మాయిలకు చెప్పుకోదగ్గ అవకాశాలొస్తున్నాయనే చెప్పాలి. ప్రతిభతో పాటు దూసుకుపోయే తత్వం ఉంటే చాలు భాషతో సంబంధం లేకుండా ఛాన్సులిస్తున్నారు. నయనతార, దీపిక పదుకొనే, ఆలియా రేంజులో స్టార్లు కాలేకపోయినా కానీ, తమకంటూ ఒక స్థాయి ఉందని తెలుగమ్మాయిలు నిరూపిస్తున్నారు. శ్రీలీల, డింపుల్ హయాథీ, ప్రియాంక జవాల్కర్, రక్షిత ఇంకా చాలా మంది కథానాయికలుగా రాణిస్తున్నారు. తెలంగాణకు చెందిన అనన్య నాగళ్ల తనదైన అందం ప్రతిభతో ఇటీవల తెలుగు సినీపరిశ్రమలో తనని తాను నిరూపించుకునేందుకు ప్రయత్నిస్తోంది. స్టార్ రేంజ్ అవకాశాలు లేకపోయినా, తన రేంజుకు తగ్గ పాత్రల్లో అవకాశాల్ని అందుకుంటోంది. ముఖ్యంగా అనన్య చుట్టూ పాజిటివ్ వైబ్స్ తనకు పరిశ్రమలో గుర్తింపును తెచ్చాయి. గత ఏడాది పొట్టేల్, శ్రీకాకుళం షెర్లాక్ హెూమ్స్ లాంటి సినిమాలతో అభిమానుల ముందుకు వచ్చింది. ఈ ఏడాది తన తదుపరి సినిమా గురించి ఇంకా ప్రకటించాల్సి ఉంది. ఇటీవల సీఎం రేవంత్ చేతులమీదుగా ప్రతిష్టాత్మక గద్దర్ తెలంగాణ స్పెషల్ జూరీ పురస్కారాల్ని కూడా అందుకుంది. ఇక



అనన్య నాగళ్ల తన సోషల్ మీడియా ఫ్యాన్స్ కు నిరంతరం టచ్ లో ఉంటోంది. ఎప్పటికప్పుడు లేటెస్ట్, అప్ డేట్స్ ని, లైఫ్ లో ముఖ్యమైన విషయాలను, కొన్ని అందమైన ఫోటోషూట్లను షేర్ చేస్తూ అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. తాజాగా అనన్య అందమైన శారీ లుక్ లో కనిపించిన ఫోటోగ్రాఫ్స్ ఇంటర్నెట్ లో వైరల్ గా మారుతున్నాయి. అనన్య పాక్షికంగా తన అందాల్ని ఆవిష్కరించే క్రీమ్ కలర్ శారీ, అందమైన డిజైనర్ బ్లౌజ్ లో ప్రత్యక్షమైంది. ఇక ఈ ఫోటోషూట్ లో అనన్యలోని ఇన్నర్ అందాలను ఆవిష్కరించిన తీరు అందరి దృష్టిని ఆకర్షించింది. మునుపటితో పోలిస్తే, ఇటీవల అనన్య ఘాటైన ఫోటోషూట్లతో పరిశ్రమను ఆకర్షిస్తోందని అభిమానులు కామెంట్ చేస్తున్నారు. ఈ తెలుగమ్మాయి ప్రయత్నానికి మెచ్చి దర్శకనిర్మాతలు అవకాశాలు కల్పించాలని కూడా ఎంకరేజ్ చేస్తున్నారు. పింక్ రీమేక్ వకీల్ సాబ్ లో అనన్య నాగళ్ల నటనకు మంచి పేరొచ్చింది. పవన్ కల్యాణ్ లాంటి స్టార్ సినిమాలో ఆరంభ రోజుల్లోనే ఈ భామ అవకాశం అందుకుని అందరినీ ఆకర్షించింది. ఆ తర్వాత వరుసగా సినిమాల్లో అవకాశాలొచ్చాయి. ప్రస్తుతం కొంత గ్యాప్ వచ్చినా కానీ, తిరిగి కరీర్ పరంగా పుంజుకోవాలని అభిమానులు ఆశిస్తున్నారు.

# ల్యాండ్ మార్క్ మూవీ కోసం చైతూ సూపర్ ప్లాన్

టాలీవుడ్ స్టార్ డైరెక్టర్లలో కొరటాల శివ కూడా ఒకరు. మహేష్ బాబు, ప్రభాస్, ఎన్టీఆర్ లాంటి స్టార్ హీరోలకు మంచి మంచి బ్లాక్ బస్టర్లను అందించిన శివ, చిరంజీవితో చేసిన ఆచార్య సినిమాతో భారీ డిజాస్టర్ ను అందుకున్నారు. ఆచార్య రిజల్ట్ తో కొరటాలపై చాలా నెగిటివిటీ వచ్చింది. ఆచార్య తర్వాత ఎన్టీఆర్ తో చేసిన దేవర సినిమా మంచి హిట్ అయినప్పటికీ ఆ సక్సెస్ మొత్తం ఎన్టీఆర్ ఖాతాలోనే పడింది. దీంతో కొరటాల తన స్టామినాను దేవర2 తో ప్రూవ్ చేసుకుంటారని అందరూ అనుకుంటున్న నేపథ్యంలో అసలు దేవర2 ఉంటుందా అనే డిస్కషన్స్ మొదలయ్యాయి. కానీ దేవర2 ఉ



ంటుందని మేకర్స్ ఇప్పటికే అనౌన్స్ చేయగా, దేవర2 ఉంటుంది, ఉండి తీరుతుందని ఎన్టీఆర్ కూడా స్టేజ్ పై చెప్పడంతో దేవర2 అప్డేట్ కోసం ఎన్టీఆర్ ఫ్యాన్స్ తెగ వెయిట్ చేస్తున్నారు. దేవర2 అప్డేట్ కోసం వెయిట్ చేస్తున్న తారక్ ఫ్యాన్స్ కు కొరటాల ఇప్పుడు షాకిచ్చారు.

**ల్యాండ్‌మార్క్ ఫిల్మ్ కోసం..** కొరటాల తన తర్వాతి సినిమాను అక్కినేని నాగ చైతన్యతో చేయనున్నారని నెట్టింట వార్తలు చక్కర్లు కొడుతున్నాయి. తండేల్ సినిమాతో కెరీర్ బిగ్గెస్ట్ హిట్ ను అందుకున్న చైతన్య ప్రస్తుతం తన 24వ సినిమాను విరూపాక్ష ఫేమ్ కార్తీక్ దండు దర్శకత్వంలో చేస్తున్న సంగతి తెలిసిందే. ఈ సినిమా తర్వాత తన కెరీర్ మైల్ స్టోన్ ఫిల్మ్ అయిన %చీజ%25 కోసం చైతన్య పలు డైరెక్టర్లు చెప్పే కథలు వింటున్నారని వార్తలొచ్చాయి. అందులో భాగంగానే శివ నిర్వాణ, బోయపాటి శ్రీనుతో పాటూ మరికొందరి పేర్లు వినిపించగా ఇప్పుడు సడెన్ గా ఆ లిస్ట్ లో కొరటాల కూడా జాయిన్ అయ్యారు.

ప్రస్తుతం టాలీవుడ్ లో వినిపిస్తున్న వార్తల ప్రకారం, రీసెంట్ గా కొరటాల శివ నాగ చైతన్యకు ఓ స్క్రిప్ట్ ను నెరేట్ చేశారని, దానికి చైతన్య నుంచి కూడా పాజిటివ్ రెస్పాన్స్ వచ్చిందని తెలుస్తోంది. కొరటాల చెప్పిన మాస్ డ్రామా చేయడానికి చైతన్య ఇంట్రెస్టింగ్ గా ఉన్నారని అంటున్నారు. ఇదే నిజమైతే చైతూ ల్యాండ్ మార్క్ మూవీకి మంచి కాంబినేషన్ రెడీ అయినట్టే అవుతుంది. మరి ఈ వార్తల్లో నిజమెంతన్నది తెలియాల్సి ఉంది.

# 'అఖండ-2' రిలీజ్ పై మళ్లీ పిడుగు లాంటి ప్రచారం!



'అఖండ-2' ని ఎట్టి పరిస్థితుల్లో సెప్టెంబర్ 25న రిలీజ్ చేయాలని మేకర్స్ సంకల్పించారు. ఆ దిశగా చిత్రీ కరణ సహా అన్ని పనులు పూర్తి చేసే పనుల్లో బిజీగా ఉన్నారు. ప్రాజెక్ట్ ప్రారంభమైన నాటి నుంచి మేకర్స్ ఇదే మాట మీద ఉన్నారు. బాలయ్య కూడా ప్రకటించిన తేదీకే రిలీజ్ చేయాలని అంతే పట్టు దలతో పని చేస్తున్నారు. దీంతో అభిమానులు సెప్టెంబర్ 25కి ఫిక్సైపోయారు. ఆగస్టు సగం రోజులు కూడా గడిచి పోయాయి. అంటే రిలీజ్ కి ఇంకా 40 రోజులు మాత్రమే చేతిలో ఉన్నాయి. మరి ఈ నలభై రోజుల్లో అన్ని పనులు పూర్తి చేసి రిలీజ్ కు వచ్చేస్తుందా? అంటే తాజాగా సందేహాలు వ్యక్త మవుతున్నాయి. సెప్టెంబర్ నుంచి డిసెంబర్ కు వాయిదా పడుతుందని వార్తలొస్తున్నాయి. వాస్తవానికి డిసెంబర్ లో రిలీజ్ ఉండొచ్చని గతంలోనే కథనాలొచ్చాయి. కానీ బాలయ్య స్పీడ్ తో సెప్టెంబర్ లో రిలీజ్ సాధ్యమవుతుందనుకున్నారంతా. తాజాగా సమీకరణాలు మారతుండటంతో? వాయిదా వార్త ఈసారి మరిం త బలంగా తెరపైకి వస్తోంది. చిత్రీకరణ ఆలస్యమవుతుందా? పోస్ట్ ప్రొడక్షన్ కారణంగా డిలే అవుతుందా? అన్నది బయటకు రాలేదు గానీ..వాయిదా మాత్రం తథ్యం అనేది గట్టిగానే వినిపిస్తోంది. ఈ సినిమాకు సంబంధించి విజువల్ ఎఫెక్ట్స్ కీలకం. బాలయ్యపై భారీ యాక్షన్ సన్నివేశాల నేపథ్యంలో విఎఫ్ ఎక్స్ ప్రాధాన్యత ప్రతీ సినిమాలోనూ కనిపిస్తుంది. ఈ విషయంలో దర్శకుడు బోయపాటి శ్రీను ఎంత మాత్రం రాజీ పడరు. యాక్షన్ సన్నివేశాల డిజైనింగ్ లోనూ బోయపాటి హస్తం ఉంటుంది. పైగా ఈసారి అఖండ 2 తో బాలయ్య పాన్ ఇండియా మార్కెట్ లో కి అడుగు పెడుతోన్న సంగతి తెలి సిందే. దీంతో చిత్రాన్ని అంతే ప్రతష్టాత్మకంగాను భావించి ముందుకెళ్తున్నారు. పాన్ ఇండియా రిలీజ్ కాకుండానే బాలయ్య కు %-%అఖండ%-%తో ఈ రేంజ్ ఇమేజ్ క్రియేట్ అయింది. బాలయ్య ప్రభావం నార్త్ లో ఏ రేంజ్ లో ఉన్నందన్నది కుంభమేళ సహా వివిధ సందర్భాల్లో బయట పడిన సంగతి తెలిసిందే.

# శ్రీలీల వర్సెస్ ఆలియా భట్.. బాలీవుడ్ లో పీఆర్ స్టంట్స్





డ్యాన్సింగ్ క్వీన్ శ్రీలీల టాలీవుడ్, శాండల్ వుడ్ లో స్టార్ హీరోల సరసన నటించి మంచి గుర్తింపు తెచ్చుకుంది. అయితే కెరీర్ ప్రారంభంలో మంచి హిట్లు అందుకున్న ఈ అమ్మడు కొద్ది రోజులుగా హిట్ కోసం ఎదురుచూస్తుంది. ఈ క్రమంలోనే బాలీవుడ్ లోనూ అదృష్టం పరీక్షించుకునేందుకు వెళ్లింది. హిందీలో శ్రీలీల ఆషికి 3సో అక్కడి డెబ్యూ చేయనుంది. ఈ సినిమా రొమాంటిక్ డ్రామాగా తెరకెక్కుతుంది. ఇందులో కార్తీక్ ఆర్యన్ హీరోగా నటిస్తున్నాడు. ప్రస్తుతం శరవేగంగా షూటింగ్ జరుపుకుంటున్న ఈ సినిమా క్రిస్మస్ ట్రీట్ గా 2025 డిసెంబర్ 25న థియేటర్లలోకి రానుంది. అయితే శ్రీలీలకు బీ టౌన్ లో తొలి సినిమాకే బాక్సాఫీస్ వద్ద పోటీ ఎదురుకానుంది. బ్యూటీ ఆలియా భట్ కీలక పాత్రలో నటిస్తున్న ఆల్ఫా సినిమా కూడా అదే రోజు థియేటర్లలోకి రానుంది. ఈ సినిమా థ్రిల్లర్ ఎంటర్టైనర్ గా తెరకెక్కుతుంది. అయితే రెండు సినిమాలు ఒకే రోజు బాక్సాఫీస్ ముందుకు రానుండడంతో ఆయా మూవీటీమ్స్ వ్యూహాత్మకంగా ముందుకు వెళ్లనున్నాయి. అసలే బాలీవుడ్ అంటేనే పీ ఆర్ మేనేజ్ మెంట్లతో నడుస్తుంది. సినిమా రిలీజ్ కు ముందు పీఆర్ స్టంట్స్ వేరే లెవెల్ లో ఉంటాయి. ఈ వ్యూహాలతోనే సినిమాను ప్రేక్షకుల ముందుకు తీసుకెళ్తాడు. ఈ క్రమంలోనే బాలీవుడ్ పీఆర్ సంస్థలు ఇప్పుడు శ్రీలీల- ఆలియాకు ఫేస్ టు ఫేస్ ఫైట్ గా చూపిస్తున్నాయి. ఆలియా కంటే ఎక్కువగా వైరల్ చేసేందుకు ప్రయత్నిస్తున్నాయి. అందులో భాగంగానే ఈ ఏడాది ప్రారంభంలో హీరో కార్తీక్ ఆర్యన్తో శ్రీలీల డేటింగ్ చేస్తున్నట్లు పీఆర్ ఏజెన్సీలు స్టంట్ చేశాయి. ఈవెంట్లలో, రెస్టారెంట్లలో వీళ్లిద్దరు కనిపించిన వీడియోలు, ఫొటోలు తెగ వైరల్ చేసేశారు. అంతేకాకుండా.. ఈ ఇద్దరి మధ్య ఏదో నడుస్తుందని కథనాలు కూడా సృష్టించారు. ఇప్పటికీ అలాంటి స్టోరీలు పుట్టుకొస్తున్నాయి. కానీ, దీనిపై అటు కార్తిక్ కానీ, ఇటు శ్రీలీల కానీ అధికారికంగా స్పందించలేదు. అయితే, వారి గురించి నిరంతరాయంగా కథలు రాస్తున్నప్పటికీ, ఇద్దరు స్టార్లలో ఎవరూ ప్రేమ ఊహాగానాల గురించి నోరు విప్పలేదు. కాగా, ఆలియా భట్ కీలక పాత్రలో శివ్ రవైల్ ఆల్ఫా సినిమాను స్పై యాక్షన్ థ్రిల్లర్ గా తెరకెక్కిస్తున్నారు. ఇందులో ఆలియాతో పాటు శర్వరి కూడా నటిస్తుంది. ఇది యష్ రాజ్ ఫిల్మ్స్ స్పై యూనివర్స్ లో భాగంగా రానుంది. అయితే యష్ రాజ్ ఫిల్మ్స్ స్పై యూనివర్స్ లో ఆల్ఫా సినిమా మహిళా ప్రధాన పాత్ర ఉన్న తొలి చిత్రం కానుంది.

# జాన్వీ కపూర్.. ఓ పువ్వులాంటి అందం!

బాలీవుడ్ యంగ్ హీరోయిన్ జాన్వీ కపూర్ ఎప్పుడూ తన స్టైల్‌తో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంటోంది. తాజాగా ఆమె షేర్ చేసిన కొత్త ఫోటోషూట్ సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతోంది. పింక్ రెడ్ షేడ్స్ కలిగిన ఫ్లోరల్ డ్రెస్‌లో జన్వి సంప్రదాయాన్నీ, మోడ్రన్ టచ్‌ని కలిపి ఒక కొత్త గ్లామర్ వేవ్‌ని చూపించింది. చేతిలో ఒక తెల్లని పువ్వుని పట్టుకుని చిరునవ్వులు చిందించడం, జతగా వెండి గాజులు, జుమ్కాలు జోడించడం వల్ల ఈ లుక్‌కి సింపుల్‌గా ఒక ప్రత్యేకమైన అందం వచ్చింది. ఈ ఫోటోలు పోస్ట్ చేసిన వెంటనే అభిమానుల నుంచి పాజిటివ్ రెస్పాన్స్ వచ్చింది. "గార్డెన్‌లో పూల కంటే నువ్వే అందంగా ఉన్నావు," "కలర్స్ కంటే నీ చిరునవ్వు బ్రైట్‌గా ఉంది," అంటూ కామెంట్లు కురిపించారు. కేవలం కొన్ని గంటల్లోనే లక్షల లైక్స్ సాధించడంతో జాన్వి క్రేజ్ ఎలా ఉందో మరోసారి



రుజువైంది. ఈ ఫోటోషూట్ ఆమె ఫ్యాషన్ గేమ్‌లోని ప్రయోగాత్మక ట్రెండ్ ను మళ్లీ హైలైట్ చేస్తోంది. కెరీర్ విషయానికి వస్తే, జాన్వీ 2018లో 'ధడక్' సినిమా ద్వారా బాలీవుడ్ ఎంట్రీ ఇచ్చింది. ఆ తర్వాత 'గుంజన్ సక్సేనా: ది కార్గిల్ గర్ల్' వంటి చిత్రాలతో తన నటనను నిరూపించుకుంది. ఇటీవల దక్షిణాదికి కూడా అడుగుపెట్టి దేవరలో ఎన్టీఆర్ కు జోడిగా నటించింది. ఇక రామ్ చరణ్ సరసన తన రెండో తెలుగు సినిమా 'పెద్ది' చేస్తోంది. అలాగే సిద్ధార్థ్ మల్హోత్రా జోడీగా 'పరం సుందరి'లో నటిస్తోంది. ఈ ప్రాజెక్టులు ఆమెకు పాన్ ఇండియా స్థాయిలో మంచి అవకాశాలను తెస్తున్నాయి. సినిమాలతో పాటు జాన్వీ ఫ్యాషన్‌లోనూ తనకంటూ ఓ ప్రత్యేకమైన స్థానం సంపాదించుకుంది. ఎప్పుడూ కొత్త స్టైల్‌ను ప్రయత్నించడానికి వెనుకాడని ఆమె, సాంప్రదాయ దుస్తుల్లోనూ, మోడ్రన్ అవుట్‌ఫిట్స్‌లోనూ సమానంగా మెరిసిపోతుంది. ఈ ఫ్లోరల్ డ్రెస్సింగ్ లుక్ ద్వారా ఆమె మరోసారి ఫ్యాన్స్ హృదయాలను గెలుచుకుంది. ఇక జాన్వీ కెరీర్ ఇప్పుడు ఒక క్రిటికల్ ఫేజ్‌లో ఉంది. మంచి కథలతో పాటు తన గ్లామరస్ ఇమేజ్‌ను కూడా బ్యాలెన్స్ చేస్తూ, స్టార్ హీరోయిన్ల లీగ్‌లోకి వెళ్లాలని లక్ష్యంగా పెట్టుకుంది.

# జాన్వి ఆశలన్నీ దాని మీదే..!

శ్రీదేవి తనయురాలు జాన్వి కపూర్ ఇప్పటికే బాలీవుడ్ లో తన హవా కొనసాగిస్తుంది. ఐతే తన తల్లి లానే సౌత్ లో కూడా తన సత్తా చాటాలని చూస్తుంది అమ్మడు. ఈ క్రమంలోనే ఎన్టీఆర్ దేవరతో టాలీవుడ్ ఎంట్రీ ఇచ్చింది జాన్వి. కొరటాల శివ డైరెక్షన్ లో తెరకెక్కిన ఆ సినిమాలో జాన్వి కపూర్ తంగం పాత్రలో నటించింది. సినిమాలో ఆమెకు ఉన్నవి చాలా తక్కువ సీన్స్. అందులోనే ఆమె గ్లామర్ షో తో మెప్పించింది. దేవర 1 కాదు దేవర 2 లో ఆమెకు మంచి స్కోప్ ఉందని టాక్.

**దేవర 2 క్యాన్సిల్..** ఐతే ఇప్పుడు పరిస్తితి చూస్తుంటే దేవర 2 దాదాపు క్యాన్సిల్ చేశారనే అంటున్నారు. దేవర 1 రిజల్ట్ కూడా ఆశించిన స్థాయిలో లేదు కాబట్టి దేవర 2 దాదాపు అటకెక్కించారని తెలుస్తుంది. ఐతే దేవర 2 మీద చాలా హెూప్స్ పెట్టుకుంది జాన్వి. ఇప్పుడు అది



క్యాన్సిల్ అయ్యింది. ఇక ప్రస్తుతం అమ్మడు చరణ్ తో పెద్ది సినిమా చేస్తుంది. ప్రస్తుతం ఆమెకున్న ఆప్షన్ అదొక్కటే. బుచ్చి బాబు సన డైరెక్షన్ లో తెరకెక్కుతున్న పెద్ది సినిమాపై అంచనాలు తారాస్థాయిలో ఉన్నాయి. దేవర తో టాలీవుడ్ లో స్టార్ రేంజ్ కి వెళ్లాలని అనుకున్న జాన్వి ఆశలు నెరవేరలేదు. అందుకే నెక్స్ట్ చేస్తున్న పెద్ది సినిమా మీద అమ్మడు అంచనాలు పెట్టుకుంది. ఎలాగు బుచ్చి బాబు ఉప్పెనలో హీరోయిన్ రోల్ ని బాగా రాసుకున్నాడు. పెద్ది కమర్షియల్ సినిమా అయినా కూడా జాన్వికి తగిన ప్రాధాన్యత ఉంటుందట.

**జాన్వి కపూర్ పెద్ది లక్కీ మూవీ..** సో జాన్వి కపూర్ పెద్దినే తన లక్కీ మూవీగా భావిస్తుంది. తెలుగులో పెద్ది తర్వాత ఇంకా చాలా ప్లాన్స్ తోనే ఉందట అమ్మడు. అటు తమిళ్ లో కూడా సినిమాలు చేయాలని ఇంట్రెస్ట్ చూపిస్తుంది. ఐతే తమిళ్ మేకర్స్ మాత్రం జాన్విని తీసుకోవట్లేదు. జాన్వి కపూర్ అటు బాలీవుడ్ లో కూడా మంచి రోల్స్ చేయాలని చూస్తుంది. బీ టౌన్ ఆడియన్స్ ని తన గ్లామర్ తో ఆల్రెడీ బుట్టలో వేసుకున్న జాన్వి కపూర్ ఇక మీదట పర్ఫార్మెన్స్ స్కోప్ ఉన్న రోల్స్ కూడా చేసి మెప్పించాలని చూస్తుంది. సౌత్ లో పెద్ది తర్వాత మళ్లీ వరుస ఛాన్స్ లు ఆశిస్తున్న అమ్మడు అటు నార్త్, సౌత్ అనే తేడా లేకుండా అందరినీ ఆకట్టుకోవాలని చూస్తుంది.

PRINTED, PUBLISHED AND OWNED BY MOHAMMED IMRAN, PRINTED AT RIMSHA PRINTERS & WEB OFFSET PRINTING PRESS, Alugunur (V), Timmapur(M),DIST. KARIMNAGAR. TELANGANA.
PUBLISHED FROM H.NO. 10-2-324/B, VIDHYANAGAR, KARIMNAGAR - 505001. EDITOR : MOHAMMED IMRAN, RNI. NO. TELTEL/2006/16536